
వెలుగుల వెనుక
కథలు
రూ॥160/- పేజీలు:160
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం





రైతులకు అందుబాటులో యూరియా : తుమ్మల

కార్మికుల పక్షపాతి రాష్ట్రంగా ప్రభుత్వం అడుగులు 03

ధాన్యం రవాణాకు అందుబాటులో లారీలు, ట్రాక్టర్లు



సంపుటి 09, సంచిక: 162 | మంగళవారం | 12-05-2026 | ఖమ్మం Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


బండి భగీరథ కేసు దర్యాప్తు

## తక్షణమే మొదలు పెట్టండి

డిజిపి సి.వి.ఆనంద్‌కు సిఎం రేవంత్ రెడ్డి ఆదేశం

విచారణ అధికారిగా డిసిపి రితిరాజ్

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై మేడ్చల్ జిల్లా పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు విచారణను తక్షణం మొదలు పెట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్‌ను ఆదేశించారు. ఈ నెల 8వ తేదీన పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు వస్తే ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని డిజిపిని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేసు వివరాలను డిజిపి ఆనంద్ సిఎంకు వివరించారు. ప్రధాన మంత్రి మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో పోలీస్ సిబ్బంది అంతా భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని సిఎంకు డిజిపి వివరించారు. కేసు సమగ్ర విచారణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని డిజిపిని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సిఎంఓ తెలియజేసింది. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్ మీద నమోదైన పోక్సో కేసుపై తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (టిజిసిపిసిఆర్) చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి స్పందించారు. నగర పోలీస్ కమిషనర్ నుంచి వివరాలు తెప్పించుకుని విచారణ కోసం ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేసినట్లు టిజిసిపిసిఆర్ కార్యలయం తెలియజేసింది.

### విచారణ అధికారిగా డిసిపి రితిరాజ్



పేట్‌బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు విచారణ బాధ్యతలను తరువాయి 8లో



భారతీయ జనతా పార్టీకి

# మళ్లీ రెండు సీట్లే...

- ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో తమిళనాడులో ఒకటి, కేరళలో మూడు సీట్లే వచ్చాయి
- బిజెపి అక్రమ గెలుపుకోసం ‘సర్’ను ప్రయోగిస్తుంది
- బిజెపి అంటే.. బ్రిటీష్ జనతాపార్టీ
- కాల్చిచంపడం కాషాయపార్టీ సిద్ధాంతం.. ఒప్పించడం మా సిద్ధాంతం
- మావోయిస్టులు, ముస్లింలు దేశప్రజాలు కాదా ?
- ప్రధాని వ్యాఖ్యలో రాజకీయం లేదు
- అభివృద్ధికి సంబంధించినవే..
- రెండేళ్లుగా కేంద్రం నుంచి ఎలాంటి సహకారం లేదు
- మోదీ పొదుపు జపం విదేశాంగ విధాన వైఫల్యానికి నిదర్శనం
- జర్నలిస్టుల ఇష్టాగోష్టిలో సిఎం రేవంత్‌రెడ్డి

“నాతో కలిసి వస్తే అనుకున్నది నెరవేరుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పిన మాటలు అభివృద్ధికి సంబంధించినవే తప్ప అందులో ఎలాంటి రాజకీయాలకు తావు లేదు. ఆయన అభివృద్ధి గురించే..నేనూ అభివృద్ధి గురించే మాట్లాడాం. మిగతావాళ్ళలాగా మా ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడదు. చట్ట ప్రకారమే నడుచుకుంటాం. నేను సిస్టమాటిక్ గవర్నెన్స్ అందిస్తా. ప్రధాని అయినా, గవర్నర్ అయినా ఇవ్వాల్సిన గౌరవం ఇస్తాను.

– ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్

రెండు ఎంపి సీట్లతో మొదలైన బిజెపి పార్టీ తిరిగి అక్కడికే చేరుకుంటుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. మొన్న జరిగిన ఎన్నికల్లో దక్షిణాదిలో బిజెపికి తమిళనాడులో ఒకటి, కేరళలో 3 సీట్లు మాత్రమే వచ్చాయన్నారు. గతంలో ఇందిరాగాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ దక్షిణాది నుంచే పునరుజ్జీవం పొందిందని, ఆమె మెదక్ నుంచే గెలిచారని, ఇప్పుడు కూడా తాము ఇక్కడ నుంచే పునరుజ్జీవం పొందుతామని విశ్వాసం వ్యక్తం చేశారు. తన నివాసంలో సోమవారం మీడియాతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణనే లక్ష్యమని, కాంగ్రెస్, బిజెపిలకు ఇక నిద్రలేని రాత్రులు తప్పవని ప్రధాని మోదీ వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. అలా కోరుకోవడంలో తప్పులేదని, కానీ కోరుకున్నవన్నీ జరగాలని లేదన్నారు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ఏమి జరిగిందో అందరికీ తెలిసిందేనన్నారు. బిజెపి కొత్తగా పశ్చిమ బెంగాల్‌లో గెలిస్తే, తాము కేరళలో గెలిచామన్నారు. బిజెపి తాము గెలవాలనుకున్న చోట ఎస్ఐఆర్ అనే ప్రమాదకరమైన ఆయుధాన్ని ప్రయోగిస్తోందని విమర్శించారు. గతంలోకాంగ్రెస్ పేరు మారిందని, అది ముస్లిం లీగ్, మావోయిస్టు, కాంగ్రెస్ పార్టీ (ఎంఎంసి) అని ప్రధాని చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ధీటుగా స్పందించారు. బిజెపి అంటే బ్రిటీష్ జనతా పార్టీ అని, దేశ ప్రజలను తరువాయి 8లో




కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై

# సెప్టెంబర్ 28న ‘చలో ఢిల్లీ’

- ఆగస్టు 6 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు
- సిపిఐ జాతీయ సమితి సమావేశాల్లో నిర్ణయం
- మీడియాకు వివరాలు వెల్లడించిన డి.రాజా

**న్యూఢిల్లీ:** కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ సమరశంఖం పూరించింది. మోదీ సర్కారు విధానాలను ఎండగడుతూ భారీ ఎత్తున దేశ వ్యాప్త నిరసనలకు పూనుకుంటున్నట్లు ప్రకటించింది. సెప్టెంబర్ 24న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిచనుంది. ఆగస్టు 6నుంచి 15వరకు దేశ వ్యాప్తంగా పాదయాత్రలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ నెల 9, 10 తేదీల్లో ఢిల్లీలో రెండు రోజులపాటు జరిగిన సిపిఐ జాతీయ సమితి సమావేశంలో ఈ మేరకు రాజకీయ కార్యాచరణను రూపొందించింది. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా సోమవారం ఢిల్లీలోని అజయ్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో పార్టీ సమితి సమావేశాల నిర్ణయాలను వెల్లడించారు. దేశం ఎదుర్కొంటున్న కీలక రాజకీయ, ఆర్థిక, సామాజిక సవాళ్లపై భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ సమితి సమావేశాలు సుదీర్ఘంగా చర్చించి, వివిధ కీలక తీర్మానాలను ఆమోదించిందని తెలిపారు. బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త పోరాటాలకు పిలుపునిచ్చిందన్నారు. ఇటీవల జరిగిన తరువాయి 8లో

## రాజీపడ్డ ప్రధాని ఇకపై... దేశాన్ని నడపలేరు



- 12 ఏళ్ల వైఫల్యాల నిందను భారత ప్రజల భుజాలపై మోపొద్దు
- మోదీ పొదుపు మంత్రం ఆయన ప్రభుత్వం వైఫల్యానికి నిదర్శనం
- లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విమర్శలు

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. పశ్చిమ ఆసియా సంఘర్షణ వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి పౌరులు చర్యలు తీసుకోవాలని ప్రధాని పిలుపునివ్వడంపై మండిపడింది. రాజీపడ్డ ప్రధాని ఇకపై దేశాన్ని నడపలేరని ఘాటు విమర్శలు చేసింది. 12 ఏళ్ల వైఫల్యాల నిందను భారత ప్రజల భుజాలపై మోపవద్దని ప్రతిపక్ష పార్టీ ప్రధానమంత్రి మోదీని కోరింది. ప్రధానమంత్రి మాటలు వైఫల్యానికి నిదర్శనం అని కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. ‘బంగారం కొనవద్దు, విదేశాలకు వెళ్లవద్దు, పెట్రోల్ తక్కువగా వాడండి, ఎరువులు, వంట నూనె తగ్గించండి, మెట్రోలో ప్రయాణించండి, ఇంటి నుంచే పని చేయండి’ అంటూ మోదీజీ ప్రజలను త్యాగాలు చేయమని పిలుపునిచ్చారని రాహుల్‌గాంధీ హిందీలో తరువాయి 12లో

## ‘విబి–జి రామ్ జి’ చట్టం జులై 1 నుంచి అమల్లోకి

కేంద్రం నోటిఫికేషన్ జారీ : ఎంజి నరేగా రద్దు

**న్యూఢిల్లీ :** రెండు దశాబ్దాల ‘మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం’ (ఎంజి నరేగా) పథానికి నరేంద్ర మోదీ సర్కార్ మంగళం పాడింది. ఈ చట్టాన్ని పునరుద్ధరించాలని దేశ వ్యాప్తంగా ప్రతిపక్షాలు, ముఖ్యంగా, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినా కేంద్రంలోని బిజెపి సర్కార్ ఖాతరు చేయలేదు. ఎంజి నరేగా స్థానంలో కొత్తగా తీసుకువచ్చిన ‘వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) చట్టం (విబి–జి రామ్ జి) దేశ వ్యాప్తంగా జులై 1వ తేదీ నుంచి అమల్లోకి తరువాయి 12లో





## ఐకెపి కేంద్రాల్లో నిర్వాహకులే ముంచేశారు

- రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకుంటున్న వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు : లాభాలు ఆర్జిస్తున్న రైస్ మిల్లర్లు
- నిజామాబాద్ జిల్లాలో విస్మయం చెందే ఘటన

ప్రజాపక్షం/నిజామాబాద్

దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఒక వైపు అవగాహన కల్పిస్తుంటే ఐకెపి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని అమ్మి రైతులు మోసపోయిన సంఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో రైతులు ఐకెపి సెంటర్‌లో ధాన్యం అమ్మగా ప్రైవేట్‌గా రూ.2600 ఉన్న ధరను ప్రభుత్వం కేటాయించిన ప్రకారం రూ.2389 అదనంగా రూ.70లు ఇస్తూ సెంటర్ నిర్వాహకులు రైస్‌మిల్లర్లతో ఒప్పందం కుదుర్చుకోవటం విస్మయానికి గురి చేసింది ? ఐకెపి సెంటర్ ద్వారా ఆర్ఎన్ఆర్ వడ్లు కొనుగోలు చేసి ఇతరుల పేరిట నమోదు చేసి రైతులను మోసం చేస్తున్నారు. ఆర్ఎన్ఆర్ వడ్లకు మార్కెట్‌లో రూ.2600 ధర ఉండగా, సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.2389కి మరో రూ.50 నుంచి 70 కలిపి రైతులకు ఇస్తామని ఒప్పందం కుదుర్చుకుని మిగతా మొత్తాన్ని మింగిస్తున్నారు. దీంతో అటు ప్రభుత్వం, ఇటు రైతులు ఇద్దరు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికీ దాదాపు 20–30 వేలకు పైబడి సంచుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలుస్తుంది. 15 వేల క్వింటాళ్లకు పైగా ధాన్యాన్ని రైతులు అమ్మినట్లు తెలుస్తుంది. అక్లూర్, పచ్చలనడ్కుడకు చెందిన రైస్‌మిల్లులకు ఈ ధాన్యాన్ని కేటాయింపు చేశారు. రైతుల వద్ద నుంచి తక్కువకు కొనుగోలు చేయటం, సంబంధిత అధికారులు సైతం నిమ్మకు తరువాయి 12లో

## మహిళా కమిషన్‌కు చైర్‌పర్సన్‌గా గద్వాల్ విజయలక్ష్మి



- సభ్యుల్లో కానోజు శంకరమ్మ, చిట్యాల స్వేత

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా జిహెచ్‌ఎంసి మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. సభ్యులుగా కానోజు శంకరమ్మ, చిట్యాల స్వేత, శశికళ యాదవ రెడ్డి, సదాలక్ష్మి, ఎన్. రాధాబాయి, ఉజ్మా అషాయి షకీరాలను ప్రభుత్వం నియమించింది. ఈమేరకు జిఎడి సోమవారం జిఓ 637 జారీ చేసింది. తెలంగాణ మహిళా కమిషన్ చట్టం 1998లోని సెక్షన్ 5 ప్రకారం ఈ నియామకాలు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. చైర్‌పర్సన్, సభ్యుల పదవీకాలం బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ఐదేళ్లపాటు కొనసాగనుంది.

## మళ్లీ భానుడు భగభగ

- రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- రానున్న రోజుల్లో ఎండలకు తోడు తీవ్ర వడగాలులు వీచే అవకాశం
- అప్రమతంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మళ్లీ ఎండలు విజృంభిస్తున్నాయి. గత వారం రోజులుగా కొంత తగ్గుముఖం పట్టిన ఎండలు ఒక్కసారిగా పెరిగాయి. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఎండలకు తోడు తీవ్ర వడ గాలులు కూడా వీచే అవకాశం ఉండడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రస్తుతం 41 డిగ్రీలుగా నమోదవుతున్న పగటి ఉష్ణోగ్రతలు తరువాయి 8లో

## రేపటి నుండి ట్రంప్ చైనా పర్యటన

- 14,15 తేదీల్లో జిన్‌పింగ్‌తో రెండుసార్లు ముఖాముఖీ
- ప్రపంచశాంతి,ద్వైపాక్షిక బంధంపై సంభాషణలు
- మా బంధం చెక్కు చెదరదు : తైవాన్ ధీమా



**బీజింగ్:** ఇరాన్ శాంతి ప్రతిపాదనను సోమవారం అమెరికా తిరస్కరించిన నేపథ్యంలో యుద్ధ వాతావరణం, చమురు సంక్షోభ పరిస్థితులమధ్య డోనాల్డ్ ట్రంప్ ఈనెల 13 నుండి 15వ తేదీ వరకూ మూడు రోజులు చైనా పర్యటనకు సిద్ధమయ్యారు. చైనా ప్రభుత్వ వర్గాలు కూడా ట్రంప్ పర్యటన తేదీలు,షెడ్యూలు ఖరారు చేశాయి. అమెరికా–చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, ప్రపంచశాంతిపై నాయకులు ఇద్దరూ ప్రధానంగా సంభాషణలు చేస్తారని చైనా విదేశీవ్యవహారాలమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గ్వో జియాకున్ సోమవారం బీజింగ్‌లో మీడియాకు చెప్పారు. ఇరుదేశాల సంబంధాలకు ఒక వ్యూహాత్మక దిశానిర్దేశం చేయడంలో ట్రంప్–జీ జిన్‌పింగ్ మధ్య దౌత్య సంబంధాలు ఒక అనిర్వచనీయమైన పాత్ర పోషిస్తాయని చెప్పారు. అస్థిరత,పరివర్తన దిశలో ప్రయాణిస్తున్న సమకాలీన ప్రపంచంలో సమానత్వం, గౌరవం, పరస్పర ప్రయోజనం,సహకార విస్తరణ,విభేదాల పరిష్కారం,మరింత సుస్థిరత వంటి అంశాల ప్రాతిపదికపై అమెరికాతో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉందని జియాకున్ చెప్పారు. ప్రపంచంలో రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలకు చెందిన నాయకులు ఇద్దరూ వాణిజ్య ఒప్పందం చేసుకుంటారని అంచనా వేస్తున్నారు. ఇరు దేశాలమధ్యా టారిఫ్‌ల సమస్య ప్రధాన ఆటంకంగా ఉంది. అదేవిధంగా ఇరాన్ నుండి అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్న చైనాకు అమెరికా బ్లాకేడ్ కారణంగా తీవ్ర సమస్యలు వచ్చాయి. ఈ అంశం కూడా చర్చల్లో చోటుచేసుకునే అవకాశం ఉంది. హోర్ముజ్ జలసంధిని తెరిపించాలని చైనా ఇప్పటికే అనేకసార్లు తరువాయి 12లో

## కేంద్ర ఆర్థిక విదేశాంగ విధానాలు బట్టబయలు

వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే మోదీ మతం కార్డు : కూనంనేని



ప్రజాపక్షం/హైదరాబాద్

వంట నూనె, పెట్రోలు, డీజిల్ వాడకం తగ్గించాలి, బంగారం కొనొద్దు అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ చేసిన వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక, విదేశాంగ విధానాల దివాళాకోరుతనాన్ని బట్టబయలు చేసిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. తమ దివాళా కోరుతానాన్ని కప్పిపుచ్చుకుని, దేశ ప్రజల దృష్టి మళ్ళించేందుకే మతం పేరుతో రెచ్చగొట్టే విధంగా హైదరాబాద్ సభలో ప్రధాని ప్రసంగించడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ధరల భారంతో సతమతమవుతున్న సామాన్యుల నడ్డివిరిచే రీతిలో త్వరలో ధరల పెంపును ఆయన పరోక్షంగా సంకేతాలిచ్చారన్నారు. ప్రధానికి చిత్తశుద్ధి ఉంటే దేశ ప్రజలకు పొదుపు చర్యలను సూచించే ముందు, దేశంలో శతకోటీశ్వరులపై 2 నుంచి 6 శాతం సంపద పన్ను తరువాయి 8లో

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
మంగళవారం
12-05-2026
www.prajapaksham.in

# ఎడిట్
PEOPLE'S VIEWS

## పొదుపు పాటింపునకు ప్రధాని హితవు

పశ్చిమాసియాలో ఇరాన్‌తో అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా అనేక దేశాలతోపాటు మన దేశం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం సాయంత్రం తొలిసారి హైదరాబాద్ బహిరంగసభలో వెల్లడించారు. ఒకవైపు, డాలర్‌తో రూపాయి మారకపు విలువ పడిపోతున్న దశలో విదేశీ మారక ద్రవ్యం వ్యయాన్ని ఆదా చేసుకోవలసిన అవసరాన్ని నొక్కి చెబుతూ అందుకుగాను ప్రజలు పలు వ్యయకర్తన చర్యలు పాటించాలని హితోపదేశాలు చేశారు. ఫిబ్రవరి 28 న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైన తదుపరి ప్రధాని నోట ఇటువంటి ప్రకటన రావటం ఇదే మొదటిసారి. మన దేశం యుద్ధంలో భాగ స్వామికాకపోయినా ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఎంతో భారంగా తయారైన వాస్తవాన్ని ప్రధాని ప్రసంగం వెల్లడించింది. గడచిన రెండు మాసాలకు పైగా పెట్రోలు, డీజిలు రేట్లు పెంచకుండా ఆయిలు కంపెనీలు లక్షకోట్లకుపైగా నష్టాల్లో కూరుకుపోయినట్లు వెల్లడైనందున రానున్న రోజుల్లో రిటైల్ ధర పెంపుదలకు ప్రజలను మానసికంగా తయారు చేస్తున్నట్లుగా సాగింది ప్రధాని ప్రసంగం.

ఇందుకు హైదరాబాద్ సభను ఎంచుకోవటం ఆర్థిక సంక్షోభ పరిస్థితి తీవ్ర స్థాయికి చేరినట్లు విదితం చేస్తున్నది. అసోం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బిజెపి విజయం తర్వాత, బిజెపి తర్వాత గమ్యం తెలంగాణనే అని కార్యకర్తల్లో ఉత్సాహం నింపటానికి రాష్ట్ర బిజెపి నాయకత్వం ఈ ఎండల్లో ఎంతో శ్రమించి ప్రధాని సభ ఏర్పాటు చేసి జనాలను సమీకరించారు. ప్రధాని కొన్ని అధికారిక ప్రారంభోత్స వాలు, శంకు స్థాపన కార్యక్రమాలను జతచేసుకుని హైదరాబాద్ పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ గృహాలకు వెళ్లి వారితో చర్చించారు. పవన్ కల్యాణ్ సైనస్‌కు శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుం టున్నందున ప్రధానిది లాంఛనపూర్వక పరామర్శే కావచ్చు. కాని చంద్రబాబు నాయుడు, లోకేశ్‌లతో గంటపాటు చర్చల్లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అంశాలతో పాటు తెలంగాణలో బిజెపి అభివృద్ధికి వారు చేయగలిగిన సహాయం తప్పక చర్చకు వచ్చి ఉంటుంది. ఎందుకంటే, కాంగ్రెస్ ముక్త భారత్ కోసం మోదీ తపిస్తు న్నారు. బిజెపి బహిరంగసభలో కూడా ప్రధాని మోదీ ముఖ్యంగా బెంగాల్ ఎన్ని కల్లో విజయం ఉత్సాహాన్ని కార్యకర్తల్లో నింపటానికి ప్రయత్నించారు. 'అబ్ కి బార్ తెలంగాణా మే బిజెపి సర్కార్' అని నినదిస్తూ, గ్రామస్థాయి నుంచి బిజెపిని బలో పేతం చేసేందుకు తీవ్రంగా కృషి చేయాలని కార్యకర్తలను ఉద్బోధించారు. రానున్న కాలంలో వ్యూహకర్త అమిత్ షా హైదరాబాద్ రాకపోకలు పెరుగుదలను ఊహించవచ్చు. ఆయన తమ మిషన్‌కోసం బిజెపి రాష్ట్ర నాయకుల్లో ఐక్యతను సాధించాల్సి ఉంటుంది. ఆ ఐక్యతను కింది స్థాయి వరకు తీసుకెళ్లాల్సి ఉంటుంది.

అయితే కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లను చీల్చిచెండాడి బిజెపి కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతారని ఆశించిన బిజెపి రాష్ట్ర నాయకులకు, ప్రధాని ఆ పార్టీలపై స్వల్ప విమర్శల తదుపరి అనూహ్యంగా దేశంపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావం వైపు తన ప్రసంగాన్ని మళ్లించటం ఆశ్చర్యం కలిగించి ఉంటుంది. ప్రధాని పొదుపు చర్యల ప్రసంగానికి దేశ ప్రజలను ఉద్దేశించి దూరదర్శన్, ఆకాశవాణి ప్రసంగాన్నో లేక తన మన్ కీ బాత్ ప్రసంగాన్నో లేక దేశ రాజధానిలో ఏదైనా పెద్ద సభనో ఎంచు కుని ఉండేది. ప్రభావం బలంగా ఉంటుంది. ప్రధాని చెప్పిన పొదుపుల మాటెలా ఉన్నా, డీజిల్, పెట్రోలు ధరల పెంపుదలకు ప్రజల్ని మానసికంగా సమాయత్తం చేయటం ఆయన ఉద్దేశంగా ఉంది. ఆ మరునాడే (సోమవారం) ఢిల్లీ నుంచి చమురు కంపెనీలు లక్షకోట్లు అప్పులో పడ్డాయని, రోజూ రూ.17వందల కోట్లు నష్టపోతున్నాయని అధికారిక ప్రచారం మొదలైంది. మంత్రుల బృందం, ఆయిలు మంత్రిత్వశాఖ అధికారులు సమీక్ష సమావేశం జరిపారు. సంక్షోభంలో సైతం రెండు నెలలుగా పెట్రోలు, డీజిలు ధరలు పెంచలేదని సానుభూతి పొందే మాటలు చెబుతున్నారు.

ప్రధాని హితబోధలు అమలు చేయగలిగితే దేశానికి మేలు చేసేవే. దేశ ఇంధన అవసరాల్లో 80 శాతం దిగుమతులపై ఆధారపడిన దేశంగా, ఇరాన్ యుద్ధం తదు పరి గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నాం. క్రూడ్ ధర పెరిగి అదనంగా చెల్లించుకో వటం భారంగా తయారైంది. అందువల్ల ప్రజలు వాడుక తగ్గించుకోవాలి, ప్రభుత్వ రవాణాను విరివిగా ఉపయోగించాలి, కరెంటు వాహనాలను ఉపయోగించాలని ప్రధాని కోరారు. మధ్యతరగతులు ఆడంబరాలు తగ్గించుకోవాలి, విదేశీ యాత్రలు మానుకోవాలి, ప్రజలు బంగారం కొనుగోలును సంవత్సరంపాటు మానివేయాలి. రైతులు ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ వ్యవసాయం వైపు మళ్లాలి. గృహి ణులు వంట నూనెల వినియోగం తగ్గించుకోవాలి వగైరా ప్రధాని విజ్ఞప్తుల్లో ఉన్నాయి. పైన ప్రస్తావించిన వస్తువులకు ఎక్కువగా దిగుమతులపై ఆధారపడు తున్నాం. విదేశీ మారకంలో చెల్లించాల్సి వస్తోంది. అందువల్ల విదేశీ మారక ద్రవ్యం పొదుపు దృష్టి నుంచి ప్రధాని ఈ విజ్ఞప్తులు చేశారు. పై చర్యలు యుద్ధకా లంలోనే కాదు, ఎల్లవేళలా ఒక ఉద్యమంలా ప్రచారంలో పెట్టదగినవి. ప్రభుత్వా నికి చిత్తశుద్ధి ఉంటే బంగారం దిగుమతులపై కోత విధించవచ్చు. సేంద్రియ వ్యవ సాయానికి ప్రోత్సాహకాలు పెంచవచ్చు. వ్యక్తిగత కార్ల అమ్మకాలను అభివృద్ధికి సూచికగా ప్రచారం చేస్తూ పెట్రోలు, డీజిలు తగ్గించండి, కార్ల ప్రయాణాలు తగ్గిం చండి అని కోరటంలో అర్థం లేదు. స్వదేశీ ప్రత్యామ్నాయాలకు ప్రాధాన్యత ఇవ్వటమే నిరంతరం ఉపశమన మార్గం. ●



## లోక్‌సభ స్థానాలను 850కి పెంచడం జోక్

**లోక్‌సభ సభ్యుల సంఖ్యను 850కి పెంచాలన్న ప్రతిపాదన తీవ్ర అభ్యంతరకరం. అంత పెద్ద సభ ఉంటే అది చర్చలు జరిగే పార్లమెంట్ కాకుండా చైనా పీపుల్స్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్‌లా మారిపోతుంది. 850 మంది సభ్యులతో ఉన్న సభలో ఎవరికి మాట్లాడే అవకాశం ఉండదు. అమెరికాలో 1929 నుంచి అక్కడ సభ్యుల సంఖ్య 435గానే ఉంది. అప్పటి నుంచి అమెరికా జనాభా మూడు రెట్లు పెరిగినా సభ పరిమాణాన్ని పెంచలేదు. పెద్ద సంఖ్యలో సభ్యులు ఉంటే పార్లమెంటరీ చర్చల నాణ్యత తగ్గిపోతుంది. డీలిమిటేషన్ కారణంగా దక్షిణ రాష్ట్రాలు రాజకీయంగా డిసెన్‌ఫ్రాంచైజ్ అయిన భావనకు లోనయ్యే ప్రమాదం ఉంది.**

- కాంగ్రెస్ ఎంపి శశి థరూర్



## విప్లవోద్యమ సేనాని మద్దికాయల ఓంకార్

రాజకీయాలు అంటే వ్యాపారమని, ఎన్నికలు అంటే డబ్బు, మద్యం, కాను కలు, అమలుకాని వాగ్దానాలు, కులమత, ప్రాంతీయ బేధాలు రెచ్చకొట్టడ మేనని, నాయకుడు అంటే ధనబలం, మందబలం గల వాడని నేటి ఆధునిక తరా నికి బహిరంగంగానే అర్థం అవుతుంది. మూడు నాలుగు దశాబ్దాల క్రితం ఆనాటి వ్యవస్థలో ఇన్ని ఉన్నా రాజకీయలన్నా, నాయకులన్నా విలువలు, గౌరవం, రాజ్యంగబద్ధమైన ఎన్నికల వ్యవస్థ కొంత ఉండేది. అలాంటి వ్యవస్థలో కూడ అవి నీతికి, అవకాశవాదానికి తలొగ్గకుండా రాజకీయ విలువలకు నిలువెత్తు నిదర్శ నంగా నిలిచి, స్వార్థమెరుగని నిస్వార్థ జీవిగా అందరు మెచ్చిన ప్రజా నాయకు నిగా పేరు పొందినారు కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ గారు. ఓంకార్ పుట్టి 2026 మే 12 నాటికి వందేళ్లు.

1926 మే 12 న నేటి సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) మండలం, ఏపూ రులో మద్దికాయల రామయ్య, అనంత లక్ష్మి దంపతులకు మొదటి సంతానంగా ఓంకార్ గారు జన్మించారు. ఏపూరులో నాల్గవ తరగతి వరకు చదివి ఆ తరువాత పెద్దగా పై చదువులు చదువలేదు. నాటి రాజకీయ, సామాజిక పరిస్థితులు ఓంకార్ గారిని పదిహేనేళ్ళ వయస్సులో రాజకీయాలవైపు నడిపించాయి. నాటి హైదరాబాద్ సంస్థానంలోని నిజాం నవాబు దుర్మార్గపు పాలన ప్రజల తిరుగుబా టుకు, సాయుధ పోరాటానికి దారితీసింది. ఆ నిజాం దుర్మార్గపు పాలననే ఓంకార్ గారి చేత తుపాకి పట్టించింది. 1946 నుండి 1951 వరకు విరామం ఎరుగక జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆయుధం చేత పట్టి నిజాం రాజాకారులపై, భూస్వాములపై, దొరలగడీల పాలన, అరాచకాలపై, అన్యాయాలపై తిరగబడి ఓంకార్ గారు పోరాడినారు. అందుకుగాను నిజాం ప్రభుత్వం ఓంకార్ తలకు వెలకట్టింది. అయినా మొక్కవోని ధైర్యంతో కామ్రేడ్స్ పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణ రెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నర్సింహ్మారెడ్డి (బి.యన్) లాంటి అగ్రనాయకులతో కలిసి పలు ప్రాంతా లలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ ఆ పోరాటానికి చివరి వరకు నాయకత్వం వహించారు. పోరాట విరామం అనంతరం ఆదివాసి గిరిజనులను సమీకరించి వారి హక్కుల కోసం పోరాడినారు. కౌలు రైతులను సమీకరించి పోరాడి కౌలు దారు చట్టాన్ని సాధించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూస్వాముల భూములను లక్ష అరవై వేల ఎకరాలను పేదలకు పంచారు.

మార్క్సిస్టు పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించారు. పార్టీలో వచ్చిన సైద్ధాం తిక విభేదాల కారణంగా 1984లో ఎంసిపిఐ ని ఏర్పాటు చేశారు. కుల, మత, ఆర్థిక, సామాజిక అసమానతలు లేని భారతదేశ వ్యవస్థ ఉండాలంటే వర్గ సామా జిక జమిలి పోరాటాలు బలపడాలని, చీలికలుగా ఉన్న కమ్యూనిస్టు పార్టీల ఐక్య తకు నిరంతరం ప్రయత్నించారు. కమ్యూనిస్టు, సామాజిక శక్తుల ఐక్యత, సమీక రణ పోరాటాలతో ముందుకు సాగేందుకు ఎంసిపిఐ(యు) కొనసాగిస్తూ వచ్చారు. నూటికి 93% ఉన్న ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ బహుజన ప్రజానీకానికి ఆర్థిక, రాజకీయ, సామాజిక సమన్యాయం జరగాలని పార్టీ కార్యక్రమాలను బలో పేతం చేశారు. దేశంలో ఆర్థిక పోరాటాలతో పాటు సామాజిక పోరాటాలు బలపడా లని, దాని ద్వారా మనువాద, పెట్టుబడిదారి దోపిడిదారీ వ్యవస్థ అంతమౌతుందని తపించారు.

పుట్టింది దిగువ మధ్య తరగతి కుటుంబంలో అయినా, ఆయన జీవితకాల మంతా అట్టడుగు ప్రజల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం అలు పెరుగని పోరాటాలు చేస్తూ వచ్చారు. మార్క్సిస్టు, సైద్ధాంతిక నిబద్ధత గల ఓంకార్ గారిని వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గ ప్రజలు 1972 నుండి 1994 వరకు అత్యధిక మెజార్టీతో ఐదుసార్లు శాసనసభకు ఎన్నుకున్నారు. నర్సం పేట నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికి యావత్ ఉమ్మడి రాష్ట్ర ప్రజల సమస్య లపై చట్టసభలలో ప్రజల గళం వినిపించేవారు. చట్టసభలను వేదికగా చేసుకొని ప్రజా సమస్యలపై గర్జించిన ఓంకార్‌గారిని 'అసెంబ్లీ టైగర్'గా ప్రజలు అభివర్ణిం చారు. బూటకపు ఎన్‌కౌంటర్లను వ్యతిరేకిస్తూ 'నక్సలిజం ప్రభుత్వ వైఖరి' అనే అంశంపై శాసనసభలో ఏకధాటిగా రెండున్నర గంటలు ప్రసంగించి శాంతిభద్ర తల విషయంలో ప్రభుత్వం 'భార్గవ కమీషన్' (ఏకసభ్య కమీషన్) వేయించడంలో ఓంకార్ గారి పాత్ర అమోఘమైనది. కేంద్ర ప్రభుత్వం చేతిలో పరిమిత అధికా రాలు ఉండి, రాష్ట్ర ప్రభుత్వాల చేతిలో అధిక అధికారాలు వుండాలని శాసన సభలో అనేకసార్లు పోరాడినారు. ఆయన పోరాట ధోరణి, ముక్కుసూటి తత్వం, అనుసరించే రాజకీయ పంథాను జీర్ణించుకోలేని భూస్వాములు, గూండాలు, రాజకీయ ప్రత్యర్థులు ఆయనపై కత్తి పోట్లతో, బాంబుదాడులతో, స్టెన్‌గన్ కాల్పు లతో అరడజనుసార్లకు పైగా హత్యా ప్రయత్నం చేశారు. కత్తిపోట్లు, బాంబు దాడులు మృత్యువుకు తలవంచి సలాం చేశాయి తప్ప ఓంకార్ గారిని హతమార్చ లేకపోయినాయి. అనేకమార్లు చావు నుండి బయటపడి తన చివరి జీవించి ఉన్నం తకాలం ఒంటి నిండా బుల్లెట్లు మోస్తూ జీవించిన ఆయనను ప్రజలు మృత్యుంజ యుడని పిలుచుకున్నారు.

నిస్వార్థత, రాజకీయ నిబద్ధత కలిగిన నాయకులు కానరాని నేటి అసమా నతల వ్యవస్థను మార్చవలసిన గురుతర బాధ్యత నేటి ఆధునికతను పరిశీలించే తరంపై వుంది. ఓంకార్ గారి లాంటి సైద్ధాంతిక, రాజకీయ నిబద్ధత కల్గిన నాయ కుల ఆదర్శ జీవితాలను నెమరువేసుకొని నేటి సమాజ మార్పుకు ప్రజలు ముఖ్యంగా యువత ముందుండవలసిన అవస రం ఎంతైనా వుంది. 2026 మే 12 నాటికి అందరు మెచ్చిన నాయకుడు కామ్రేడ్ మద్దికాయల ఓంకారు గారు జన్మించి వందేళ్లు, ఆయన శతజ యంతి వార్షికోత్సవాన్ని 2025 మే 12 నుండి 2026 మే 12 వరకు సంవత్సరకాలం పాటు పాటించారు. ఉద్యమాల గడ్డ వరంగల్ జిల్లా నర్సంపేటలో 2026 మే 12న కమ్యూని స్టు, సామాజిక శక్తుల ఐక్యతతో అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ గారి శతజయంతి వార్షికో త్సవ ముగింపు సభ నిర్వహించడం జరుగుతుంది.

**(నేడు శతజయంతి వార్షికోత్సవం)**



వనం సుధాకర్
9989220533

## సమాన వాటాతోనే సామాజిక న్యాయం సాధ్యం



డా.నాగం కుమారస్వామి
అసిస్టెంట్ ప్రొఫెసర్,
పాలమూరు యూనివర్సిటీ
832 846 7733

సామాజిక న్యాయమే లక్ష్యంగా సబ్బండ కులాలు పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర రాజ కీయ పరిణామ క్రమం లో 'ఎవరి కులం ఎంతో వారికి అంతా వాటా' (Proportional Repre sentation) అనేది కేవలం ఒక నినా దం మాత్రమే కాదు. అది సామాజిక పునర్నిర్మాణా నికి ఆధారమైన సిద్ధాంతంగా రూపు దిద్దుకుంటోంది. ప్రజాస్వామ్య వ్యవ స్థలో పంపిణీ న్యాయం (distribu tive Justice) సాధ్యమవ్వాలంటే, వనరులు, అవకాశాల పంపిణీ జనాభా నిష్పత్తికి అనుగుణంగా ఉండాలి. ఇటీవల విడుదలైన తెలంగాణ సామాజిక, ఆర్థిక సర్వే– 2024 నివేదికలోని గణాంకాలు ఈ ధర్మబద్ధమైన వాదనను మరింత బలపరుస్తున్నాయి. రాష్ట్రంలోని వివిధ సామాజిక వర్గాల మధ్య ఉన్న సామాజిక, ఆర్థిక, రాజ కీయ అసమానతలను ఈ నివేదిక స్పష్టంగా, విమర్శనాత్మకంగా వెలుగు లోకి తీసుకొచ్చింది. ముఖ్యంగా జనాభా ప్రాతిపదికన రాజకీయ భాగ స్వామ్యం, భూపంపిణీ, ఉపాధి, విద్య, ఆరోగ్య రంగాల్లో తరతరాలుగా జరుగుతున్న అన్యాయాన్ని సమన్యాయ దృక్పథంతో విశ్లేషించవలసిన చారిత్రిక అవసరం ఎంతైనా ఉంది.

**భూమి యాజమాన్యం, జనాభా నిష్పత్తి:**

భూమి అనేది కేవలం ఆర్థిక వనరు మాత్రమే కాదు; అది సామాజిక హోదా, రాజకీయ అధికారానికి మూలాధారం. తెలం గాణ సామాజిక, ఆర్థిక సర్వే–2024 ప్రకారం, రాష్ట్రంలో భూమి పంపిణీలో తీవ్ర అసమానతలు కొనసాగుతున్నాయి. కేవలం 15% జనాభా ఉన్న అగ్రవర్ణాలు 32% యాజమాన్యాన్ని కలిగి ఉన్నాయి. వారిలో భూమిలేనివారు కేవలం 18.6% మాత్రమే. 56% జనాభా ఉన్న బిసిలు 48% భూమికే పరిమితమై, వారిలో 44%మంది భూమిలేని వారుగా ఉన్నారు. 17.5% ఉన్న ఎస్‌సిలు 9% భూమికే పరిమితమై, 68% మంది భూమిలేని నిరుపేదలుగా ఉన్నారు. ఇక 10% జనాభా ఉన్న ఎస్‌టి లు 8% భూమి ని కలిగి ఉన్నప్పటికీ, అధిక భాగం వివాదాస్పద పోడు భూములే. 12% ఉన్న ముస్లిం మైనారిటీలకు కేవలం 2% భూమి మాత్రమే అందు బాటులో ఉంది. ఈ గణాంకాలు 'జనాభాకు తగ్గ వాటా' అనే డిమాండ్ వెనుక ఉన్న సామాజిక న్యాయ అవసరాన్ని స్పష్టం చేస్తుంది.

**ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల రంగాలలో ఉపాధి వాటా :**

ఉద్యోగ రంగంలో సామాజిక వర్గాల మధ్య తీవ్రమైన అసమానత లు కొనసాగుతున్నాయి. ప్రభుత్వరంగంలో రిజర్వేషన్ల కారణంగా బిసి, ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు కొంత ప్రాతినిధ్యం లభిస్తున్నప్పటికీ, అది వారి జనాభా నిష్పత్తికి సరిపోవడం లేదు. రాష్ట్ర జనాభాలో కేవలం 15% ఉన్న అగ్రవర్ణాలు గ్రూప్1, గెజిటెడ్ హోదాల్లో 40%కు పైగా వాటాను కలిగి ఉండటం గమనార్హం. ప్రైవేట్ రంగంలో పరిస్థితి మరింత అసమా నంగా ఉంది. ఐటి, కార్పొరేట్ రంగాల్లో ఉన్నత ఉద్యోగాల్లో దాదాపు 75% అవకాశాలు అగ్రవర్ణాలకే కేంద్రీకృతమయ్యాయి. 56% జనాభా ఉన్న బిసిలకు ప్రభుత్వ రంగంలో సుమారు 41% ప్రాతినిధ్యం ఉన్నప్ప టికీ, ప్రైవేట్ రంగ నిర్ణయాత్మక పదవుల్లో కేవలం 25% వాటా మాత్రమే ఉంది.

ఎస్‌సిలు ప్రభుత్వరంగంలో సుమారు 14% ప్రాతినిధ్యం కలిగి ఉండగా, ప్రైవేట్ రంగంలో అది కేవలం 5.4% మాత్రమే. ఎస్‌టిలకు ప్రభుత్వరంగంలో 8% ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ, ప్రైవేట్ రంగంలో వారి వాటా కేవలం 2.1% మాత్రమే. ముస్లిం మైనారిటీలలో విద్యా, నైపుణ్య సామర్థ్యాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వ రంగంలో వారికి కేవలం 4.2% అవ కాశాలు మాత్రమే. ప్రైవేట్‌రంగంలో కూడా వారి వాటా 6% కే పరిమిత మవుతోంది. ఈ గణాంకాలన్నీ కలిపి చూస్తే, ఉద్యోగ రంగంలో సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు లేదా కనీసం సామాజిక వైవిధ్య విధానాలు అమలు చేయాల్సిన అవసరం ఎంత అవసరమో స్పష్టమవుతోంది.

**విద్య సౌకర్యాల లభ్యత**

రాష్ట్రంలో విద్యారంగంలో నాణ్యమైన విద్య, అవకాశాల అందుబా టులో స్పష్టమైన సామాజిక అసమానతలు కనిపిస్తున్నాయి. సామాజిక, ఆర్థిక సర్వే–2024 ప్రకారం, ప్రతిష్టాత్మక ప్రైవేట్, అంతర్జాతీయ పాఠ శాలల్లో 70% విద్యార్థులు అగ్రవర్ణాలకు చెందినవారే. మరోవైపు, బిసిలు 58%, ఎస్‌సిలు 78%, ఎస్‌టిలు 84%, మైనారిటీ లు 67% వర్గాలు ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాసంస్థలపైనే ఆధార పడుతున్నాయి. ఉన్నత విద్యలో అగ్రవర్ణాల ఆధిపత్యం స్పష్టంగా కనిపి స్తోంది. 56% జనాభా ఉన్న బిసిలకు నాణ్యమైన ఉన్నత విద్యలో కేవలం 22% అవకాశాలే లభిస్తున్నాయి. ఎస్‌టి విద్యార్థులకు సాంకేతిక విద్యలో అవకాశాలు కేవలం 3%కే పరిమితమయ్యాయి. ఈ పరిస్థితులు 'విద్య అందరికీ సమాన హక్కు' అనే రాజ్యాంగ ఆశయం ఇంకా పూర్తిగా ఆచరణలోకి రాలేదని స్పష్టమవుతోంది.

**ఆరోగ్య సౌకర్యాల అందుబాటు :**

ఆరోగ్యరంగంలో కూడా సామాజిక వర్గాల మధ్య తీవ్రమైన అసమా నతలు కొనసాగుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ, కార్పొరేట్ ఆసుపత్రుల




సేవలను వినియోగిస్తున్న వారిలో దాదాపు 85% మంది అగ్రవర్ణాలకు చెందినవారే. మరోవైపు, ఆరోగ్య అవసరాల కోసం బిసి, ఎస్‌సి, ఎస్‌టి వర్గాలు ప్రధానంగా ప్రభుత్వ ఆసుపత్రులపైనే 85–90% ఆధారపడుతు న్నాయి. వ్యక్తిగత ఆరోగ్య బీమాలో అగ్రవర్ణాల వాటా 60% కు పైగా ఉండగా, ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో ఆరోగ్య బీమా కలిగినవారు 4% లోపే ఉన్నారు. వైద్య ఖర్చుల కోసం అప్పులు చేస్తున్న కుటుంబాలు ఎక్కువగా బిసి, ఎస్‌సి వర్గాల్లోనే నమోదవుతున్నాయి. ముస్లిం మైనారిటీలలో నాణ్యమైన ప్రైవేట్ వైద్య సేవలు పొందుతున్న వారు కేవలం 5% మాత్రమే. ఈ గణాంకాలు ప్రజల ఆర్థిక స్థితిగతులు, ఆరోగ్య సేవల ప్రాప్యత కూడా ఆర్థిక, సామాజిక అసమానతల ఆధారంగానే కొనసాగు తున్నదని స్పష్టం చేస్తున్నాయి.

**జనాభాలో సింహభాగం– రాజకీయాల్లో అల్పభాగం:**

తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో 'ఎవరి కులం ఎంతో వారికి అంత వాటా' అనే నినాదం ఇప్పుడు కేవలం సామాజిక డిమాండ్ కాదు; అది ప్రజాస్వామ్య సమానత్వానికి సంబంధించిన రాజకీయ అనివార్య తగా మారుతోంది. జనాభా ప్రాతిపదికన రాజకీయ అధికారం పంపిణీ కావాలనే సూత్రం అమలులో తీవ్ర అసమానతలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర జనాభాలో 15%లోపు ఉన్న అగ్రవర్ణాలు మాత్రం 40– 50% రాజకీయ అధికారాన్ని నియంత్రిస్తున్నాయి. ముఖ్యమంత్రి పీఠం నుంచి కీలక మంత్రిత్వ శాఖల వరకు అధికార కేంద్రీకరణ వీరి చేతుల్లోనే కొనసాగు తోంది. జనాభాలో 56% ఉన్న బిసిలకు అసెంబ్లీలో 21%, పార్లమెంట్‌లో 23% ప్రాతినిధ్యం మాత్రమే లభించడం రాజకీయ అన్యాయాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. ముఖ్యంగా అత్యంత వెనుకబడిన బిసి కులాలకు రాజ కీయ అవకాశాలు దాదాపు నామమాత్రంగానే ఉన్నాయి. ఇక ఎస్‌సిలు రాష్ట్ర జనాభాలో సుమారు 17.5%, ఎస్‌టిలు దాదాపు 10% ఉన్నారు. రాజ్యాంగబద్ధ రిజర్వేషన్ల ప్రకారం ఎస్‌సిలకు 19 అసెంబ్లీ స్థానాలు (16%), ఎస్‌టిలకు 12 స్థానాలు (10%)కేటాయించబడ్డాయి. అయితే, ఎస్‌సి, ఎస్‌టి రిజర్వ్‌డ్ స్థానాల ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధులు తమ వర్గాల గళాన్ని వినిపించడాని కే పరిమితమవుతున్నారా? లేదా కీలక మైన నిర్ణయాత్మక పదవులను అధిరోహిస్తున్నారా అనేది ప్రశ్నార్థకం. ఎస్‌సి, ఎస్‌టిలకు రాజ్యాంగ రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, అవి గుణాత్మక రాజకీయ ప్రాతినిధ్య విస్తరణకు కాకుండా పరిమిత సింబాలిక్ ప్రాతిని ధ్యంగా మారాయని విమర్శలు వినిపిస్తున్నాయి. జనరల్ స్థానా ల్లో ఈ వర్గాలకు అవకాశాలు దక్కకపోవడం ఆందోళనకరం. జనాభా లో 12% ఉన్న ముస్లింలకు అసెంబ్లీలో కేవలం 6–7% ప్రాతినిధ్యం మాత్రమే ఉంది. ఈ ప్రాతినిధ్యం కూడా ప్రధానంగా హైదరాబాద్ మహానగరం లోని పాతబస్తీతోపాటు, కొన్ని పట్టణ ప్రాంతాలకే పరిమిత మై ఉంది. అగ్రకుల ,మనువాద రాజకీయ పార్టీలన్నీ బిసిలను ప్రధానంగా 'ఓటు బ్యాంక్'గా ఉపయోగిస్తున్నాయే తప్ప, వారి జనాభాకు తగిన స్థాయిలో అసెంబ్లీ, పార్లమెంట్ టికెట్లు కేటాయించడంలో తీరని అన్యాయం జరుగుతుంది. ఈ పరిస్థితులే 'జనాభాకు తగ్గ రాజ కీయ వాటా' అనే డిమాండ్‌కు మరింత బలం చేకూరు స్తున్నాయి.

**బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీల తక్షణ కర్తవ్యం**

రాష్ట్రంలోని బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ వర్గాలు రాజ కీయ, ఆర్థిక, విద్య, ఉపాధి, ఆరోగ్య రంగాల్లో తీవ్రమైన అస మానతలు ఎదుర్కొంటున్నాయనే విషయం తాజా గణాం కాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో డా.విశారదన్ మహారాజ్ నాయకత్వంలోని బిసి, ఎస్‌సి, ఎస్‌టి, జెఎసి ఈ నెల 5న నిజామాబాద్‌లో నిర్వహించిన 'ఎవరి కులం ఎంతో వారికి అంతా వాటా' మహాసభ సామాజిక న్యాయ ఉద్యమా నికి కొత్త దిశను చూపింది. రాష్ట్ర జనాభాలో 85%కు పైగా ఉన్న అణగారిన వర్గాలు రాజకీయంగా ఐక్యమైతేనే నిజమైన రాజ్యాధికారం సాధ్యమవుతుందని సభ పిలుపునిచ్చింది. ఓటు వేసేది అణగారిన వర్గాలు — అధికారాన్ని అనుభవించేది అగ్రవ ర్ణాలు అనే దశాబ్దాల రాజకీయ ఆధిపత్యానికి ముగింపు పలకాలంటే, రాబోయే ఎన్నికల్లో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ జనాభా నిష్పత్తికి అనుగుణంగా టికెట్లు, పదవులు, రాజకీయ భాగస్వామ్యం సాధించుకో వడమే ప్రధాన లక్ష్యంగా ఈ వర్గాలు సంఘటితమవాల్సిన అవసరం ఉంది. జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ భాగస్వామ్యం, టికెట్లు, పదవులు సాధించుకోవాలంటే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ మేధావులు తమ మేధోశక్తిని సమాజ చైతన్యానికి వినియోగించాలి. యువత తమ ఆత్మగౌరవాన్ని గుర్తించి, అమ్ముడుపోని రాజకీయ శక్తిగా అవతరించాలి.

ఉద్యోగులు, ఆర్థికంగా ఎదిగిన వర్గాలు తమ సామర్థ్యానికి అనుగు ణంగా ఈ సామాజిక రాజకీయ ఉద్యమాలకు ఆర్థిక, మానసిక బలాన్ని అందించాలి. అణగారిన వర్గాల నాయకులు ఇప్పటికైనా మేల్కొని మహాత్మా జ్యోతిరావు పూలే, డా.బి.ఆర్.అంబేద్కర్, కాన్షీరాం స్ఫూర్తితో స్వశక్తి, స్వాభిమానం,ఆత్మగౌరవ రాజకీయాల నిర్మాణానికి కట్టుబ డాలి. 'ఎవరి కు లం ఎంతో వారికి అంతా వాటా' అనే నినాదాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని కొనసాగుతున్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి ఐక్య పోరాటా లకు అండ గా నిలవాలి. అప్పుడే పోరాడి సాధించుకున్న తెలంగాణలో సామాజిక న్యాయం నిజమైన ప్రజాస్వామ్య పునాదిగా వికసిస్తుంది.

## ఎన్నికలు కమ్యూనిస్టుల భవిష్యత్‌కు గీటురాయి కాదు

దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత ఇప్పుడు కమ్యూ నిస్టు పార్టీల ఉనికి, మనుగడ, భవిష్యత్తుపై విస్తృత చర్చ సాగు తుంది. కుహనా మేధావుల మొదలు కమ్యూనిస్టు వ్యతిరేకులు, మతో న్మాదులు 'ఉన్న ఒక్క రాష్ట్రం చేజారింది. ఇక ఇంతే' అని మాట్లాడుతు న్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ అయినా ఓడిపోవచ్చు. కనిష్ట ఫలితా లను పొందవచ్చు. అయినా వాటికి మనుగడ ఉంటుంది. కానీ కమ్యూ నిస్టులకు మాత్రమే మనుగడ ఉండదన్న ఈ హితోపదేశం వెనుక స్వార్థాన్ని ప్రజలు గమనించాల్సి ఉంది. ఈ ప్రచారం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. ఎవరు ఎలా ఉన్నా ఈ దేశంలో కమ్యూనిస్టులు ఉండకూడ దను కుంటున్న వ్యక్తులు, శక్తులు, సంస్థలు ఈ ప్రచారాన్ని సాగిస్తు న్నాయి. ప్రజలకు కమ్యూనిస్టులను దూరం చేసే ప్రయత్నంలో భాగమే 'ఇక కమ్యూనిస్టుల పని అయిపోయిందన్న' ప్రచారం లేదా ఇక తిరిగి కోలుకోలేరన్న వితండవాదం. వాస్తవానికి ఈ దేశంలో కమ్యూనిస్టుల అవసరం లేదా, ఇక కమ్యూనిస్టుల పురోగమనం అసాధ్యమా అంటే ఈ దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు కమ్యూనిస్టుల అవసరాన్ని వక్కాణిస్తున్నాయి. ఓట్లు తొలగింపులు, ట్యాంరింగ్‌లు, ప్రలోభాల నడుమ ఎన్నికలు జరిగినప్పుడు కమ్యూనిస్టులు వెనకబడవచ్చు. లేదా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవచ్చు. కానీ ఈ దేశంలో కమ్యూ నిస్టుల పురోగమనానికి మాత్రం ఎటువంటి అడ్డంకి లేదు. పాలక వర్గాలు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నాయి. ప్రజల అవసరా లను గుర్తించి పరిష్కరించి భవిష్యత్తును నిర్మించాల్సిన పాలకులు తాయిలాలతో తమ వైపుకు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పశ్చిమ బెంగాల్, అస్సాం సహా ఐదు రాష్ట్రాల ఫలితాల తర్వాత ఈ దేశ ప్రజలు మోడీకి బ్రహ్మరథం పడుతున్నారని కొన్ని శక్తులు విక టాట్టహాసం చేస్తున్నాయి. కొత్తగా బెంగాల్‌లో గెలిచింది. బెంగాల్‌లో మమత తప్పులు చేసి ఉండవచ్చు కానీ మమతను ఓడించడానికి బిజెపి నాయకత్వం అవలంభించిన పద్ధతులు బిజెపిని ప్రజల ముందు దోషిగా నిలబెడుతున్నాయి. ఓట్ల తొలగింపు ఎన్నికల కమిషన్ విధానంతో అభాసుపాలైంది.

మోడీ పాలనలో యావత్ దేశ సంపద పోగుపడుతుంది. 99 శాతం ప్రజల వద్ద ఉన్న దాని కంటే ఒక శాతం మంది వద్ద ఉన్న సంపద చాలా ఎక్కువగా ఉంది. దీనితో ఆర్థిక అంతరాలు పెరిగి పోతున్నాయి. ఈ సెగ ఇప్పుడు మోడీకి తగలకపోవచ్చు కానీ భవిష్యత్తులో పెరిగిన ఆర్థిక అంత రాలు ఈ దేశంలో ఓ అలజడికి ఆందోళనకు, అసహనానికి కారణం కాక తప్పదు. అప్పుడు ఈ దేశ ప్రజలకు నాయకత్వం వహించాల్సింది కమ్యూనిస్టులే. ఆ పరిస్థితి రాకూడదనే ఇప్పుడు కమ్యూనిస్టులు ఉండ కూడదనుకుంటున్నారు. ఇక 140 కోట్లకు పై బడిన దేశ జనాభాలో సగ భాగం యువతే. ఉద్యోగ, ఉపాధి రంగాలు వట్టిపోయి తీవ్ర నైరాశ్యంలో ఉన్న యువతకు భవిష్యత్తు అంధకారంగా కనిపిస్తుంది. రిటైర్‌మెంట్లు తప్ప రిక్రూట్‌మెంట్లు లేని ప్రభుత్వ రంగం ఒక పక్క, మరో పక్క ప్రైవేటు సెక్టార్‌లో గడిచిన ఐదేండ్ల కాలంలో ఉద్యోగ, ఉపాధి కల్పన రంగాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఉన్నత చదువులు చదవడం భారమైతే ఇప్పుడు ఆ చదువులు చదివిన సంతానం ఉపాధి లేక అదనపు భారంగా మారారు. పారిశ్రామిక ఉత్పత్తులు కేంద్రీకరించబడి చిన్న పరి శ్రమలు మూత పడటం ద్వారా కార్పొరేట్ సంస్థలు రాజ్యమేలుతు న్నాయి. ఉత్పత్తి రంగాలపై కొందరి నియంత్రణ ఈ దేశానికి అత్యంత ప్రమాదకరమన్న విషయాన్ని పాలకులు గుర్తించడం లేదు. పారిశ్రామిక రంగంలో కార్పొరేట్ల మేలు కోరుతున్న మోడీ సర్కార్ ఇప్పుడు లేబర్ కోడ్లను అమల్లోకి తీసుకు రావడం ద్వారా కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుంది. ప్రధానమైన వ్యవసాయ రంగం సంక్షో భంలో కూరుకుపోయింది. సగానికి పైగా ప్రజలు ఆధారపడిన వ్యవ సాయ రంగంపై కార్పొరేట్ కన్ను పడింది. అమ్మకాలు, కొనుగోళ్లు తప్ప సాగు చేయడం ద్వారా భూమిపై ఆధారపడి బతకడం కష్టమన్న భావన రైతాంగంలో, గ్రామీణ ప్రాంత ప్రజల్లో బలపడుతున్నది. ఏ వర్గము సంతృప్తి కరంగా లేదు. సబ్బండ వర్గాల్లో ఒకరకమైన అశాంతి అస హనం పెరుగుతున్నది. ఇలాంటి సమస్యల పరిష్కారానికి జై శ్రీరామ్ అనడం ఒక్కటే మార్గమన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. రాసినోడికి రాసి నంతా వారి తలరాతను మార్చలేమన్న ప్రచారాన్ని కర్మ ఫలితమంటూ ఇప్పుడు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. అది తప్పని ప్రశ్నిస్తే దేశ ద్రోహులుగా చూపుతున్నారు. బిజెపి విధానాలను తప్పుబట్టే వారికి ఎన్నికల ఫలితాలే ప్రజామోదమంటూ సమాధానం ఇస్తున్నారు. కానీ దేశంలో నెలకొన్న ఈ సమస్యలకు పరిష్కారమేమిటి అన్న దానిపై పాలక వర్గాలు దృష్టి సారించడం లేదు. ప్రస్తుత సమయంలో పరోక్ష పద్ధ తుల్లో ఆర్థిక లబ్ధిపొందుతున్న కొందరు మేధావులు సోషల్ మీడియా వేదికగా లేదా మరికొన్ని మార్గాల ద్వారా కమ్యూనిస్టులపై విషం చిమ్ము తున్నారు. కమ్యూనిస్టులను విమర్శించే వారికి ఈ దేశంలో నెలకొన్న సమస్యలు, అట్టడుగు వర్గాల ఇబ్బందులు, పెరిగిన ఆర్థిక దోపిడీ, కొర వడిన ఉపాధి, ఉద్యోగాలు, రాజకీయాల్లో పెరిగిన అవినీతి, పాలక వర్గాల దౌర్జన్య కాండలు కనిపించకపోవడం శోచనీయం. వాళ్ల మెదడు రిమోట్ కంట్రోల్‌లో ఉంటుంది. ఆ రిమోట్ ఎవరి చేతుల్లో ఉందో అవగ తమైన నాడు వాస్తవికత బయటపడుతుంది. మంచి ఎప్పుడు తొలుత తిరస్కరించబడి తర్వాత గౌరవించబడుతుందన్నట్లుగా ఈ దేశ ప్రజలకు కమ్యూనిస్టుల అవసరం తప్పక ఉంటుంది. బిజెపి లేదా మరో పార్టీ లేని సమాజాన్ని ఊహించవచ్చునేమో కానీ కమ్యూనిస్టులు లేని సమాజాన్ని ఊహించడం సాధ్యం కాదు. ఈ దేశంలో కమ్యూనిస్టుల పని అయిపో లేదు. అసలు కథ ముందే ఉంది. పాలక వర్గాల ధోరణి మారనంత కాలం, ప్రజలను ఓటర్లుగా చూసినంత కాలం, ఆ ఓటును అడ్డదారిలో పొందేందుకు ప్రయత్నించినంత కాలం కమ్యూనిస్టుల అవసరం పెరు గుతూనే ఉంటుంది. ఎన్నికల ఫలితాలు అనేవి పోరాట క్రమంలో ఒక భాగమే కానీ ఎన్నికలే కమ్యూనిస్టుల ఎజెండా కాదు.

**— పరిశీలకుడు**

# రైతులకు అందుబాటులో యూరియా



● వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ముందస్తుగానే ఈ నెల చివరి నాటికి 3.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా (బంపర్ స్టాక్) నిల్వలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా సరఫరా, నిల్వలు, నానో యూరియా వినియోగంపై సోమవారం సచివాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖరీఫ్ 2026 సీజన్‌కు రాష్ట్రానికీ 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా, 10 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందన్నారు. ఇందులో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నులు, జూలై ఆగస్టులో 1.50 లక్షల మెట్రిక్ టన్నులు చొప్పున సెప్టెంబర్‌లో 1లక్ష మెట్రిక్ టన్నుల సరఫరా ఉంటుందని కేంద్రం తెలిపిందన్నారు. ఇందులో ఏప్రిల్‌లో కేవలం 1.53 లక్షల మెట్రిక్ టన్నులు, మే నెలకు సంబంధించి ఇప్పటివరకు 48,985 మెట్రిక్ టన్నులు అందాయని అధికారులు వివరించారు. దీంతో కేంద్రం నుంచి రావాల్సిన మిగిలిన యూరియాను అత్యవసరంగా రాష్ట్రానికి తరలించేలా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్రంలోనే ఉన్న రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే యూరియాలో కనీసం 90 శాతం తెలంగాణ అవసరాలకే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై రామగుండం ఎరువుల కర్మాగారం మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్, అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ డిజిటల్ వింగ్ డైరెక్టర్ సరితా లక్ష్మీ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా.గోపి, ఎరువుల కంపెనీల ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 9న కొహెడ ఇంటిగ్రేటేడ్ మార్కెట్ ప్రారంభం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొహెడ ఇంటి గ్రేటేడ్ మార్కెట్‌ను డిసెంబర్ 9 నాటికి రైతులకు అందుబాటులోకి తీసుకు రాబోతున్నామని వ్యవసాయ, మార్కెటింగ్, శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు కొహెడ సమగ్ర మార్కెట్‌కు సంబంధించిన సవరించిన లేఅవుట్‌పై మార్కెటింగ్ అధికారులతో సోమవారం సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు, వ్యాపారులు, ఇతర భాగస్వాముల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు రూపకల్పనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దినట్లు వెల్లడించారు. ప్రాజెక్టును 3 దశలలో పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. తొలి దశ నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, ఈ ఏడాది డిసెంబర్ 9న మార్కెట్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఓపెన్ ప్లాట్‌ఫారాలు, ట్రక్ డాకింగ్ షెడ్లు, డ్రైయింగ్ యార్డులు, విశాల రహదారులు, రవాణా సౌకర్యాలు, పారదర్శక లావాదేవీలు, సాంకేతిక వసతులు, రైతులకు అవసరమైన అన్ని సేవలను అందుబాటులో ఉంచేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు.ఈ సమగ్ర మార్కెట్ ద్వారా రైతులకు తమ ఉత్పత్తులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు, మధ్యవర్తుల ప్రభావం తగ్గి, పారదర్శక మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పడుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టుకు సంబంధించిన తుది ప్రతిపాదననుముఖ్యమంత్రికి ఆమోదం కోసం సమర్పిస్తున్నామని వెల్లడించారు.

# కార్మికుల పక్షపాతి రాష్ట్రంగా ప్రభుత్వం అడుగులు

● కార్మికుల సంక్షేమమే ప్రజాపాలన లక్ష్యం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను కార్మికుల పక్షపాతి రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి అభిప్రాయడ్డారు. త్వరలోనే అన్ని వర్గాల అభిప్రాయాలను క్రోడీకరించి, కార్మికులకు మేలు చేకూర్చే విధంగా కనీస వేతనాల సవరణపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సోమవారం కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, లేబర్ కమిషనర్ దాసరి హరి చందన, ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ సెక్రెటరి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా తీసుకురానున్న నూతన 'లేబర్ కోడ్' అంశాల ప్రభావం ఎలా ఉండబోతోందనే దానిపై సుదీర్ఘంగా చర్చించారు. కార్మికుల వేతనాలను కేవలం అంకెల్లో కాకుండా, వారి వాస్తవ అవసరాలకు అనుగుణంగా సవరించాలని కమిటీ నిర్ణయించింది. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు, జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలు ఉండాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. తెలంగాణలో వేతనాల సవరణ శాస్త్రీయంగా ఉండాలని ప్రభుత్వం భావిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. దేశంలోని అత్యుత్తమ వేతన నమూనాలను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం ధృఢ సంతకల్పంతో ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల స్థితిగతులను మెరుగు పరిచేందుకు, వారికి మెరుగైన జీవన ప్రమాణాలను కల్పించేందుకు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఈ సందర్భంగా దేశంలోని ఇతర ప్రధాన రాష్ట్రాల్లో అమలవుతున్న కనీస వేతనాల విధానాలను కమిటీ కూలంకషంగా పరిశీలించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది అసంఘటిత, సంఘటిత రంగ కార్మికులకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని భట్టి విక్రమార్క తెలిపారు.

## ఖరీఫ్ సీజన్‌కు సకాలంలో ఎరువుల సరఫరా చేయాలి

రైతులకు ప్రధాని మోదీ భరోసా కల్పించాలి
తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న వాన కాలం పంట (ఖరీఫ్ సీజన్‌లో) సకాలంలో ఎరువులు అందిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైతులకు భరోసా కల్పిస్తూ ప్రకటన చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, అధ్యక్షుడు భాగం హేమంతరావు డిమాండ్ చేశారు. గత మూడేళ్లలో క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర రూ.66 డాలర్లు ఉన్నప్పుడు ఎప్పుడూ కూడా పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించకుండ విపరీతంగా లాభాలు పొందిన కంపెనీలు ఇప్పుడు పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి ధరలు పెంచాలి అని కోరడం హాస్యాస్పదమని వారు పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ వస్తున్నా నేపథ్యంలో అమెరికా ఇరాన్ యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాల నుండి ఆయిల్ దిగుమతి కాదని పూర్తి సమాచారం ఉన్న నేపథ్యంలో ఎరువుల కొరత లేకుండాసేంద్రియ ఎరువుల తయారీకి సంబంధిత మార్గాలను అన్వేషించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రధాని వేలాది కార్లతో రోడ్ షో నిర్వహిస్తూ..

# ప్రజలకు సూచనలు చేయడం విడ్డూరం

మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రధానమంత్రి మోదీ పెట్రోల్, డీజిల్ వాడొద్దు, బంగారం కొనొద్దు, వంట నూనె తగ్గించండి అంటూ వ్యాఖ్యలు చేయడం దేశ ప్రధానిగా తగదని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. వేలాది కార్లతో రోడ్ షో నిర్వహిస్తూ ప్రజలకు మాత్రం ఇలాంటి సూచనలు చేయడం విరుద్ధమని అన్నారు. గాంధీ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక్క వినతిపత్రం అయినా కేంద్రానికి ఇచ్చారా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి ట్రిపుల్ ఆర్, మెట్రో, రేడియల్ రోడ్లు, కేంద్రీయ సంస్థలు వంటి కీలక ప్రాజెక్టులకు నిధులు అవసరమని తెలిపారు. రాహుల్ గాంధీ ఒత్తిడి వల్లే దేశవ్యాప్తంగా కులగణన అంశం ముందుకు వచ్చిందని, జనగణనలో బిసిల లెక్కింపును చేర్చాలని కేంద్రాన్ని కోరామని తెలిపారు. గత 12 ఏళ్లలో తెలంగాణకు కేంద్రం ఏం చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. భద్రాచలం, కొండగట్టు, వేములవాడ, బాసర ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రసాద్ స్కీమ్ కింద కేంద్రం ఏ ఆలయాలకు నిధులు ఇచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. గోదావరి పుష్కరాలకు రూ.2 వేల కోట్లు ఎందుకు అడగలేదని బిజెపి ప్రజాప్రతినిధులను ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల ఆశలు నెరవేర్చకుండా కేంద్రం పెద్ద కోడి గుడ్డు సున్నా ఇచ్చిందని విమర్శించారు.

**నిష్పక్షపాత విచారణ జరగాలి..**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నిష్పక్షపాత విచారణ జరగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి హోదాను ఉపయోగించి విచారణపై ఒత్తిడి తీసుకురావద్దని హెచ్చరించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మహిళలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీసులు బాధ్యత విస్మరిస్తే వారిపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ అంశంలో కుల ప్రస్తావన అవసరం లేదని, చట్టం తన పని తాను చేసుకుంటుందని స్పష్టం చేశారు.

## ధాన్యం రవాణాకు అందుబాటులో లారీలు, ట్రాక్టర్లు

● రవాణా శాఖ ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం రవాణాకు తగినన్ని లారీలు, ట్రాక్టర్లు అందుబాటులో ఉంచాలని రవాణా శాఖ ఆదేశించింది. ఈ మేరకు రవాణా శాఖ కమిషనర్ మెమో జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములు, రైస్ మిల్లులకు ధాన్యం తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా యంత్రాంగం, సివిల్ సప్లైస్ శాఖతో సమన్వయం చేసుకోవాలని,అవసరానికి అనుగుణంగా వాహనాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ధాన్యం రవాణా వాహనాలన్నింటికీ చెల్లుబాటు అయ్యే పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, ఆర్‌సి, ఫిట్‌నెస్, పర్మిట్, ఇన్సూరెన్స్, పియుసి, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని పేర్కొన్నారు. ధాన్యం రవాణా వాహనాల రాకపోకలు సాఫీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, రవాణా సమయంలో తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రవాణా ఏర్పాట్లపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు.

# రాష్ట్రాభివృద్ధికి నాణ్యమైన రహదారులు కీలకం

● హ్యామ్ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర అభివృద్ధికి నాణ్యమైన రహదారులు కీలకమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామాలు, మండలాలు, పట్టణాలను మెరుగైన రహదారులతో అనుసంధానం చేయడం ద్వారా పరిశ్రమలు విస్తరిస్తాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్రంలో చేపడుతున్న హైబ్రిడ్ అన్యుటీ మోడల్ (హ్యామ్) రహదారి ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి సోమవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హ్యామ్ ప్రాజెక్టుల అమలు తీరు, పనుల నాణ్యత, నిర్మాణ వేగం, టెండర్ ప్రక్రియ, పెరుగుతున్న నిర్మాణ వ్యయా లు, ఇతర రాష్ట్రాల్లో అమలు పరిస్థితులు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా, పరిశ్రమల విస్తరణకు అనుకూలంగా, ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించేలా నాణ్యమైన రహదారి మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని స్పష్టం చేశారు.ఇప్పటివరకు దేశవ్యాప్తంగా రూ.4 నుంచి రూ.5 లక్షల కోట్ల వ్యయంతో 374కు పైగా హ్యామ్ ప్రాజెక్టులు చేపట్టినట్లు తెలిపారు. హ్యామ్ ప్రాజెక్టులపై వస్తున్న ఎక్సెస్ టెండర్ల ఆరోపణలపై మంత్రి అధికారులను ప్రశ్నించగా, దీనికి స్పందించిన అధికారులు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఎక్సెస్ శాతం తక్కువగా ఉందని గణాంకాలతో వివరించారు. హ్యామ్ ఫేజ్1 కింద రోడ్లు, భవనాల శాఖ ద్వారా రూ.13,006.27 కోట్ల వ్యయంతో 441 రహదారుల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇవి 6,092.37 కిలోమీటర్ల పొడవుతో 34 ప్యాకేజీలుగా అమలవుతున్నాయని వెల్లడించారు. హ్యామ్ ప్రాజెక్టులకు సంబంధించిన తుది అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో త్వరలో సమావేశమై చర్చిస్తానని మంత్రి తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ బి.వి.రావుతో పాటు పలువురు శాఖాధికారులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీపై చర్యలు తీసుకోవాలి

పోలీసులకు విహెచ్ ఫిర్యాదు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీపై ప్రధాని చేసిన వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపి వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన సభలో మోదీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ విహెచ్ సోమవారం అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కిరణ్‌కుమార్‌కు మోదీపై ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని ముస్లింల పార్టీగా పేర్కొంటూ చేసిన వ్యాఖ్యలు సామాజిక విభేదాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు తగిన విధంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధాని సభను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని విహెచ్ విమర్శించారు. కాంగ్రెస్‌ను ముస్లిం, మావోయిస్టు పార్టీగా అభివర్ణించడం పూర్తిగా తప్పని అన్నారు. ముస్లింలు దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.

**జనగణనను బిసిలు బహిష్కరించాలి**

బిసి కులగణన అంశంపై పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకుని మోదీతో మాట్లాడాలని ఆయన కోరారు. జనగణనలో ఓబిసి కాలమ్ తప్పనిసరిగా ఉండాలని, లేకపోతే బిసిలకు న్యాయం జరగదని అన్నారు. ఓబిసి కాలమ్ లేకపోతే బిసిలు జనగణనలో పాల్గొనవద్దని పిలుపునిచ్చారు. 60 కోట్ల మంది బిసిలకు మోదీ అన్యాయం చేస్తున్నారని, అంబానీ, అదానీలకు మాత్రమే మోదీ సహాయం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో బిజెపి ఎలా అధికారంలోకి వస్తుందో చూస్తామని వ్యాఖ్యానించారు. మోదీలో ఇప్పటికైనా మార్పు రావాలని, అగ్రకులాల పెత్తందారీ ధోరణి ఆయనలో కనిపిస్తోందని విహెచ్ విమర్శించారు.

# బండి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలి : ఎఐవైఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో ఆయనను తక్షణమే అరెస్టు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. ఈమేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. మహిళల భద్రత, బాలల రక్షణ, సంస్కృతి, నైతికత పేరుతో పెద్ద పెద్ద మాటలు మాట్లాడే బిజెపి నాయకత్వ అసలు ముఖం ఇప్పుడు బయటపడిందన్నారు. ఒక మైనర్ బాలికకు సంబంధించిన అత్యంత సున్నితమైన కేసులో కేంద్ర మంత్రి కుటుంబ సభ్యుడి పేరు రావడం చాలా తీవ్రమైన విషయమని, దర్యాప్తు పూర్తయ్యే వరకు చట్టపరమైన ప్రక్రియ కొనసాగించాలన్నారు. ప్రతిపక్ష నేతలపై చిన్న ఆరోపణ వచ్చినా రాజీనామాలు చేయాలని డిమాండ్ చేసే బీజేపీ, ఇప్పుడు అదే ప్రమాణాలను తమ నాయకులపై అమలు చేయాలన్నారు. బేటీ బచావో అంటూ ప్రచారం చేసే పార్టీ, నిజ జీవితంలో మహిళల, బాలికల భద్రత విషయంలో ఎక్కడ నిలబడి ఉందో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లు లేకుండా చట్టం తన పని తాను చేసుకునేలా చూడాలని, కేసుపై నిష్పాక్షపతంగా వేగవంతమైన దర్యాప్తు జరగాలని, బాధితురాలికి పూర్తి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై దేశ యువత, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు గళమెత్తాలని కోరారు.

దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్
శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం
పి.ఆర్.నగర్, ఎర్రగడ్డ, హైదరాబాద్.

శ్రీయుత కమిషనర్, దేవాదాయ శాఖ వారి కార్యాలయ Rc. No. F4/2168/2025, తేది: 05-05-2026 ప్రకారము నమూనా ఫామ్-1 నిబంధన-4(1) చూడగలరు.

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా! శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానము, పాండురంగనగర్, ఎర్రగడ్డ, హైదరాబాద్‌కు వంశపారంపర్యం కాని ధర్మకర్తల మండలి నియామకము కొరకు నోటిఫికేషన్ జారీ చేయబడినది. ఈ నోటీసు ప్రచురింపబడిన తేదీ నుండి 20 రోజుల అనంతరం దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టం 30/87 (సవరించబడిన చట్టం 33/2007, తెలంగాణ ఆర్డినెన్స్ నెం. 3/2016ను అనుసరించి) సెక్షన్-15, ఉపసెక్షన్-1కి లోబడి వంశపారంపర్యం కాని ధర్మకర్తల మండలి నియమించబడును. కావున ఆసక్తి గల హిందూ మతమునకు చెందిన అభ్యర్థులు ధర్మకర్తగా నియామకము కొరకు వారి దరఖాస్తులను సెక్షన్-17 నందలి ఉపసెక్షన్-3 ను అనుసరించి నిర్ణీత ప్రొఫార్మా (ఫారమ్-11)లో ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 20 రోజులలోపు శ్రీయుత సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ, సికింద్రాబాద్ కార్యాలయము (తుల్జాభవన్ ధర్మశాల, కాచిగూడ) నందు దరఖాస్తులు సమర్పించుకోవచ్చును.

తేది: 08-05-2026
సం/- కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్, తెలంగాణ
DIPR R.O. No. : 2130-PP/CL/ADVT/2026-27, Date: 08-05-2026

తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్
(రాష్ట్ర ప్రభుత్వ ఆధీన సంస్థ)
"టూరిజం హౌజ్", # 3-5-891, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029. ఇ-మెయిల్: ee2@tgtdc.in
"టూరిజం హౌజ్", # 3-5-891, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు నెం. 04/EE/SB/TGTDC/2026-27, తేది: 11.05.2026

| క్ర. సం. | పని పేరు | అంచనా విలువ రూ.లక్షలలో | బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది |
|---|---|---|---|
| 1 | 2 | 3 | 5 |
| 1 | నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి దేవాలయం. | 50.00 | 16.05.2026 |
| 2 | నాగర్‌కర్నూల్ జిల్లా, తెల్కపల్లి మండలం, రాకొండ గ్రామం, శ్రీ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మౌలిక సదుపాయాలతో కూడిన మల్టీ-పర్పస్ ఫంక్షన్ హాల్. | 25.00 | 16.05.2026 |

అర్హులైన కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ వేదిక ద్వారా బిడ్లు ఆహ్వానించడమైనవి. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అయిన www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చు.
DIPR R.O. No. : 2236-PP/CL/ADVT/2026-27, Date: 11-05-2026
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం (ఎం), ఎంఎంసి (హెచ్‌క్యూ),
తార్నాక హుడా కాంప్లెక్స్, హైదరాబాద్. E-mail: sem.mulhq@gmail.com

కొటేషన్ ప్రకటన

కొటేషన్ ప్రకటన సంఖ్య: NIT No.03/SE/MMC (HQ)/2026-27, తేది: 11-05-2026

దిగువ పేర్కొన్న పనికి సంబంధించి, సీల్ చేసిన కొటేషన్లను (ధరల పట్టికలను) పేరున్న సంస్థల నుండి ఆహ్వానిస్తున్నాము. ఈ కొటేషన్లు దిగువ సంతకం చేసిన అధికారికి 12-05-2026 తేదీన లేదా అంతకు ముందే అందవలసి ఉంటుంది. కొటేషన్లు 06-05-2026 తేదీన సాయంత్రం 4:00 గంటల వరకు స్వీకరించబడతాయి మరియు అదే రోజు సాయంత్రం 4:30 గంటలకు తెరవబడతాయి. ఇతర వివరాలను కార్యాలయ పనివేళల్లో కార్యనిర్వాహక ఇంజనీర్ (M) నుండి పొందవచ్చు.

| క్ర. సం. | వివరణ | కొటేషన్ ఆవశ్యకం |
|---|---|---|
| 1 | నీటి నిరోధక చికిత్స (Waterproofing treatment) నిర్వహించడం: పని చేయాల్సిన ఉపరితలంపై ఉన్న వదులైన భాగాలు, దుమ్ము లేదా జిడ్డు లేకుండా శుభ్రం చేయడం; ఇందుకోసం గట్టి వైర్ బ్రష్ లేదా అధిక వేగంతో నీటిని వెదజల్లే జెట్ (high-speed water jet) ఉపయోగించి మురికి మరియు వ్యర్థాలను పూర్తిగా తొలగించాలి. 4 మి.మీ. వెడల్పు వరకు ఉన్న పగుళ్లను 'పాలియురేథేన్ సీలెంట్' (POLYURETHANE SEALANT)తో పూరించాలి. అంతకంటే పెద్ద పగుళ్లను మరియు దెబ్బతిన్న భాగాలను 'పాలిమర్ మోడిఫైడ్ సిమెంట్ మోర్టార్'తో మరమ్మతు చేయాలి. పైకప్పు ఉపరితల వైశాల్యం మొత్తాన్ని Fosroc Nitobond SBR Latex మరియు Brushbond Roofguard (నీటితో 3:1 నిష్పత్తిలో కలిపి)తో కూడిన 'self-priming coat'తో కప్పడం; ఆపై 'fiber mesh'ను అమర్చి, రెండవ పూతగా Fosroc Nitobond SBR Latex మరియు Brush-bond Roofguard (నీటితో 3:1 నిష్పత్తిలో కలిపి)ను పూయడం. ఈ పనిని పూర్తి చేయడానికి అవసరమైన యంత్రాలు, పనిముట్లు, రసాయనాలు, ఇతర ఉపకరణాలు, అలాగే కూలీల ఖర్చులు మరియు సామాగ్రిని పైకి చేర్చడం (lifting) & రవాణా ఖర్చులతో సహా, పని పూర్తిగా ముగిసే వరకు అయ్యే మొత్తం వ్యయం. | చదరపు అడుగుకు ధర (Rate/ Sft) |

షరతులు:
1. కొటేషన్లు 12-05-2026 తేదీన సాయంత్రం 4:00 గంటల లోపు అందాలి. ఈ కొటేషన్లను అదే రోజు సాయంత్రం 4:30 గంటలకు, సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, ఎంఎంసి (హెచ్‌క్యూ), హుడా కాంప్లెక్స్, తార్నాక, హైదరాబాద్ వద్ద తెరువబడతాయి.
2. ఎటువంటి కారణం చూపకుండానే, ఈ కొటేషన్లను రద్దు చేసే హక్కు సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎం), ఎంఎంసి (హెచ్‌క్యూ), వారికి ప్రత్యేకంగా (reserve right) ఉంటుంది.

సంబంధిత అధికారి చిరునామా: శ్రీ B.L. శ్రీనివాసరావు, సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎం), ఎంఎంసి (హెచ్‌క్యూ), తార్నాక, హైదరాబాద్.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎం), ఎంఎంసి (హెచ్‌క్యూ), తార్నాక, హైదరాబాద్.
DIPR R.O. No. : 2253-PP/CL/ADVT/2026-27, Date: 11-05-2026

# మోదీ సభతో బిజెపి నేతలకు రాజకీయ ఆశాభంగం




● పరేడ్‌గ్రౌండ్ బహిరంగ సభలో మోదీ ప్రసంగం 'పొలిటికల్ బుల్లెట్లలా ఉంటుంది' అనుకుంటే అధికారిక ప్రసంగంలా సాగడంపై కాషాయ నేతల నిరాశ

(ఇ.చంద్రశేఖర్)

తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ ప్రత్యర్థులపై గర్జించి రాష్ట్ర బిజెపిలో జోష్ నింపి కేడర్‌కు దిశానిర్దేశం చేస్తారని ఆశించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ సభ కాషాయ పార్టీ నాయకులు, శ్రేణులు ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వలేదు. భారీ రాజకీయ అంచనాలు, చర్చోపచర్చలు, వ్యూహాలు, ఊహాగానాలతో భారీ ఎత్తున బహిరంగ సభకు ఏర్పాటు చేయగా సభలో మోదీ ప్రసంగం చప్పగా ఉండడంతో రాష్ట్ర బిజెపి నాయకత్వం తీవ్ర నిరాశలో మునిగిపోయింది. మోదీ ప్రసంగం 'పొలిటికల్ బుల్లెట్లలా ఉంటుంది' అని భావిస్తే, అది కాస్తా 'ఎకానమీ క్లాస్'లా మారిపోవడంతో సభకు వచ్చిన కార్యకర్తలు డీలా పడినట్లు కనబడింది. 'ప్రజలు మార్పును కోరుకుంటున్నారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పట్ల ప్రజలలో అసంతృప్తి ఉంది. బెంగాల్ తరహాలోనే తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయం' అని మోదీ సాధారణంగా చెప్పడం బిజెపి శ్రేణులను ఆకట్టుకోలేకపోయింది. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కానీ, గత పదేళ్ల పాటు పరిపాలన సాగించిన బిఆర్‌ఎస్ పార్టీపై కానీ ప్రధాని ఒక్కటంటే ఒక్క విమర్శ కూడా చేయకపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ముఖ్యంగా కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, పెండింగ్ ప్రాజెక్టులు, అవినీతి వంటి అంశాలపై మోదీ గర్జిస్తారని, తద్వారా రాష్ట్రంలో పార్టీకి ఒక ఊపు వస్తుందని భావించిన బిజెపి నేతలకు ఆశాభంగం ఎదురైంది. మరోవైపు కాళేశ్వరం బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఎటిఎంలా మారిందని గతంలో విమర్శించిన ప్రధాని మోదీ ఆ విషయంపై కనీస విమర్శ కూడా చేయకపోవడం, రాజకీయ బహిరంగ సభలో ప్రసంగం కాస్తా అధికారిక ప్రసంగంలా సాగడం, బంగారం, చమురు అంటూ పొదుపుమంత్రం జపించడంతో సభికులలో ఆశించిన హుషారు కనిపించలేదు. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్ర పర్యటనకు వచ్చిన మోదీ హైదరాబాద్‌లో ఎపి సిఎం చంద్రబాబునాయుడును, ఆ రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌లను కలిసి వారికే ఎక్కువ సమయం కేటాయించడం కూడా బిజెపి తెలంగాణ నాయకులకు ఇబ్బందికరంగా భావిస్తున్నారు.

**విదేశీ కరెన్సీ.. క్లిష్ట సమయం.. కార్యకర్తలకు అర్థం కాని పాఠం**

ప్రధాని మోదీ తన ప్రసంగం పొడవునా దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లు, విదేశీ కరెన్సీని ఆదా చేసుకోవాల్సిన అవసరం, ఆత్మనిర్భర్ భారత్ ప్రాధాన్యతపైనే దృష్టి సారించారు. దేశం క్లిష్ట సమయంలో ఉందని, ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అయితే, గ్రామీణ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సామాన్య కార్యకర్తలకు ఈ 'గ్లోబల్ ఎకానమీ' పాఠాలు అస్సలు వంటబట్టలేదు. 'మా ఊర్లో సమస్యల గురించి, మా రాజకీయ భవిష్యత్తు గురించి ప్రధాని ఏం చెబుతారో' అని సభకు వచ్చి ఎదురుచూసిన బిజెపి క్షేత్రస్థాయి నాయకులకు నిరాశే ఎదురైంది.

**దిశానిర్దేశం శూన్యం**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ కేడర్‌ను సమాయత్తం చేసేలా మోదీ ప్రసంగం ఉంటుందని అంతా ఊహించారు. రాష్ట్ర నాయకత్వానికి ఒక రోడ్ మ్యాప్ ఇస్తారని ఆశించారు. కానీ, పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి చేయాల్సిన పోరాటం గురించి గానీ, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసేలా గానీ ఒక్క మాట కూడా ప్రధాని నోటి నుంచి రాలేదు. దీంతో ఇంత కష్టపడి జన సమీకరణ చేస్తే, చివరకు ప్రయోజనం ఏమిటని క్షేత్రస్థాయి నాయకులు లోలోపల మదనపడుతున్నారు.

## విధి నిర్వహణలోనే డిఎఓ మృతి



**ప్రజాపక్షం/నర్సంపేట:** నర్సంపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏవో)గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ కార్యాలయంలోనే గుండెపోటుతో మృతి చెందారు. విధి నిర్వహణలో ఉన్న అధికారి ఒక్కసారిగా ప్రాణాలు కోల్పోవడంతో రెవెన్యూ శాఖ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సహోద్యోగుల కథనం ప్రకారం సోమవారం ఉదయం శ్రీనివాస్ యథావిధిగా విధులకు హాజరయ్యారు. పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో ఆయనకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అస్వస్థతకు గురై కుర్చీలోనే కుప్పకూలిపోయారు. గమనించిన తోటి సిబ్బంది వెంటనే స్పందించి ఆయనను హుటాహుటిన నర్సంపేటలోని ఓఆసుపత్రికి తరలించారు. అనంతరం వరంగల్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే శ్రీనివాస్ ప్రాణాలు విడిచినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శ్రీనివాస్ ఆకస్మిక మరణ వార్త తెలియడంతో నర్సంపేట ఆర్డీవో కార్యాలయంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, తహసీల్దార్ రవిచంద్రరెడ్డి, సహా డివిజన్‌లోని రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

## నగరాభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి: కలెక్టర్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** నగరాభివృద్ధి పనులలో మరింత వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్, జిడబ్ల్యూఎంసి ఇన్‌చార్జి కమిషనర్ చాహత్ బాజ్ పాయి సోమవారం నగరంలోని పలు అభివృద్ధి, పారిశుధ్య, హార్టికల్చర్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. మొదటగా నాయుడు పెట్రోల్ బంక్ నుడి మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ వరకు సెంట్రల్ మీడియన్‌లో నాటిన మొక్కలు, వాటి నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు. వేసవి తీవ్రత దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీరు పోస్తూ, కలుపు మొక్కలను తొలగించి సమర్థవంతంగా సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. నగర సుందరీకరణలో హార్టికల్చర్ విభాగం కీలకపాత్ర పోషించాలని సూచించారు. అనంతరం మట్టేవాడ, రామన్నపేట, లక్ష్మీపురం ప్రాంతాల్లో నిర్మించిన అంతర్గత రహదారులు, డ్రైయినేజీ వ్యవస్థలను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. 26వ డివిజన్‌లో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించిన కలెక్టర్, పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. వీల్ బ్యారోలను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకుంటూ సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బల్దియా ఈఈ సంతోష్ బాబు, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## ఫెడరల్, ప్రజాస్వామ్య వ్యవస్థలను ప్రధాని గౌరవించాలి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రధాన మంత్రి పదవి అనేది దేశ ప్రజలందరినీ సమానంగా చూసే అత్యున్నత రాజ్యాంగ బాధ్యత అని, ఆ పదవిలో ఉన్న వ్యక్తి మాట్లాడే ప్రతి మాట దేశ సమైక్యతను, ఫెడరల్ వ్యవస్థను, ప్రజాస్వామ్య విలువలను ప్రతిబింబించాలని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.ఈ నెల 10న హైదరాబాదుకు విచ్చేసిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధికారిక పర్యటనలో భాగంగా వచ్చారా? లేక వ్యక్తిగత రాజకీయ పర్యటనలో భాగంగా వచ్చారా? అనే సందేహం ప్రజల్లో కలుగుతోంది అని ఆయన పేర్కొన్నారు.హైదరాబాదులో ఒక ప్రైవేటు ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొనడం, నగరంలో పర్యటించడం, అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడిన తీరు చూసి ఆశ్చర్యం కలిగిందన్నారు. ఒక ప్రధానమంత్రి స్థాయికి తగిన హుందాతనం, సమతుల్యత, బాధ్యతాయుతమైన భాష ప్రసంగంలో కనిపించలేదని విమర్శించారు. దేశ ప్రధానిగా వ్యవహరించే వ్యక్తి రాజకీయ పక్షపాతం దాటి, దేశ సమగ్రతను కాపాడే విధంగా ఉండాలి అని సూచించారు."రాష్ట్రాలకు ఇచ్చే నిధులు బీజేపీ లేదా ఆరెస్సెస్ వ్యక్తిగత ఆస్తులు కావు. అవి దేశ ప్రజల పన్నుల ద్వారా వచ్చిన ప్రజాధనం" అని ఆయన పేర్కొన్నారు.చరిత్రను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, అహంకారంతో వ్యవహరించిన ఎన్నో శక్తివంతమైన నాయకులు కాలగర్భంలో కలిసిపోయారని, ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమమని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు.

## దోస్త్ అడ్మిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల దోస్త్ అడ్మిషన్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆవిష్కరించారు. 99 రోజులు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ఎడ్యుకేషన్ వీక్‌లో భాగంగా ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల దోస్త్ అడ్మిషన్ పోస్టర్‌ను తమ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు ఎడ్యుకేషన్ వీక్‌ను ఘనంగా నిర్వహించాలని, కళాశాలలో అడ్మిషన్లు పెంచేందుకు ప్రతి అధ్యాపకుడు కృషి చేయాలని సూచించారు. ఎడ్యుకేషన్ వీక్‌లో భాగంగా నిర్వహించే వివిధ కార్యక్రమాలను ప్రిన్సిపాల్ కలెక్టర్‌కు వివరించారు. మొదటి రోజు ప్రారంభ సమావేశంతో పాటు అడ్మిషన్ల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పిజి ఎంట్రన్స్ కోచింగ్, యోగా క్లాసులు, లైబ్రరీ డే, పుస్తక ప్రదర్శన పేరెంట్ టీచర్ మీటింగ్ పూర్వ విద్యార్థుల మీటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అవగాహన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుండి కళాశాలలో అప్రెంటిషిప్‌కు ప్రాధాన్యత ఇచ్చే http://B.Com(బియఫ్ఎస్ఐ) కోర్సును ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. మొదటి రెండేళ్లు కళాశాలలో విద్యతో పాటు పారిశ్రామిక వేత్తల ద్వారా నైపుణ్య శిక్షణ ఇస్తారు. ఫైనల్ ఇయర్‌లో వివిధ సంస్థల్లో నెలకు కనీసం రూ. 7వేల స్టైఫండ్‌తో అప్రెంటిషిప్ ఉంటుంది. కోర్సు పూర్తయిన తర్వాత వివిధ ఆర్థిక సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి బాలయ్య, దోస్త్ కన్వీనర్ డాక్టర్ జైశంకర్, తదితరులు పాల్గొన్నారు.

# పాజిటివ్ థింకింగ్‌తో విద్యార్థులు ముందుకు

### మంత్రి కొండా సురేఖ, ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర పర్యటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు.పదో తరగతిలో 550కు పైగా మార్కులు, ఇంటర్‌లో 980కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య వారికి సర్టిఫికెట్లు అందజేశారు.అలాగే అతి చిన్న వయసులోనే ఎమర్జింగ్ చెస్ చాంపియన్షిప్ లో రెండు ప్రపంచ రికార్డులు సృష్టించిన కొండా శ్రీయాంశ్ మురళీకృష్ణ పటేల్‌ను ప్రత్యేకంగా అభినందించి ఆశీస్సులు అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సురేఖ,ఎంపీ కావ్య మాట్లాడుతూ విద్యార్థుల విజయాలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కష్టానికి ప్రతిఫలమని అన్నారు. "ఈ రోజు విద్యార్థులు సాధించిన మార్కులు చూసి తల్లిదండ్రులు ఎంతో గర్వపడుతున్నారు. మీ కోసం వారు కన్న కలలను మీరు నెరవేర్చాలి. కలలు కనండి.. ఆ కలలు నిజమయ్యేలా అహర్నిశలు కష్టపడాలి" అని ఎంపీ సూచించారు. కడియం ఫౌండేషన్ ద్వారా 2016 నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచడమే లక్ష్యంగా మోటివేషన్ కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు."ఔటర్ మోటివేషన్, ఇన్నర్ మోటివేషన్ అని రెండు రకాలుగా ఉంటాయి. కానీ జీవితంలో ముందుకు వెళ్లాలంటే మనకోసం మనమే భవిష్యత్తు కోసం లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి. మనపై మనకు నమ్మకం ఉన్నప్పుడే అనుకున్నది సాధించగలుగుతాం" అని చెప్పారు. విద్యార్థులు ఎప్పుడూ పాజిటివ్ థింకింగ్‌తో ఉండాలని, అనుకున్నది పట్టుదలతో సాధించాలని సూచించారు.ఇంటర్మీడియట్ పూర్తయ్యాక తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ, ఇంతకుముందు ఎలా కష్టపడి చదివారో అదే చిత్తశుద్ధితో జీవితంలో ముందడుగు వేయాలని సూచించారు. "జీవితంలో విజయాన్ని సాధించాలంటే క్రమశిక్షణ చాలా అవసరం. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకునే వరకు కష్టపడాలి. చదువు అనేది వ్యక్తిగత అభివృద్ధికే కాదు.. సమాజానికి సేవ చేసే స్థాయికి తీసుకెళ్లాలి" అని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన "పే బ్యాక్ టు సొసైటీ" భావనను ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని, సమాజానికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు. వచ్చే అకాడమిక్ ఇయర్‌లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఆర్థిక పరిస్థితులు బాగాలేని విద్యార్థులను గుర్తించి, వారిని పాఠశాలల్లో చేర్పించి ఉత్తీర్ణత దిశగా తీర్చిదిద్దాలని అధికారులకు, ఉపాధ్యాయులకు ఎంపీ సూచించారు.అలాగే చెస్‌లో ప్రపంచ రికార్డులు సాధించిన శ్రీయాంశ్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి వరంగల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇక్కడికి వచ్చిన ప్రతి విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డా. శ్రీధర్ కుమార్, డీఈవో బి. రంగయ్య నాయుడు, డీఎంహెచ్ఓ సాంబశివరావు, డీవైఎస్ఓ బాలగంగాధర్, ఆర్డీవో సుమ, డీఆర్ఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 25,26 తేదీలలో ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలు

### ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఇండియన్ పీపుల్ థియేటర్స్ అసోసియేషన్ అనుబంధ సంస్థ తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలు మే 25,26 తేదీలలో రెండు రోజులు పాటు హైదరాబాదులో జరుగుతున్నాయని, ఆ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ కళాకారులకు పిలుపునిచ్చారు. హనుమకొండ సిపిఐ జిల్లా కార్యాలయంలో తెలంగాణ ప్రజానాట్యమండలి మూడవ జిల్లా మహాసభలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశంలో ఎంతో మంది మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు కలిసి ఇప్టా స్థాపించారని, కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై వారి జీవన విధానాలపై నిరంతరం అధ్యాయనం చేస్తూ అనేక రచనలు చేస్తున్నారని, పాటలు రాస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా గడ్డం రాజనర్సు, ప్రధాన కార్యదర్శిగా కొట్టేపాక రవి ఎన్నికైనారు. రోంటాల శ్యామ్, మమత, భరత్, భూక్య స్వరూప, రాజయ్య, స్వరూప, అనిత నూతనంగా ఎన్నికయ్యారు.

## ఇ ఆఫీస్‌లోనే అన్ని ఫైళ్లు: కలెక్టర్

**ప్రజాపక్షం/జనగామ :** ఈ ఆఫీస్‌లోనే అన్ని ఫైళ్ల నిర్వహణ ఉండాలని జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారి సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ సందర్శించి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అన్ని సెక్షన్లు పరిశీలించి సిబ్బంది పనితీరు, సెక్షన్‌ల నిర్వహణ, ఫైళ్ల నిర్వహణ విధానంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయ భౌతిక ఫైళ్ల నిర్వహణ ఉండకూడదని, అన్ని ఫైళ్లను డిజిటల్ విధానంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కార్యాలయ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.

## కో ఆప్షన్ సభ్యుల ఎంపిక కొండెక్కినట్లేనా?

### సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** ఏప్రిల్‌లో హడావుడిగా అన్ని మున్సిపాలిటీలో కో ఆప్షన్ సభ్యుల ఎంపిక కోసం దరఖాస్తులు తీసుకున్నారు కానీ ఇంతవరకు సంబంధిత ప్రక్రియను చేపట్టలేదని కో ఆప్షన్ సభ్యులకు ఎంపిక చేయలేదని ఎదురు చూస్తున్న ఆశావాహుల ఆశలు కొండెక్కించారని సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ 33 వ వార్డు కౌన్సిలర్ బి అజయ్ సారధి రెడ్డి అన్నారు. మున్సిపల్ సంబంధిత ఉన్నతాధికారులు మున్సిపల్ కమిషనర్లు కో ఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియపై మౌనంగా ఎందుకు ఉంటున్నారని దీనిపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన సిపిఐ కౌన్సిలర్ల సమావేశంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ అదేవిధంగా నూతన పాలక మండలి ఏర్పడిన తర్వాత కేవలం ఒకే ఒక మున్సిపల్ బడ్జెట్ సమావేశం మార్చి 30 న జరిగిందని నాటి నుండి నేటికి 2 నెలలు కావస్తున్న మున్సిపల్ జనరల్ బాడీ ( సాధారణ ) సమావేశం ఎందుకు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారో స్పందించి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న మిషన్ భగీరథ పనులు తక్షణమే పూర్తి చేయాలని, మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అట్టహాసంగా మున్సిపల్ ఎన్నికల ముందు శంకుస్థాపనలు చేసిన 59 కోట్ల అభివృద్ధి పనులు ప్రతి వార్డుకు 50 లక్షల అభివృద్ధి పనులు జాప్యం పై మరియు వార్డుల్లో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకునేందుకు చర్చించేందుకు మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 18 వ వార్డ్ సిపిఐ కౌన్సిలర్ రేశపల్లి నవీన్. 25 వ వార్డు కౌన్సిలర్ నర్ర సంధ్య శ్రావణ్ పాల్గొన్నారు.

## పాఠశాలను ఆధునికరించేందుకే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

### ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య
### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** ప్రభుత్వ పాఠశాలలను ఆధునికరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని జంగేడు కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా విద్య వారోత్సవాల కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యేగండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు గణనీయంగా పెరిగాయని అన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి సమ్మర్ లో నిర్వహించే ఈ వారం రోజుల క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని కోరారు. విద్య అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకునేలా విద్యా రంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, విద్యశాఖ అధికారి రాజేందర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, డిసిసి అధ్యక్షుడు బట్టు కరుణాకర్, టౌన్ ప్రెసిడెంట్ ఇస్లావత్ దేవన్, కౌన్సిలర్లు, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సృజనాత్మకతను వెలికి తీసేందుకే సమ్మర్ క్యాంప్‌లు


### కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** చిన్నారుల్లో మానసిక, ఆరోగ్య, విద్యా మేధస్సు వెలికి తీయడానికి సమ్మర్ క్యాంప్‌లు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. సోమవారం పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు) లో జరుగుతున్న సమ్మర్ క్యాంపును పరిశీలించి పిల్లలతో స్వయంగా మాట్లాడారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా సమగ్ర శిక్ష తెలంగాణ ప్రత్యేక విద్య వారోత్సవాల సందర్భంగా మే 11 నుండి మే 17 వరకు వరకు నిర్వహించే విద్య వారోత్సవాలను నిర్ణయించిన షెడ్యూల్ వారీగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు, సాధారణ సమ్మర్ క్యాంపులు మే 11 నుండి మే 25 వరకు, (18) క్యాంపులు, పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థినీ విద్యార్థుల కోసం రేమిడీయల్ పీఎం శ్రీ పాఠశాలలో ప్రత్యేకంగా (రెండు సమ్మర్ క్యాంపులు), తొర్రూరు, మహబూబాబాద్ లలో కేజీబీవీ మరిపెడ లో (1) మొత్తం జిల్లాలో (21) సమ్మర్ క్యాంపులను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు, ఈ క్యాంపులలో ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్య, క్రీడా, సాంస్కృతిక, తదితర ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ కోసం అసిస్టెంట్ డైరెక్టర్ అధికారి పర్యవేక్షణ లో సబ్జెక్టుల వారీగా నిపుణుల బోధనలతో పాటు డ్రాయింగ్, పెయింటింగ్, క్యారమ్స్, చెస్, ఆటలు అందుబాటులో ఉంటాయని, అధిక సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, తరగతుల అనంతరం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలలో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి తగినన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచాలని, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థినీ, విద్యార్థులకు, పాఠకులకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రత్యేక విద్యా వారోత్సవాలు జరిగే మే 11 నుండి మే 17 వరకు (7) ఏడు రోజులు పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు పునాది దినోత్సవం, పదవ తరగతి, రీమిడీయల్ క్యాంపుల ప్రారంభం, సర్పంచులతో పాఠశాల విద్య కార్యక్రమాలపై వర్క్ షాప్, ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం, గ్రంథాలయ దినోత్సవం, సాంస్కృతిక హస్తకళల దినోత్సవం, చివరి రోజు విద్యా విజయోత్సవ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం కోసం విద్యాశాఖ, జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుని పకడ్బందీగా కార్యక్రమాల నిర్వహణ చేస్తూ సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ మూర్తి, విద్యాశాఖ అధికారులు మందుల శ్రీరాములు, అప్పారావు, మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## 16న టియుడబ్ల్యూజె (ఐజెయు) హనుమకొండ జిల్లా మహాసభ

### జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్ వెల్లడి



**హనుమకొండ :** ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) అనుబంధ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూజె) హనుమకొండ జిల్లా మహాసభ ఈ నెల 16న ఉదయం 10:30 గంటలకు హనుమకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణలో నిర్వహించనున్నట్లు టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్ తెలిపారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్ లో టీయూడబ్ల్యూజే హనుమకొండ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభకు వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విరాహత్ అలీ, రామ్ నారాయణ తదితరులు హాజరు కానున్నట్లు వారు తెలిపారు. జర్నలిస్టుల పరిష్కారం కోసం టీయూడబ్ల్యూజే ముందు వరుసలో నిలిచిందని, ప్రస్తుతం కొనసాగుతున్న అక్రిడిటేషన్ ప్రక్రియలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ వచ్చే విదంగా కృషి చేస్తున్నదని చెప్పారు. గత మహాసభ నుండి నేటివరకు జిల్లాలో టీయూడబ్ల్యూజే అనేక కార్యక్రమాలు నిర్వహించి జర్నలిస్టుల మన్ననలు పొందిందని, రానున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మరింతగా కృషి చేస్తామని అన్నారు.
ఈ సందర్భంగా 16న జరిగే మహాసభకు అధిక సంఖ్యలో జర్నలిస్టులను తరలించాలని, ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా సీనియర్ జర్నలిస్టు, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు పివి మదన్ మోహన్ ఎంపిక తదితర పలు తీర్మానాలు సమావేశంలో ఆమోదించారు. ఈ సమావేశంలో రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు గడ్డం కేశవ మూర్తి, పిన్నా శివకుమార్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, జిల్లా యూనియన్ ఉపాధ్యక్షులు ఎంఎ. నయీం, విష్ణు వర్ధన్, ఉట్కూరి సాయిరాం, ఎర్రోల్ల జగన్, తాళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## బార్ అండ్ రెస్టారెంట్ కార్మికుల సమస్యలపై ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్:** ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసి) హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ–వరంగల్ నగరంలోని బార్ అండ్ రెస్టారెంట్ కార్మికుల సమస్యలపై హనుమకొండ కలెక్టరేట్ లేబర్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ మేకల భార్గవ్ కు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి యాదవ్ నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హనుమకొండ, వరంగల్ నగరాలలోని అనేక బార్ అండ్ రెస్టారెంట్లలో వేలాది మంది కార్మికులు వెయిటర్లు, క్లీనర్లు, కుక్స్, హెల్పర్లు, సెక్యూరిటీ సిబ్బందిగా పనిచేస్తున్నప్పటికీ వారికి ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ప్రస్తుత జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని కార్మికులకు కనీసం రూ.26,000 వేతనం అమలు చేయాలని, అదేవిధంగా ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, వారాంతపు సెలవులు, పని భద్రత, ఆరోగ్య రక్షణ, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బార్ అండ్ రెస్టారెంట్ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు క్రింది సౌకర్యాలు కల్పించాలని కోరుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని ఏఐటీయూసి నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పసునూటి రమేష్‌తో పాటు బార్ అండ్ రెస్టారెంట్ కార్మికులు, ఏఐటీయూసి నాయకులు, పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు

**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా నూతన కలెక్టర్‌గా హేమంత్ బోర్కడే బాధ్యతలు చేపట్టగా ఆయనను ములుగు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్, అసోసియేషన్ సభ్యులతో కలిసి మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ హేమంత్ బోర్కడేకి అభినందనలు తెలిపి శాలువాతో సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో రైస్ మిల్లర్స్ సమస్యలను వివరంగా వినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ములుగు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్, రైస్ మిల్లర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే వారి సమస్యలకు సానుకూలంగా స్పందించి, అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ములుగు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి సహోదరి రెడ్డి, మోహన్, సుదర్శన్ రెడ్డి, సహాయ కార్యదర్శి దేగల భద్రయ్య, గౌరవ సలహాదారులు రామిని శ్రవణ్ కుమార్, అనిల్ కుమార్‌లు పాల్గొన్నారు.

## పాల్వంచలో పోలీసుల కార్డన్ సెర్చ్

72 బైక్‌లు, 2 ఆటోలు సీజ్



**ప్రజాపక్షం/పాల్వంచ :** అనుమానిత, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వారి సమాచారం వెంటనే పోలీసులకు అందజేయాలని పాల్వంచ డిఎస్‌పి సతీష్ కుమార్ అన్నారు. పాల్వంచ జయమ్మకాలని, వెంగళరావు కాలని, తెలంగాణ నగర్‌లో పాల్వంచ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సంధర్భంగా 400 ఇండ్లను తనిఖీ చేశారు. సరైన ధృవపత్రాలు, నెంబర్ ప్లేట్స్ లేని 72 బైక్‌లు, రెండు ఆటోలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం డిఎస్‌పి మాట్లాడుతూ యాజమానులు తమ వాహనాలను సంభంధించిన డాక్యుమెంట్స్ తీసుకొచ్చి వాహనాలను తీసుకొని వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ సతీష్, పాల్వంచ పట్టణ, గ్రామీణ ఎస్ఐలు తోట నాగరాజు, కల్యాణి, సురేష్, బూర్గంపాడు, ములకలపల్లి ఎస్‌లు, పాల్వంచ సర్కిల్ స్పెషల్ పార్టీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాలిసెట్ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

**ప్రజాపక్షం/ఖమ్మంక్రైం :** 13వ తేదీన ఖమ్మం కమిషనరేట్ పరిధిలో రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టిజి పాలిసెట్2026 పరీక్షల సందర్భంగా ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 3:30 గంటల వరకు సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్2023(భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 200మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## రేపు సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మం జిల్లా సమితి సమావేశం బుధవారం సిపిఐ కార్యాలయంలో జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

## జన గణనను పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జన గణన ఇంటింటి సర్వేని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకింత్ అదేశించారు. సోమవారం సంబంధిత శాఖల అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహ గణన ప్రక్రియను ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలన్నారు. ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్వేలో సూచించిన ప్రతీ సమాచారాన్ని సేకరించాలన్నారు. అధికారులు సమన్వయంతో ఈ జన గణన సర్వేను విజయవతం చేయాలన్నారు.

## 15న ఒక్క రోజు సమ్మె

ఎఐకెఎస్ జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఉపాధిహామీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 15వ తేదీన ఒక్క రోజు సమ్మె నిర్వహించాలని ఎఐకెఎస్ జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఖమ్మంరూరల్ మండలంలోని గూడూరుపాడు గ్రామ పంచాయతీలో ఉపాధి కార్మికులతో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కార్మికులకు హాజరు అయిన ఉపాధి హామీ పథకం నానాటికి నిర్వీర్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ పలు మార్పులు చేస్తుందని దుయ్యబట్టారు. కావున కార్మికులంతా ఐక్యమై ఉపాధి హామీని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడిపల్లి ఏసు, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల నాయకులు గోకిపల్లి రామ్మూర్తి, గ్రామ నాయకుడు చల్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చుక్కల దుప్పి పిల్ల స్వాధీనం



**ప్రజాపక్షం/ఖమ్మం-రూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని మద్దివారిగూడెంలో ఓ చుక్కల దుప్పి పిల్లను ఫారెస్ట్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామ సమీపంలోని గుట్టల వైపు నుంచి వచ్చిన దుప్పి పిల్లను రెండు కుక్కలు వెంటాడుతున్నట్లు గమనించిన బొబ్బ సంపత్‌రెడ్డితో పాటు మరికొంతమంది యువకులు వాటిని అడ్డుకున్నారు. అటు తర్వాత ఫారెస్ట్ డిప్యూటీ ఏంజెల్ ఆఫీసర్ కె.వి రామారావుకు అందజేశారు. అనంతరం ఆయన ఆ దుప్పి పిల్లను వెటర్నరీలో వైద్య పరీక్షలు నిర్వహించి, కిన్నెరసాని వైల్డ్ లైఫ్ పాల్వచంకు తరలించారు. ఈ కార్యక్రమంలో

## ఐటిడిఎ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఎ ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటిడిఎ పిఒ రాహుల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గెస్ట్ సర్వీస్ అసోసియేషన్, హోటల్ కుకింగ్, ఫుడ్ బేవరేజ్ అసోసియేషన్, మైక్రో ఇరిగేషన్ టెక్నీషియన్, వేర్ హౌస్ అసోసియేట్ రంగాల్లో నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని, అభ్యర్థులకు ఇచిత భోజన సదుపాయంతో పాటు యూనిఫామ్, స్టడీ మెటిరీయల్, శిక్షణ అనంతరం సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 1835 సం. వయస్సు గలిగి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లమా, ఐటిఐ పాస్ అయిన వారు అర్హులని తెలిపారు. ఈనెల 14వ తేది ఉ. 9 గం.లకు ఇల్లందు వైటిసిలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 8106141505 నెంబర్‌ను సంప్రదించాలని చెప్పారు.

# కదులుతున్న ఫోర్జరీ డొంక...

కార్పొరేషన్ విలీన వెంచర్లలో అక్రమాల బాగోతం
రిజిస్ట్రేషన్లవుతున్నా.. రాని ఇంటి పర్మిషన్లు
లోక్ అదాలత్‌లో ఫిర్యాదుకు రియల్ బాధితులు సిద్ధం
ఆందోళనలో అవినీతి ఫోర్జరీ ముఠా



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలో సంచలనం రేపుతున్న ఫోర్జరీ మాఫియా వ్యవహారంలో రోజురోజుకూ కొత్త కోణాలు వెలుగులోకి వస్తుండటంతో అక్రమాల డొంక కదులుతున్నట్లు కనిపిస్తోంది. రియల్ వెంచర్లు, నకిలీ అనుమతులు, ఫోర్జరీ సంతకాల వ్యవహారాలపై బాధితులు ఒక్కొక్కరుగా ముందుకు వస్తుండటంతో ఈ దందా పరిమాణం ఊహించినదానికంటే ఎక్కువగా ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కార్పొరేషన్ విలీన సమయంలో జరిగిన భూ లావాదేవీలు, లేఅవుట్లు, కన్వర్షన్లు, ఇంటి పర్మిషన్లపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొందరు మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి రియల్ వ్యాపారులు నకిలీ డాక్యుమెంట్లతో అమాయక ప్రజలను మోసం చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కొన్ని ఫైళ్లు గల్లంతైనట్లు ప్రచారం జరుగుతుండగా, సంబంధిత శాఖల రికార్డులపై సమగ్ర విచారణ జరపితే మరిన్ని కీలక విషయాలు బయటపడే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు. అలాగే ఆ వెంచర్లలో రిజిస్ట్రేషన్లు తప్ప ఇంటి పర్మిషన్లు రావడం లేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు. 'ప్రజాపక్షం' వరుస కథనాలతో అధికారులు, నిఘావర్గాలు సైతం ఈ వ్యవహారంపై దృష్టి సారించినట్లు సమాచారం. ఇక బాధితులు లోక్ అదాలత్‌తో పాటు చట్టపరమైన మార్గాలను ఆశ్రయించేందుకు సిద్ధమవుతుండటంతో ఫోర్జరీ ముఠాలో కలవరపాటు నెలకొన్నట్లు తెలుస్తోంది. పూర్తి స్థాయి విచారణ జరిపి అసలు సూత్రధారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**కార్పొరేషన్ విలీన వెంచర్లను పరిశీలిస్తే...**

ఖమ్మం కార్పొరేషన్‌లో విలీన సమయంలో ఏర్పాటైన వెంచర్లను లోతుగా పరిశీలిస్తే భారీ అక్రమాల భాగోతం వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పట్లో పంచాయతీ నుంచి కార్పొరేషన్‌లో విలీనం జరుగుతున్న మార్పుల దశలో పరిపాలనా గందరగోళాన్ని కొందరు రియల్ వ్యాపారులు అవకాశంగా మలుచుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పటి పరిస్థితుల్లో పూర్తి స్థాయిలో పంచాయతీ, కార్పొరేషన్ పరిధిలోనూ ఉండకపోవడంతో పర్యవేక్షణ లోపించిందని స్థానికులు చెబుతున్నారు. ఇదే అదునుగా తీసుకొని కొందరు అక్రమ లేఅవుట్లు, కన్వర్షన్లు, ఇంటి పర్మిషన్ల వ్యవహారాల్లో అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారని సమాచారం. ఆ సమయంలో ఆన్‌లైన్ వ్యవస్థ పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో అధికారుల ఫోర్జరీ సంతకాలతో అనుమతులు జారీ చేసినట్లు ఆరోపణలున్నాయి. పలు డాక్యుమెంట్లలో అసలైన రికార్డులకు భిన్నంగా మార్పులు చేసి అనుమతులు పొందినట్లు బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక విలీన పంచాయతీలకు సంబంధించిన కీలక ఫైళ్లు కార్పొరేషన్ కార్యాలయంలో మాయమైనట్లు ప్రచారం జరుగుతుండటం ఈ వ్యవహారంపై మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. సంబంధిత శాఖలు పూర్తి స్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు.

**ఫిర్యాదుకు సిద్ధమైన బాధితులు...**

ఫోర్జరీ సంతకాలతో ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రియల్ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు ఇప్పుడు లోక్‌అదాలత్‌ను ఆశ్రయిస్తున్నట్లు సమాచారం. లక్షలరూపాయలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేసినప్పటికీ, సంబంధిత డాక్యుమెంట్లలో లోపాలు ఉండటంతో బాధితులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. సొంతింటి కల నెరవేర్చుకోవాలని నమ్మకంతో కొనుగోలు చేసుకుంటే లోన్లు రాకుండా మోసం చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రియల్ వ్యాపారులు చూపించిన అనుమతలు, పర్మిషన్లు నిజమని నమ్మి కొనుగోలు చేసిన తర్వాత అసలు బాగోతం బయటపడుతుండటంతో పలువురు కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఓ వెంచర్‌కు సంబంధించిన వ్యవహారంలో ఒక రియల్ వ్యాపారి అరెస్టు అయినప్పటికీ, ఇంకా పలువురు రియల్ వ్యాపారులు వారి వెనుక ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ప్రజాప్రతినిధులు కూడా సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ప్రధాన నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఇటువంటి పెట్రేగిపోతాయని ఆందోళన కొనుగోలుదారుల్లో వ్యక్తమవుతున్నట్లు తెలిసింది. ఫోర్జరీ వెంచర్లు ఏర్పాటు చేసిన రియల్ వ్యాపారులు అధికార ముసుగులో ఉండటంతో చర్యలు ముందడుగు పడదేమోననే ఆలోచనలోనే లోకాదళత్‌ను ఆశ్రయించనున్నట్లు తెలిసింది. అలాగే ఈ అవినీతి వ్యవహారాలపై సోషల్ వర్కర్లు సైతం హ్యూమన్‌రైట్స్‌ను కాపాడేందుకు సిద్ధమైనట్లు వినికిడి.

## ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రభుత్వ డిగ్రీ కాలేజీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నియోజకవర్గంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉన్నత చదువులను చేరవేయడంలో ప్రభుత్వ కళాశాల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కళాశాల అకడమిక్ ప్రణాళికలు, విద్యార్థుల హాజరు శాతం, సైన్స్ ల్యాబ్‌లు, లైబ్రరీ వసతులపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. అధ్యాపకులు కేవలం విద్యాబోధన చేయడమే కాకుండా విద్యార్థుల భవిష్యత్‌కు మార్గ నిర్దేశకులు కావాలన్నారు. మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణం, సిబ్బంది కొరత, విద్యా పరికరాలు వంటి అంశాలను తన దృష్టికి తీసుకురావాలని, వీటి పరిష్కారానికి ప్రభుత్వం నుండి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామని కూనంనేని స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన విద్యాబోధనతో కళాశాల ప్రతిష్టను పెంచాలని ఆయన సిబ్బందికి సూచించారు.

## ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, పెంచిన పెట్రోల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.కె. ఫహీమ్ విమర్శించారు. సోమవారం కొత్తగూడెం పట్టణంలోని రామాటాకీస్ ఏరియాలో ఖాళీ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫహీమ్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కార్ సామాన్య ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కేవలం కార్పోరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు పనిచేస్తోందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రాగానే వాణిజ్య గ్యాస్ ధరలను భారీగా పెంచి సామాన్యుడి నడ్డి విరిచారని మండిపడ్డారు. ధరలు పెరగడంతో మధ్య తరగతి ప్రజలు బతుకులు భారంగా మారాయన్నారు. తక్షణమే ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని, పెంచిన ధరలను తగ్గించాలని, లేని పక్షంలో ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె. ఖయ్యూమ్, పట్టణ నాయకులు మజ్జిగ రణధీర్, జావీద్, కొచ్చర్ల రాకేష్, రసూల్, యాకూబ్, రవి, అజయ్, వినయ్, సంజయ్, విజయ్ కాంత్, చిన్ను, నాగరాజు, అష్రఫ్ పాల్గొన్నారు.

## ప్రజా వినతులకు సత్వరమే పరిష్కారం

కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజలు సమస్యలు తెలుపుతూ సమర్పించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు పూర్తి చేయాలి**

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు లక్ష్యాలను ప్రతి శాఖ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యత్వంపై అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదుకు అధికారులు పూర్తి సహకారం అందించాలని ప్రతి శాఖలోని ఉద్యోగులు సభ్యత్వం నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి శాఖకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి సభ్యత్వ నమోదు ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. ఖమ్మం జిలా ప్రభుత్వ ఉద్యోగుల నుంచి సుమారు వెయ్యి సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. 200 మందికి పైగా ఉద్యోగులు ఉన్న శాఖలు రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వాల నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ దీక్షారైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఎఒ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 13న తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ సమావేశం



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ పట్టణంలోని సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో తెలంగాణ ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు శనగారపు శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండలరావు మాట్లాడుతూ కళతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు 1943వ సంవత్సరం మే 25వ తేదీన ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోసియేషన్‌గా ఆవిర్భవించిందని చెప్పారు. 13వ తేదీన జరిగే జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని కోరారు. మహా సభలకు రాష్ట్ర ప్రజా నాట్య మండలి అధ్యక్ష, కార్యదర్శులు కె. శ్రీనివాస్, పల్లె నరసింహులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాటూరి రాము, నిమ్మల రాంబాబు, మేదిని లక్ష్మి, కనకం కొమురయ్య, దారా లక్ష్మి, ఇరుకు రామారావు, అల్లి వెంకటేశ్వర్లు, పగిడిపల్లి సంజీవరావు, హెచ్. వెంకన్న, కొత్తపల్లి రామారావు, స్వరూప, కోట నాగరాజు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రేపు మంత్రి తుమ్మల అభినందన సభ

కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించి ఈనెల 14 నాటికి 40 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా రేపు నిర్వహించే అభినందన ఆత్మీయ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు తుమ్మల యుగంధర్ పిలుపునిచ్చారు. సోమవారం వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన రఘునాథపాలెం మండల ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా తుమ్మల యుగంధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1986 మే 14న అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు మంత్రివర్గంలో తొలిసారిగా మంత్రిగా బాధ్యతలు స్వీకరించారన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు నలుగురు ముఖ్యమంత్రులు ఎన్‌టిఆర్, చంద్రబాబు, కేసిఆర్, ప్రస్తుతం రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక కాలం మంత్రిగా పనిచేసిన ఘనత తుమ్మల నాగేశ్వరరావు దేనన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి చరిత్రలో తనదైన ముద్రవేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎన్‌టిఆర్ ఆశీర్వాదంతో రాజకీయ ఆరంగేట్రం చేశారని తెలిపారు. 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో రహదారులు, ఇరిగేషన్, విద్య, వైద్యం, టూరిజం వంటి రంగాల్లో జిల్లాలో ఎనలేని అభివృద్ధి చేశారన్నారు. అటువంటి ఘనత సాధించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఈనెల 13న ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో నిర్వహించే అభినందన సభకు రఘునాథపాలెం మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆత్మ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల కన్వీనర్ కేలోత్ దేవ్ సింగ్, సొసైటీ మాజీ ఛైర్మన్ తాతా రఘురాం, పలువురు సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కోసం వచ్చిన యువకుడు మృతి

బిహార్ కార్మికుడి ప్రాణం తీసిన మద్యం మత్తు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** కుటుంబాన్ని పోషించాలనే ఆశతో వేల కిలోమీటర్ల దూరంలోని బిహార్ రాష్ట్రం నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వచ్చిన ఓ యువ కార్మికుడు, మద్యం మత్తులో జరిగిన ఘర్షణకు బలై విగతజీవిగా మారిన ఘటన లక్ష్మీ పురం లారీ యార్డు ప్రాంతంలో విషాదాన్ని నింపింది. బీహార్‌కు చెందిన కుందన్ సింగ్ ఉపాధి కోసం బూర్గంపాడు ప్రాంతానికి వచ్చి పారిశ్రామిక ప్రాంతంలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి అతను మరో ఇ ద్దరు సహచరులతో కలిసి మద్యం సేవిస్తున్న సమయంలో మాటామాటా పెరిగి వివాదంగా మారిం ది. మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన ఇద్దరు వ్యక్తులు కుందన్ సింగ్‌పై దాడికి పాల్పడ్డారు. స మీపంలో ఉన్న బండరాయితో తలపై బ లంగా మోదడంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఉపాధి కోసం వచ్చిన యువకుడు ఇంత దారుణంగా ప్రాణాలు కోల్పోవడం స్థానికులను కలచివేసింది. సోమవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ ఘటనతో పారిశ్రామిక ప్రాంతాల్లో పని చేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికుల జీవన పరిస్థితులపై మరోసారి చర్చ మొదలైంది. కుటుంబాల కోసం కష్టపడుతు న్న కార్మికులు చిన్న చిన్న గొడవల కారణంగా ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి వారి కోసం సంపాదించాలనే ఆశతో వచ్చిన వ్యక్తి శవంగా తిరిగి వెళ్లాల్సి రావడం దురదృష్టకరం అంటూ సహచర కార్మికులు కన్నీరుమున్నీరయ్యారు. పారిశ్రామిక ప్రాంతాల్లో మత్తు పదార్థాల నియంత్రణపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## జనగణనను పరిశీలించిన కమిషనర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని ఒకటవ డివిజన్ పరిధిలోని కైకొండాయిగూడెం ప్రాంతంలో ప్రారంభమైన జనగణనను నగర పాలక సంస్థ కమిషనర్ (సెన్సెస్ ప్రిన్సిపల్ ఆఫీసర్ అభిషేక్ అగస్త్య) పరిశీలించారు. సోమవారం నోడల్ ఆఫీసర్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, రాష్ట్ర సెన్సెస్ అధికారి సాయి హేమవర్ష, రెవెన్యూ ఆఫీసర్ సుధాకర్‌తో కలిసి కమిషనర్ కైకొండాయిగూడెం ప్రాంతంలో హెచ్‌ఎల్‌బిఎస్‌ను సందర్శించి జనగణన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు, వార్డు ఆఫీసర్లు నిర్వహిస్తున్న జనగణనపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జనగణనను ఖచ్చితత్వంతో పారదర్శకంగా, సమయపాలనతో నిర్వహించాలని సూచించారు. జూన్ 9 వరకు ఈ జనగణన నిర్వహించ బడుతుందన్నారు. ప్రతి అధికారి, సిబ్బంది నియబద్ధతతో పనిచేసి ప్రజలకు సమగ్ర సేవలు అందించేవిధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత విభాగాల అధికారులు, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

**కార్పొరేషన్‌లో ప్రజావాణి..**

ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాత మున్సిపల్ కార్యాలయంలో లైబ్రరీ నందు టాయిలెట్లు శుభ్రంగా లేవని ఫిర్యాదు రాగా స్పందించిన కమిషనర్ తక్షణమే సమస్యను పరిష్కరించాలని అసిస్టెంట్ కమిషనర్‌ను ఆదేశించారు. ఖమ్మం మున్సిపల్ కార్యాలయంతో పాటు బల్లేపల్లి నార్త్‌జోన్ , సౌత్ జోన్ పాత మున్సిపల్ కార్యాలయం, వెస్ట్ జోన్ జమలాపురం కేశవరావు పార్కు, ఈస్ట్ జోన్ మమత రోడ్డులోని కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించారు.

## స్వయం ఉపాధి కోసం దరఖాస్తులు



**ప్రజాపక్షం/భద్రాచలం :** స్వయం ఉపాధి, జీవనోపాధి కోసం మాత్రమే గిరిజన దర్బారులో దరఖాస్తులు చేసుకోవాలని ఐటిడిఎ పిఒ రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌కు ఆయన హాజరై పలు ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల నుండి విన్నపాలు స్వీకరించారు. అర్జీలను పరిశీలించిన ఆయన ఆయా శాఖల అధికారులకు పంపించారు. అనంతరం పిఓ మట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అర్హులైన ప్రతీ గిరిజనుడికి సంక్షేమ పథకాలు ప్రాధాన్యతా క్రమంలో అందుతాయని తెలిపారు. అందిన ప్రతీ దరఖాస్తును అధికారులు పరిశీలించి పరిష్కరించాలని, ఏవైనా సమస్యలుంటే వెంటనే తెలపాలన్నారు. అదే విధంగా భద్రాచలం సబ్ కలెక్టరేట్‌లో కూడా ప్రజావాణి నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ జనరల్ డేవిడ్ రాజుతో పాటు పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి రైతు వేదికలో సోమవారం తెలంగాణ వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. బి. సౌజన్య పంట మార్పిడి, సేంద్రియ సాగు, యూరియా వినియోగం తగ్గింపుపై రైతులకు సూచనలు, సలహాలను అందించారు. మండల వ్యవసాయాధికారి ఎ. రాజ్ కుమార్ నానో యూరియా, ఆయిల్ పామ్ సాగు, సబ్సిడీలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ తరి రామానుజం, ఏఈవోలు కె. రవళిక, జె. సాగర్, బి. వినోద్, ప్యాక్స్ చైర్మన్ అంకతి రాజన్న, ఏఎంసీ డైరెక్టర్ జి. రమేష్, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనగణన–2027పై అవగాహన ర్యాలీ




**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** జనగణన–2027లో భాగంగా ఫేజ్–1 హౌస్ లిస్టింగ్ & హౌసింగ్ సెన్సస్ ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీ డి. శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జనగణన కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులను ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లుగా నియమించినట్లు తెలిపారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికి వచ్చి వివరాలు సేకరిస్తారని,ప్రజలు అవసరమైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఎంఇఒ కనకతార,ఎన్యూమరేట ర్లు,సూపర్వైజర్లు,వార్డ్ ఆఫీసర్లు, బిల్‌కలెక్టరు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మపురి క్షేత్రంలో ట్రాఫిక్ ఆంక్షలు

**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రముఖ పుణ్యక్షేత్రం, జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో పెద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పోలీస్ అధికారులు,మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎస్ఐ గురుక మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు.క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయం వరకూ అనుమతి లేని వాహనాల రాక వల్ల భక్తులకు స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవ్వడం జరుగుతున్నదని ఎస్ఐ తెలిపారు.ఈమేరకు ధర్మపురి పోలీస్, మున్సిపాలిటీ సంయుక్తంగా ఆంక్షలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానికులకు ఇబ్బందులు కాకుండా బారికేడ్లకు వేసిన తాళాలకు సంబంధించిన తాళం చెవులను సమీప షాపులలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.హనుమాన్ జయంతికి వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా అమలు చేస్తు న్న ట్రాఫిక్‌నిబంధనలకు అందరూ సహకరించాలని ఎస్ఐ మహేష్ కోరారు.

## ఐకెపి,పిపిసి కేంద్రాల్లో కలెక్టర్



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్, ఆత్మనగర్ ఐకెపి పిపిసి కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరితగతిన తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ధాన్యం రవాణా కోసం లారీలు అందుబాటులో లేకపోతే గ్రామాల్లోని ట్రాక్టర్ల ద్వారా కూడా తరలింపు చేపట్టాలని సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్, డిటి, సిఎస్,ఆర్ఐ, ఎపిఎం అధికారులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## ప్రజలకు పోలీస్ శాఖను చేరువ చేయడమే లక్ష్యం: ఎస్పి అశోక్

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే మా ప్రధాన లక్ష్యమని జగిత్యాల జిల్లా ఎస్‌పిఅశోక్ కుమార్ పేర్కొన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా స్పిఅశోక్ పలు ఫిర్యాదులను పరిశీలించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 14 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ప్రతి ఫిర్యాదుపై న్యాయపరంగా,పారదర్శకంగా విచారణ జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలోకి వచ్చే సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని,విచారణలో ఎటువంటి లోపం ఉండకూడదని సూచించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

## ప్రభుత్వ వసతి గృహాల సంక్షేమమే లక్ష్యం..



**ప్రజాపక్షం/కొమురవెల్లి:** ప్రభుత్వ పాఠశాలలు,వసతి గృహల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామని ఎమ్మెల్యేపల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రహరీ గోడ నిర్మాణానికి నాబార్డ్ నిధులు 42 లక్షల వ్యయంతో పనులకు శ్రీకారం చుట్టారు.అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులకు నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా వారిని తీర్చి దిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లపల్లి పద్మ ఆంజనేయులు,ఎంఒ రవిందర్,కెజిబివి ప్రిన్స్‌పల్ నీలిమ,ఎఎంసీ చైర్మన్ నామిరెడ్డి సౌజన్య రెడ్డి,టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# జనగణన గృహ జాబితా ప్రక్రియ పకడ్బందీగా పూర్తి

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**ప్రజాపక్షం/పెద్దపల్లి :** జిల్లాలో జనగణన గృహ జాబితా ప్రక్రియను సమగ్ర ప్రణాళికతో పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు.సోమవారం పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల గ్రామంలో నిర్వహిస్తున్న జనగణన కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 11 నుంచి జూన్ 9, 2026 వరకు జిల్లాలో జనగణన గృహ జాబితా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. గృహ జాబితా సర్వేలో నీటి కనెక్షన్, మరుగుదొడ్డి, ఫోన్, ఇంటర్నెట్ సదుపాయం, ఆహారపు అలవాట్లు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నల వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు.జిల్లాలో మొత్తం 1548 హౌసింగ్ లిస్ట్ బ్లాకులు (హెచ్‌ఎల్‌బి) గుర్తించగా, ప్రతి బ్లాక్‌లో సుమారు 300 ఇళ్లు, 800 జనాభా ఉంటుందని తెలిపారు. మే 11 నుంచి ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లు తప్పనిసరిగా క్యూ ఆర్ కోడ్ ఉన్న ఐడి కార్డులు వెంట తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుత ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో సర్వే నిర్వహించాలని ఆదేశించారు.ప్రతి హౌసింగ్ లిస్ట్ బ్లాక్‌కు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి గృహ జాబితా ప్రక్రియను పూర్తి చేయాలని, ప్రతి ఇంటి వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఇవిఎం స్ట్రాంగ్ రూమ్ గోదాంను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.తదుపరి పెద్దపల్లి మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని, ఎక్కువ సంఖ్యలో హమాలీలు, అవసరమైన వాహనాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.రైతులకు త్వరితగతిన చెల్లింపులు జరిగేలా ట్యాబ్ ఎంట్రీలు, ట్రక్ షీట్ జనరేషన్ వంటి ప్రక్రియలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీలలో పెద్దపల్లి ఎమ్మార్వో రాజయ్య,సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

### అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి మండలం భోజన్నపేట గ్రామపంచాయతీకి చెందిన ఆవుల వసంత తనకు ఇంటి నిర్మాణం కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్న అనుమతి మంజూరు చేయడం లేదని ఇంటిని నిర్మించు కునేందుకు అవసరమైన అనుమతులు మంజూరు అయ్యే విధంగా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా పంచాయతీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.రామగుండం నగరపాలక సంస్థకు చెందిన లింగం వెంకట్ రెడ్డి అయోధ్య నగర్ పరిధిలో ఇంటి యజమాని రేకుల ఇండ్లు నిర్మించుకుని దానికి తగిన పన్ను మాత్రమే చెల్లిస్తున్నారని, 6 సంవత్సరాల క్రితం ఆ రేకులను తొలగించి స్లాబ్ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నప్పటికీ పాత రేకుల ఇంటి పన్ను మాత్రమే చెల్లిస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నందున దానిని పరిశీలించి కొత్త ఇంటికి పన్ను పెనాల్టీతో సహ వసూలు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా రామగుండం మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ అరికట్టాలి

కలెక్టరేట్ ఎదుట సిపిఎం ధర్నా




**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంస్థల ద్వారా మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ కొనుగోళ్ళు వేగవంతం చేయకపోవడం మూలంగా అన్నదాతలు అరి గోస పడుతున్నారని, కొనుగోలు వేగవంతం చేయాలని, కొనుగోలు సెంటర్లలో దోపిడీని అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రోజున సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ధర్నాను ఉద్దేశించి జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అధికారులు, అట్టహాసంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ కొనుగోళ్ళు వేగవంతం చేయకపోవడం మూలంగా నెల రోజులుగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. తేమ,తాలు పేరుతో క్వింటాల్‌కు అదనంగా 5 నుండి 8 కిలోలు కోత విధిస్తున్నారన్నారు. ఏ వన్ గ్రేడ్ ధాన్యాన్ని కామన్ గ్రేడ్ గా సెంటర్ నిర్వాహకులు రైస్ మిల్లులకు పంపుతున్నారని, దీంతో రైతులు క్వింటాలకు 20 రూపాయలు నష్టపోతున్నారన్నారు. సెంటర్ నిర్వాహకులు, రైస్ మిల్లర్లు, కొందరు కిందిస్థాయి అధికారులు కుమ్మక్కై రైతును నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న రైస్ మిల్లులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గిట్ల ముకుంద రెడ్డి, వర్ణ వెంకటరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఉప్పునుటి శ్రీనివాస్, సుంకర సంపత్, ఎడ్ల రమేష్, జి రాజేశం, డి నరేష్ పటేల్, జిల్లా నాయకులు శాతరాజు భద్రయ్య, గజ్జల శ్రీకాంత్, రాయికంటి శ్రీనివాస్, పున్నం రవి, కాంపెల్లి అరవింద్, పుల్లెల మల్లయ్య, ప్రభాకర్, కండె రాజు,శివ, భోగేష్, సతీష్, కిషోర్, చక్రపాణి, కరీం తదితరులు పాల్గొన్నారు.

## మహాశక్తి ఆలయంలో ప్రమాణం చేస్తావా..?

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి బిఆర్ఎస్ సవాల్



**ప్రజాపక్షం/కరీంనగర్:** మైనర్ బాలికకు నా కొడుక్కి ఎలాంటి సంబంధం లేదని మహాశక్తి ఆలయంలోని అమ్మవార్ల సాక్షిగా ప్రమాణం చేయగలవా..అని కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి సవాల్ విసిరారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోనీ తెలంగాణ చౌక్ లో.. బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరత్ ను ఫోక్సో కేసులో వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సంజయ్ డౌన్ డౌన్ అంటూ .. నినదించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ... మైనర్ బాలిక విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి సహాయం చేస్తున్నట్లు అనిపిస్తుందనీ ఆరోపించారు. కేంద్ర మంత్రి పదవికి, ఇటు ఎంపికి రాజీనామా చేసి నిజాయితీ నిరూపించుకోవాలని బండి సంజయ్‌కి సవాల్ విసిరారు.అదే విధంగా బండి సాయి భగీరత్‌ను వెంటనే పొక్సో కేసులో అరెస్ట్ చేయాలని.. మైనర్ బాలికకు న్యాయం జరిగేంత వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పొన్నం అనిల్ తో పాటు..మీర్ షౌకత్ అలీ , నారదాసు వసంత రావు , బొంకూరి మోహన్ , అన్వేష్ , రవి నాయక్ , సైఫ్ , నయీం , సతీష్ , దినేష్ , రవి గౌడ్, గోడిషాల పావని గౌడ్, బత్తిని కీర్తిలతా గౌడ్ , రుద్ర రాధ , అజంతా , హిమబిందు, శ్రీలత , రాజమణి , రేణుక , అరుణ పలువురు బారసా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బండి సంజయ్, రేవంత్ రెడ్డిలది ఫెవికాల్ బంధం

బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాల:** కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర ము ఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలది ఫెవికాల్ బంధమని మాజీమంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ భవన్‌లో సోమవారం జీవన్ రెడ్డి వి లేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాది సంప్రదాయ పార్టీ, ధర్మం కోసం కట్టుబడిన పార్టీ అని బండి సంజయ్ చెప్పుకుంటార ని,ఆయన కుమారుడికి ఈ నిబంధనలు వర్తించయా అని ప్రశ్నించారు. దేశ ప్రధాని మోది బేటి బచావో అని నినాదం చేస్తూ ఆడబిడ్డకు అ న్యాయం చేసిన కుటుంబలో ఒకరైన బండి సంజయ్‌ను పక్కన కూర్చోపెట్టుని మాట్లాడట ం ఆశ్చర్యకరమన్నారు.బండి భగీరథ చేసిన నే రానికి 20 ఏళ్ల శిక్ష పడుతుందన్నారు.మైనర్ బాలిక సంఘటనపై కనీసం రేవంత్ రెడ్డి హో మ్ శాఖ మంత్రిగా పర్యవేక్షించడం లేదన్నారు .కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి రాష్ట్రాల్లో శాంతి భద్రతలను పర్యవేక్షించే బండి సంజ య్ కుటుంబ సభ్యుడే నేరం చేశారన్నారు. నేరాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేసిన బండి సంజయ్ సైతం శిక్షార్హులు అవుతారన్నారు.ఈ విషయంలో బండి సంజయ్ బాధ్యత రాహి త్యం కనబడుతోందని నైతికంగా పదవిలో కొ న సాగే హక్కు సంజయ్ కి లేదన్నారు.మైనర్ బాలికపై హనీ ట్రాప్ నేరం ఎలా ఆమోదిస్తారని పోలీసులను ప్రశ్నించారు.ఇంత పెద్ద సంఘటన జరిగితే ప్రధాని మోది, ఇంటెలిజెన్స్ ఏం చేస్తుందని మండిపడ్డారు.రాష్ట్రంలో ఏ ఆడబిడ్డకు అన్యాయం జరిగిన న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఉద్యమాలకు పేరుబడిన కరీంనగర్ నేరాలకు ప్రతీకగా చర్చకు రావడం దురదృష్టకరమన్నారు.భగీరథ్ పై ఉద్దేశ పూర్వకముగా నేరానికి అనుగుణమైన సెక్షన్లు పెట్టకుండా తప్పించిన స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు,మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత,ఉన్నారు.

## రైస్ మిల్లర్లు ఇబ్బంది పెడితే ధర్నాకు సిద్ధం

రైతు సమస్యలపై జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భేటీ



**ప్రజాపక్షం/కరీంనగర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా పాలన అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యంపేర్కొన్నారు. కరీంనగర్ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కలిసి రైతాంగ సమస్యలపై చర్చించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారులు, ప్రభుత్వం బాగా పని చేసినప్పటికీ రైస్ మిల్లర్లు ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. అలా ఇబ్బందులు పెట్టిన చోట స్వయంగా వెళ్లి రైతులతో కలిసి ధర్నా చేయడానికి సిద్ధంగా ఉన్నానని, ఎట్టి పరిస్థితుల్లోనూ 43 కిలోల తూకాన్ని అంగీకరించబోమని హెచ్చరించారు. గతంలో బిఆర్ఎస్ పాలనలో రైతు వ్యతిరేక విధానాలతో రైతులు విసిగిపోయాని, ఒక సంచికి నాలుగు కిలోలు అదనంగా తూకం వేసి రైతులను నట్టేట ముంచిన ఉదంతాలు అనేకం చూశామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండు సంవత్సరాల నుంచి రైతులకు ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా తప్ప–తాలుతో సంబంధం లేకుండా, కోతలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఈ విషయం ప్రతి రైతన్నకు తెలుసని అన్నారు. దురదృష్టవశాత్తు ఈసారి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిపిఎస్ విధానం వల్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు లారీలు రాలేకపోవడంతో క్షేత్రస్థాయిలో రైతుల నుండి ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఒక ఎమ్మెల్యేగా, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా తాలుతో సంబంధం లేకుండా కోత లేకుండా ధాన్యాన్ని కొనాలని కలెక్టర్ ను కోరినట్లు తెలిపారు. ధాన్యం సేకరణ వేగవంతం చేసేందుకు లారీల సంఖ్య పెంచాని, ప్రతి మండల స్థాయి కొనుగోలు కేంద్రం వద్ద, రైస్ మిల్లు వద్ద ఒక ప్రత్యేక అధికారిని నియమించాని, ప్రతిరోజు సమీక్షించేందుకు ఒక ప్రత్యేక అధికారిని, డాష్ బోర్డును ఏర్పాటు చేయాలని, ప్రతి కొనుగోలు కేంద్రం, రైస్ మిల్లు వద్ద సీనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారిని నియమించాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. గతంలో ప్రతిపక్ష హోదాలో రైతులకు అన్యాయం జరిగినప్పుడు పోరాటాలు, ఉద్యమాలు చే శామని, ప్రస్తుతం ప్రభుత్వంలో ఉన్నప్పటికీ రైతుల సమస్యల గురించి కలెక్టర్ కు వివరించి మా చిత్తశుద్ధిని నిరూపించుకున్నామన్నారు. మేడిపల్లి సత్యం వెంట సీనియర్ కాంగ్రెస్ నాయకులు కరీంనగర్ జిల్లా సర్పంచ్ ల ఫోరం మాజీ అధ్యక్షులు ఉప్పుల అంజన్ ప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముత్యం శం కర్, సీనియర్ నాయకులు కోల రమే ష్, రామడుగు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జవ్వాజి హరీష్, తదితరులు ఉన్నారు.

## అక్రమ పట్టాలతో కోట్లాది రూపాయల లూటీ

పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట పోతారం రైతుల ధర్నా



**ప్రజాపక్షం/ముత్తారం:** అక్రమ పట్టాలతో ప్రభు త్వ ఖజానాకు గండి కొడుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, దశాబ్దాలుగా భూమిని నమ్ముకుని సాగు చేసుకుంటున్న తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా ము త్తారం మండలం పోతారం గ్రామ రైతులు సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బాధితులు,నాయకు లు మాట్లాడుతూ.. పోతారం గ్రామ శివారులోని సర్వే నంబర్ 59,మైదంబండ శివారులోని సర్వే నంబర్ 113లో ఎలాంటి అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండా కొందరు అక్రమంగా పట్టాలు పొందారని ఆరోపించారు.రెవెన్యూ శాఖలో పనిచేసిన ఒక మాజీ విఆర్‌ఎ సహకారంతో అధికారుల ను మభ్య పెట్టి ఈ అక్రమాలకు పాల్పడ్డారని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

**రైతుల ప్రధాన డిమాండ్లు :** అక్రమంగా పొందిన పట్టాలను వెంటనే రద్దు చేసి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.అక్రమ పట్టాలతో పొం దిన మార్టిగేజ్ లోన్లు,క్రాప్ లోన్లు,రైతుబంధు, భరో సా నిధులను రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం తిరి గి వసూలు చేయాలి.గత 50 ఏళ్లుగా భూమిని సా గు చేసుకుంటున్న నిరుపేద రైతులకు వెంటనే ప ట్టాలు మ ంజూరు చేయాలి.అక్రమాలకు సహకరించిన వారినితక్షణమే విధుల్లో నుండి తొలగించాలి.

**వారంలో విచారణ జరిపి న్యాయం చేస్తాం :అదనపు కలెక్టర్ వేణు** ధర్నా చేస్తున్న రైతులతో అదనపు కలెక్టర్ వేణు మాట్లాడారు.అక్రమ పట్టాల వ్యవహారంపై వారం రోజుల్లో పూర్తిస్థాయి విచారణ జరిపిస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రభుత్వ నిధులను దు ర్వినియోగం చేసిన వారి నుండి రికవరీ చేస్తామని, సాగుదారులకు న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.కార్యక్రమ ం లో బిసి జెఎసి జిల్లా చైర్ పర్సన్ దాసరి ఉష, దళిత సంఘం డివిజన్ నాయకులు ఊట్ల శ్రీనివా స్, పోతారంగ్రామ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నా రు.

## పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**ప్రజాపక్షం/బెజ్జంకి:** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి)లో 60 లక్షల వ్యయంతో చేపట్టిన నూతన తరగతి గదుల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.అనంతరం లక్ష్మీ పూర్ గ్రామంలో 25 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు.అదే విధంగా 6 లక్షల అంచనా వ్యయంతో పాఠశాల వంట గది నిర్మాణానికి భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మెన్ పులి కృష్ణ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్,పార్టీ మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి,లక్ష్మీ పూర్ గ్రామ సర్పంచ్ ముక్కీస కవిత,ఏఎంసీ వైస్ చైర్మెన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి,నాయకులు బైర సంతోష్,పార్టీ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఐటిఐ, ఎటిసిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

రామగుండం ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ ఇ. సురేందర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** జిల్లాలోని రామగుండం ప్ర భుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐలు), ఎటిసిలలో 202627 విద్యా సంవత్సర ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు రామగుండం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్, ఈ. సురేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్ఎస్‌సీ మెమో,బోనాఫైడ్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్,టిసితదితర ధ్రువపత్రాలను స్కాన్ చేసి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అభ్యర్థులు మే 14, 2026 నుండి జూన్ 8, 2026 వరకు ITI ,Telangana వెబ్‌సైట్ https:/ /iti.telangana.gov.inద్వారా రూ.100 వెరిఫికేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.2026 ఆగస్టు 1 నాటికి 14 సంవత్సరాల వ యస్సు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రవేశాలకు అర్హుల ని,అభ్యర్థులు తమ సొంత మొబైల్ నంబర్, ఈమెయి ల్ ఐడీని ఉపయోగించాలని, దరఖాస్తు సమయంలో ఉపయోగించిన మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడీని ఐటీఐ పూర్తి అయ్యే వరకు మార్చరాదని సూచించారు.మార్చిన పక్షంలో అడ్మిషన్ రద్దయ్యే అవకాశం ఉందని తెలిపారు.రిజిస్ట్రేషన్ చేసిన ప్రతి అభ్యర్థి తమకు నచ్చిన ట్రేడ్లలో ఎక్కువ సంఖ్యలో ఐటీఐలను ఆప్షన్లుగా ఎంపిక చేసుకునే అవకాశం ఉందని, జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామగుండం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు భారత్ తలొగ్గదని నిరూపించాం: ప్రధాని

**సోమనాథ్ :** ప్రపంచంలోని ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు భారత్ తలొగ్గదని నిరూపించామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అటల్ నేతృత్వంలో భారత్ సత్తా అంటే ప్రపంచానికి ఏమిటో చూపించామని గుర్తు చేశారు. గుజరాత్‌లోని పవిత్ర పుణ్యక్షేత్రమైన సోమ్‌నాథ్ మహాదేవ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. వేదికపై నుంచి 75 ఏళ్ల పునర్నిర్మాణానికి గుర్తుగా ప్రత్యేక పోస్టల్ స్టాంపుతో పాటు 75 రూపాయల స్మారక నాణేన్ని ప్రధాని విడుదల చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం ప్రధాని సద్భావన మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. 'సోమనాథ్ దేవాలయ అభివృద్ధిలో శివుడి ఆశీస్సులు ఉన్నాయి. సోమనాథ్ దేవాలయ రూపురేఖలు పూర్తిగా మారుస్తున్నాం. 1951లో సోమనాథ్ దేవాలయ పునర్నిర్మాణం చేపట్టాం. భారత్ తన ప్రాచీన సంస్కృతిని, వారసత్వాన్ని కూడా పరిరక్షించుకుంటుంది. సోమనాథ్ పునర్నిర్మాణ పనుల ద్వారా దీన్ని ప్రపంచానికి చాటాం. భారత్ అంటే వేల ఏళ్ల ఆధ్యాత్మిక చైతన్యం కలిగిన దేశం. అసత్యంపై ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని మన పూర్వీకులు నిరూపించారు. 1998 మే 11న ఇదే



రోజు పోఖ్రాన్‌లో అణు పరీక్షలు చేపట్టాం. 1998లో అణు పరీక్షల ద్వారా భారత్ సత్తా చాటాం. అప్పటి అణుపరీక్షలు చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయాయి. అణు పరీక్షల తర్వాత అనేక ఆంక్షలు విధించారు ఇబ్బంది పెట్టారు. మనం ఎవరి ఆంక్షలకు తలొగ్గలేదు ధైర్యంగా నిలబడ్డాం. 1998 మే 13న మరో రెండు అణు పరీక్షలు నిర్వహించాం. అటల్ నేతృత్వంలో భారత్ సత్తా అంటే ప్రపంచానికి ఏమిటో చూపించాం. భారత్ ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు తలొగ్గదని నిరూపించాం. చంద్రయాన్ ప్రాజెక్టులో రోవర్ దిగేచోటును శివశక్తి పాయింట్ అని పేరు పెట్టాం. శివుడికి, చంద్రుడికి అవినాభావ సంబంధం ఉంది. సోమనాథ్ దేవాలయ సంపదను గజనీ, ఖిల్జీ అనేకసార్లు దోచుకున్నారు. ఎన్ని సార్లు దాడులు చేసినా సోమనాథ్ దేవాలయం సగర్వంగా నిలబడింది. భారత్ ఆధ్యాత్మిక శక్తి గురించి విధ్వంసకారులకు తెలియదు' అని ప్రధాని ఉద్ఘాటించారు.

# వార్తల్లోకెక్కే సోమరితనపు చర్య

• జులై 1 నుంచి 'విబి– జి రామ్ జి' అమల్లోకి వస్తుందని ప్రకటించడంపై కాంగ్రెస్ ఫైర్





**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం 'ఎంజి నరేగా' స్థానంలో కొత్తగా తీసుకువచ్చిన 'విబి– జి రామ్ జి' చట్టం జులై 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్న ప్రకటించడంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. దీనిని 'కేవలం వార్తల్లోకి రావడానికే చేసే మరో సోమరితనపు చర్య'గా అభివర్ణించింది. ఈ చట్టం ఇచ్చే ఏకైక హామీ 'తీవ్రమైన కేంద్రీకరణ', గ్రామీణ కార్మికుల బేరసారాల శక్తిని బలహీనపరచడమేనని ఆరోపించింది. గ్రామీణ భారతీయ కుటుంబాల రాజ్యాంగబద్ధమైన పని చేసే హక్కును, వేతనాల హక్కును దోచుకుంటున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఆరోపించారు. 'విబి– జి రామ్ జి'పై కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో, ఇప్పటికే తెలిసిన విషయాలకు కొత్తగా ఏమీ చేర్చలేదని, ఇలాంటి చర్యలు తీసుకోవడంలో ఆరితేరిన ఒక ప్రభుత్వం చేస్తున్న మరో సోమరితనపు, కేవలం వార్తల్లోకి ఎక్కే ప్రయత్నం ఇది అని, త్వరలో విడుదల చేస్తామని చెప్పడం తప్ప, ఎలాంటి వివరాలు వెల్లడించలేదని రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. 'ఎంజిఎన్ఆర్ఇజిఎ స్థానంలో రాబోతున్న ఈ పథకాన్ని 2026 జూలై 1 నుంచి అమలు చేయాలంటే, ఇప్పటికి అన్ని కార్యాచరణ వివరాలు అందుబాటులో ఉండాలి. ఈ వివరాలపై ప్రజాభిప్రాయ సేకరణ, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు కేవలం లాంఛనాలతో కాకుండా అర్థవంతంగా జరగాలి' అని ఆయన అన్నారు. 'వి.బి.జి. రామ్.జి. ఇచ్చే ఏకైక హామీ, తీవ్రమైన కేంద్రీకరణ, గ్రామీణ కార్మికుల బేరసారాల శక్తిని బలహీనపరచడమే అని, అందులో ఎలాంటి సందేహం లేదని రమేష్ ఆరోపించారు.

**కొత్త లేబర్ కోడ్లు... కార్మికుల హక్కులకు పెద్ద దెబ్బ : ఖర్గే**

నాలుగు కార్మిక చట్టాల తుది నిబంధనలను నోటిఫై చేసి, వాటిని పూర్తిగా అమలులోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ సోమవారం తీవ్రంగా విరుచుకుపడింది. స్వాతంత్ర్యం తర్వాత కార్మికుల హక్కులకు ఈ చట్టాలు అతిపెద్ద ఎదురు దెబ్బ అని ఆరోపించింది. మోదీ ప్రభుత్వం తనదైన పిరికితనంతో, అసెంబ్లీ ఎన్నికలు ముగిసే వరకు వేచి చూసి, 8, 9 తేదీలలో వరుస గెజిట్ నోటిఫికేషన్ల ద్వారా ఈ నాలుగు 'కార్మిక వ్యతిరేక' కార్మిక చట్టాలను జారీ చేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఒక ప్రకటనలో విమర్శించారు. కోట్లాది మంది భారత కార్మికులకు, ఈ చట్టాలు నియామకాలు–తొలగింపుల విధానాలు, కాంట్రాక్ట్ ఉపాధి, యూనియన్ ఏర్పాటుకు పరిమిత అవకాశాలతో కూడిన భవిష్యత్తును వాగ్దానం చేస్తున్నాయి' అని ఖర్గే ఒక ప్రకటనలో తెలిపారు. మోదీ ప్రభుత్వం ఎటువంటి సంప్రదింపులు లేకుండా ఈ 'కార్మిక వ్యతిరేక' చట్టాలను రూపొందించి, అమలు చేసిందనేది గమనించాల్సిన విషయం అని ఆయన అన్నారు. 'ఇది 2015 నుండి భారత కార్మిక సదస్సును కూడా నిర్వహించలేదు. కేవలం ప్రధానమంత్రి పారిశ్రామికవేత్త మిత్రులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చే ఈ చట్టాలు, స్వాతంత్ర్యం తర్వాత కార్మికుల హక్కులకు అతి పెద్ద ఎదురుదెబ్బ' అని ఖర్గే ఆరోపించారు. భారత కార్మికుల పట్ల తమ దార్శనికత విషయంలో కాంగ్రెస్ దృఢంగా ఉందని ఆయన అన్నారు.

## ఓట్ల తొలగింపుపై మమతకు సుప్రీం ఊరట



**న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో పాటు ఇతరులు ఓట్ల తొలగింపు అంశంపై కొత్తగా దరఖాస్తులు దాఖలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు సమయంలో నమోదైన గెలుపు మెజారిటీ కంటే, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తొలగించబడిన ఓట్ల సంఖ్య ఎక్కువగా ఉందన్న పిటిషనర్ల వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. సుమారు 31 నియోజకవర్గాల్లో గెలుపు మెజారిటీ కంటే తొలగించిన ఓట్లే అధికంగా ఉన్నాయని టిఎంసి ఎంపి, సీనియర్ అడ్వకేట్ కల్యాణ్ బెనర్జీ ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్మాల్యా బాగ్చీలతో కూడిన బెంచ్.. ఈ అంశంపై తాజా వినతులు సమర్పించేందుకు అనుమతించింది. అయితే, ఎన్నికల సంఘం ఈ వాదనలను వ్యతిరేకిస్తూ, ఇలాంటి ఫిర్యాదులకు ఎలక్షన్ పిటిషన్ మాత్రమే పరిష్కారమని పేర్కొంది. ఇటీవల జరిగిన బెంగాల్ ఎన్నికల్లో 90 శాతానికి పైగా పోలింగ్ నమోదు కాగా, 294 స్థానాలకు గానూ బిజెపి 207, టిఎంసి 80 స్థానాలను దక్కించుకున్న సంగతి తెలిసిందే.

# తమిళనాడులో కొత్త ఎమ్మెల్యేలు ప్రమాణం

• ఎమ్మెల్యే ధృవీకరణ పత్రం మరిచిపోయిన మంత్రి కీర్తన
• తనది కాకుండా మరొకరి పత్రం చూపించిన టివికె శాసనసభ్యుడు ఆర్. కుమార్

**చెన్నై :** తమిళనాడులో ఆదివారం కొత్త ప్రభుత్వం కొలువుదీరగా, సోమవారం అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు ప్రమాణం స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, మరో తొమ్మిది మంది మంత్రులు, ఎడప్పాడి కె. పళనిస్వామితో సహా మాజీ ముఖ్యమంత్రులు, మాజీ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. 17వ శాసనసభ తొలి సమావేశంలో విజయ్ నాయకత్వాన్ని, విజయాన్ని ప్రశంసిస్తూ ప్రొటెం స్పీకర్ ఎం.వి. కరుప్పయ్య ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రి మొదటగా ప్రమాణ స్వీకారం చేయగా, ఆ తర్వాత మంత్రులు ఎన్. ఆనంద్, ఆదవ్ అర్జున, కె.జి. అరుణ్‌రాజ్, కె.ఎ. సెంగోట్టయ్యన్, పి. వెంకటరమణన్, ఆర్. నిర్మల్ కుమార్, రాజ్‌మోహన్, టి.కె. ప్రభు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం, డిఎంకె శాసనసభాపక్ష నాయకుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, మాజీ ముఖ్యమంత్రులు పళనిస్వామి, ఓ. పన్నీర్‌సెల్వం (డిఎంకె), ఇతర ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్, ఉదయనిధి, పన్నీర్‌సెల్వం తదితరులు 'గౌరవంగా ప్రతిజ్ఞ' చేసి ప్రమాణ స్వీకారం చేశారు. పళనిస్వామి, పిఎంకెకు చెందిన సౌమ్య అన్బుమణి తదితరులు దేవుడిపై ప్రమాణం చేశారు. పొనరుత్తి ఎఐఎడిఎంకె ఎమ్మెల్యే కె. మోహన్ ప్రమాణ స్వీకారం చేస్తుండగా అకస్మాత్తుగా కన్నీళ్లు పెట్టుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి జె. జయలలితను స్మరించుకుంటూ, అసెంబ్లీ హాలులో ఉన్న దివంగత ఎఐఎడిఎంకె అధినేత్రి చిత్రపటానికి







చేతులు జోడించి నివాళులర్పించారు. ప్రమాణ స్వీకారానికి తప్పనిసరి అయిన ఎన్నికల ధృవీకరణ పత్రాన్ని మంత్రి ఎస్. కీర్తన సమర్పించకపోవడంతో, ఆమె మొదట ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయలేకపోయారని ఒక అధికారి తెలిపారు. అసెంబ్లీ ముఖ్య కార్యదర్శి కె. శ్రీనివాసన్ మైక్రోఫోన్‌లో కీర్తన పేరును ప్రకటిస్తూ ఆమెను ఆహ్వానించగా, ఆమె ఒకవైపు ముఖ్యమంత్రి కుర్చీకి సరిగ్గా ఎదురుగా ఉన్న పోడియం వద్దకు నడిచారు. అలాగే, ప్రమాణ స్వీకారం చేసే ఎమ్మెల్యేలు ప్రొటెం స్పీకర్ కుర్చీకి అభిముఖంగా ఉంటారు. కీర్తన పోడియం వద్దకు చేరుకుంటుండగా, శ్రీనివాసన్ చేయి పైకెత్తి ఆమెను సర్టిఫికెట్ అడిగారు. ఇది అసెంబ్లీ కార్యకలాపాల ప్రత్యక్ష ప్రసారంలో కనిపించింది. అయితే, ఆమె ఆ సర్టిఫికెట్‌ను చూపించలేకపోయారు. శ్రీనివాసన్‌కు ఆమె ఏమి సమాధానమిచ్చారో తెలియరాలేదు. ఏం జరిగిందని అడగ్గా, 'ఆమె తన ఎన్నికల ధృవీకరణ పత్రాన్ని తెచ్చుకోలేదని తెలుస్తోంది. ఆమె ఆ పత్రాన్ని సమర్పించలేకపోవడంతో, ఆ ఉన్నతాధికారి ఆమెను ప్రమాణ స్వీకారం చేయడానికి మర్యాదపూర్వకంగా నిరాకరించారు. ఆమె తన ఎన్నికల ధృవీకరణ పత్రాన్ని సమర్పించినప్పుడు ప్రమాణ స్వీకారం చేయవచ్చు అని ఒక అధికారి పిటిఐతో అన్నారు. కొంతసేపటి తర్వాత, కీర్తన తన ధృవీకరణ పత్రాన్ని సభకు తీసుకువచ్చి, ఉన్నతాధికారికి సమర్పించి, పదవీ ప్రమాణం చేశారు. అయితే వేలచెరి టివికె శాసనసభ్యుడు ఆర్. కుమార్ ధృవీకరణ పత్రం సమర్పించి ప్రమాణ స్వీకారం ప్రారంభించబోతుండగా, శ్రీనివాసన్ ఆయనను ఆపారు. ఆయన సమర్పించిన ధృవీకరణ పత్రంలో వేరొకరి పేరు ఉందని కుమార్‌కు గుర్తు చేశారు. తరువాత తెలిసిన విషయమేమిటంటే, కుమార్ తన పక్కన కూర్చున్న పార్టీ సహచరుడి సర్టిఫికెట్‌ను తీసుకువచ్చి శ్రీనివాసన్‌కు ఇచ్చారు. వెంటనే, కుమార్ తన సీటుకు తిరిగి వెళ్లి, తన ఎన్నికల సర్టిఫికెట్‌ను తీసుకువచ్చి అధికారికి ఇచ్చారు. కుమార్ అతని నుండి సహచరుడి సర్టిఫికెట్‌ను తీసుకుని తిరిగి తన పార్టీ సహచరుడికి ఇచ్చారు. ఆ తరువాత, అధికారి కుమార్‌ను ప్రమాణం చేయడానికి అనుమతించారు. తమిళనాడు శాసనసభ ప్రస్తుత బలం 233 కాగా, వాస్తవ పూర్తి బలం 234. విజయ్ పెరంబూరు, తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గాల నుండి విజయం సాధించారు. ఆయన తిరుచిరాపల్లి తూర్పు స్థానానికి రాజీనామా చేశారు.

## కేరళలో సిఎం ఎంపికపై కాంగ్రెస్‌లో అనిశ్చితి

• పోటీలో ముగ్గురు నేతలు • అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కట్టిబడి ఉంటా : రమేష్ చెన్నితాల



**తిరువనంతపురం:** కేరళలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో యుడిఫ్ విజయం సాధించింది. అయితే కొత్త ముఖ్యమంత్రి ఎంపికపై కాంగ్రెస్ పార్టీలో అనిశ్చితి కొనసాగుతోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ పడుతున్న ముగ్గురు అభ్యర్థులతో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ చర్చలు జరిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి కోసం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రమేష్ చెన్నితాల, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, ప్రతిపక్ష నాయకుడు విడి సతీసన్ లాబీయింగ్ చేస్తున్నారు. శనివారం న్యూఢిల్లీలో పార్టీ అధిష్ఠానం ఈ ముగ్గురు నాయకులతో సమావేశమైంది. ఈ సమావేశానికి కెపిసిసి చీఫ్ సన్నీ జోసెఫ్, కేరళ వ్యవహారాల ఎఐసిసి ప్రధాన కార్యదర్శి దీపా దాస్‌మున్సి కూడా హాజరయ్యారు. నాయకత్వ సమస్యపై సోనియా గాంధీతో ఖర్గే సమావేశమైన తర్వాత ఒక నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ఇక్కడి పార్టీ నాయకులు సోమవారం సంకేతాలిచ్చారు. గత వారం సతీసన్, వేణుగోపాల్ మద్దతుదారుల మధ్య తీవ్ర నిరసనలు, పోస్టర్ యుద్ధాలకు సాక్ష్యంగా నిలిచిన కేరళలోని రాజకీయ వాతావరణం మరింత సద్దుమణిగే వరకు హైకమాండ్ వేచి చూస్తోందని కూడా వారు తెలిపారు. ఖర్గే, రాహుల్‌లతో సమావేశమైన అనంతరం, నాయకత్వ సమస్యపై నిరసనలు, ఫ్లెక్స్‌బోర్డ్ ప్రచారాలకు దూరంగా ఉండాలని కేరళ నాయకులు, దాస్‌మున్సీ సంయుక్తంగా పార్టీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. తెర వెనుక చర్చలు కొనసాగుతుండగా, తుది నిర్ణయంపై కేరళలోని కాంగ్రెస్ నాయకులు సస్పెన్స్‌లోనే ఉన్నారు. రాష్ట్రంలోని 140 స్థానాలకు గాను 102 స్థానాలు గెలుచుకుని కూటమి భారీ మెజారిటీ సాధించినప్పటికీ, ముఖ్యమంత్రిని నిర్ణయించడంలో జరుగుతున్న సుదీర్ఘ జాప్యంపై కాంగ్రెస్ కూటమి భాగస్వాములు కూడా అసంతృప్తిగా ఉన్నారని సమాచారం. నిర్ణయం తీసుకోవడంలో జాప్యం గురించి అడగ్గా, పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక సీనియర్ కాంగ్రెస్ నాయకుడు 'అసెంబ్లీ పదవీకాలం మే 23తో ముగుస్తుంది. కాబట్టి తొందరపడాల్సిన అవసరం లేదు, ఎందుకు ఆందోళన? అని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి పదవికి సంబంధించి పార్టీ హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా, రాష్ట్రంలోని కాంగ్రెస్, యుడిఎఫ్ కార్యకర్తలందరూ దానిని అంగీకరిస్తారని సోమవారం చెన్నితాల అన్నారు. 'మేము చెప్పాలనుకున్నదంతా హైకమాండ్‌కు తెలియజేశాము. వారు అంతా విన్నారు. మిగిలినది వారే నిర్ణయించుకోవాలి' అని న్యూఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన అనంతరం చెన్నితాల విలేకరులతో అన్నారు. నిర్ణయం తీసుకోవడంలో జాప్యం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమేనని ఆయన అన్నారు. అయితే కేరళ తదుపరి ముఖ్యమంత్రి ఎంపికపై నెలకొన్న అనిశ్చితిని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కె. మురళీధరన్ ఒక రైలు ప్రయాణంతో పోల్చారు. రైలు స్టేషన్‌కు చేరుకోకముందే కదలడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధిష్టానం తమ నిర్ణయాన్ని ఎప్పుడు ప్రకటిస్తుందో ఊహించడం కష్టమని, అది అధికారికంగా ప్రకటించినప్పుడు మాత్రమే అందరికీ తెలుస్తుందని మురళీధరన్ అన్నారు.

### బెంగాల్ సరిహద్దుల్లో కంచె..

# బిఎస్‌ఎఫ్‌కు భూమి బదిలీ

తొలి మంత్రివర్గ సమావేశం నిర్ణయం



**కోల్‌కతా :** బెంగాల్‌లో కొత్త ముఖ్యమంత్రి సువేందు అధికారి తన మార్క్ పాలనను ప్రారంభించారు. భారత్ – బంగ్లాదేశ్ సరిహద్దుల మధ్య కంచె నిర్మాణం కోసం అవసరమైన భూమిని బిఎస్ఎఫ్‌కు బదిలీ చేస్తూ నూతన మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. 45 రోజుల్లో భూమిని కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు అప్పగించే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి అధ్యక్షతన సోమవారం జరిగిన తొలి మంత్రివర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం 'ఆయుష్మాన్ భారత్'ను బంగాల్‌లో తక్షణమే అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సువేందు అధికారి తెలిపారు. కేంద్రంతో సమన్వయం చేసుకొని, త్వరలోనే బెంగాల్ ప్రజలందరికీ ఉచిత వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖతో కుదుర్చుకోవాల్సిన అవసరమైన ఒప్పందాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి కృషిక్ బీమా యోజన, పిఎం శ్రీ, విశ్వకర్మ పథకం, 'బేటీ బచావో బేటీ పఢావో', 'ఉజ్వల యోజన' వంటి కీలక కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలో చురుగ్గా అమలు చేసే ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు.

**జనగణన ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభం**

పాఠశాల ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని 5 ఏళ్ల పాటు పెంచుతున్నట్లు సువేందు అధికారి వివరించారు. కొన్ని నెలలుగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న జనగణన ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. గతేడాది జూన్‌లో కేంద్రం జారీ చేసిన జనగణన నోటిఫికేషన్‌ను గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టిందని సువేందు అధికారి ఆరోపించారు. జాతీయ, రాష్ట్ర క్యాడర్ అధికారులకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పించాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామన్న సువేందు అధికారి, దీనికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఆదేశించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం నిలిపివేసిన కొత్త క్రిమినల్ చట్టాలను బంగాల్‌లో అమలు చేయాలని మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నట్లు సువేందు అధికారి తెలిపారు.

**అమల్లో ఉన్న సంక్షేమ పథకాలను నిలిపివేయం : సిఎం**

అటు బిజెపికి చెందిన 321 మంది అమరవీరులకు కూడా మంత్రివర్గం నివాళులు అర్పించింది. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, రాజకీయ హత్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఏ సామాజిక సంక్షేమ పథకాన్ని కూడా నిలిపివేయబోమని సువేందు అధికారి స్పష్టం చేశారు. 'లక్ష్మీర్ భండార్' వంటి సామాజిక పథకాలు యథావిధిగా కొనసాగుతాయని పరోక్షంగా హామీ ఇచ్చారు. ఏదైనా పథకం 30 ఏళ్ల క్రితం లేదా కేవలం 10 ఏళ్ల క్రితం ప్రారంభమైందా అనే విషయంతో సంబంధం లేకుండా అన్ని సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. అయితే, మరణించిన వ్యక్తులు లేదా భారత పౌరసత్వం లేనివారు ఈ పథకాల కింద ప్రయోజనాలను పొందుతుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

# 'స్టాలిన్' ఇంటికి విజయ్

• ఒకరికొరు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించుకున్న తాజా, మాజీ సిఎంలు • ఎండిఎంకె వ్యవస్థాపకుడు వైకోతోనూ ముఖ్యమంత్రి భేటీ



**చెన్నై :** తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఎదుర్కోనున్న కీలకమైన బలపరీక్షకు ముందు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సోమవారం మాజీ ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్‌ను ఆళ్వార్‌పేటలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో విజయం సాధించి, ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ స్టాలిన్‌ను కలవడం ఇదే మొదటిసారి. ఈ పర్యటనను ప్రభుత్వ వర్గాలు ఒక 'మర్యాదపూర్వక భేటీ'గా అభివర్ణించాయి. స్టాలిన్, ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్, ముఖ్యమంత్రి విజయ్‌కు ఘన స్వాగతం పలికారు. ఉదయనిధి మొదటగా విజయ్‌కి కరచాలనం చేస్తూ, ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత స్టాలిన్ కూడా విజయ్‌ను ఆలింగనం చేసుకుని, ఆయన చేతులు పట్టుకుని తన ఇంటి లోపలికి తీసుకువెళ్లారు. విజయ్, స్టాలిన్ ఒకరినొకరు పట్టు శాలువాలు, పూలగుచ్ఛాలతో సన్మానించుకున్నారు. డిఎంకె చారిత్రక రాజకీయ ప్రస్థానంపై వెలువడిన 'కళాతిన్ నిరం కరుప్పు శివప్పు డిఎంకె 75' అనే పుస్తకాన్ని ఉదయనిధి విజయ్‌కు బహూకరించారు. రాష్ట్రంపై రూ. 10 లక్షల కోట్ల రుణ భారాన్ని మోపిందంటూ గత డిఎంకె ప్రభుత్వాన్ని విజయ్ తీవ్రంగా విమర్శించిన మరుసటి రోజే ఈ భేటీ జరగడం విశేషం. డిఎంకె హయాంలో అనేక అధికార కేంద్రాలు ఉండేవని పరోక్షంగా విమర్శించిన విజయ్, తన టివికె ప్రభుత్వంలో తానే ఏకైక అధికార కేంద్రమని కూడా స్పష్టం చేశారు. రుణ భారంపై విజయ్ చేసిన వ్యాఖ్యలకు డిఎంకె అధినేత స్టాలిన్ గట్టిగా బదులిచ్చారు. కాగా, సోమవారం స్టాలిన్‌తో భేటీ అనంతరం, విజయ్ ఎండిఎంకె వ్యవస్థాపకుడు వైకోను కలిశారు. వైకో కుమారుడు దురై వైకో, విజయ్‌కు స్వాగతం పలికారు. ఇదిలా ఉండగా, ఈనెల 13న తమిళనాడు అసెంబ్లీలో టివికె ప్రభుత్వానికి ఉన్న మెజారిటీ బలాన్ని నిరూపించుకునేందుకు జరగనున్న కీలకమైన బలపరీక్షకు ముందుగానే, స్టాలిన్, ఉదయనిధితో విజయ్ ఈ క్లుప్త భేటీని జరిపారు. టివికె ప్రభుత్వానికి మద్దతు ప్రకటించిన విసికె, ఐయుఎంఎల్, వామపక్ష పార్టీలు, డిఎంకె నేతృత్వంలోని కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి. టివికె ప్రభుత్వానికి మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ, గతంలో డిఎంకెతో పొత్తు పెట్టుకున్న మిత్రపక్షం. 234 మంది సభ్యులు కలిగిన అసెంబ్లీలో ఈ పార్టీకి ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు.

# ఖరీఫ్ సీజన్‌కు సరిపడినన్ని ఎరువులున్నాయ్

• భయాందోళన వద్దు:ధరల్లో పెరుగుదల లేదు • సాధారణంకంటే హెచ్చుస్థాయిలో నిల్వలు • రైతులకు కేంద్రం భరోసా

**న్యూఢిల్లీ:**రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సరిపడినన్ని ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని,భయాందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం రైతులకు సోమవారం భరోసా ఇచ్చింది. పశ్చిమాసియాలో పరిణామాలపై మంత్రిత్వశాఖలమధ్య సమన్వయంకోసం ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో ఎరువులశాఖకు చెందిన అదనపు కార్యదర్శి అపర్ణా ఎస్.శర్మ ఎరువులకు సంబంధించిన విషయం తెలియజేశారు.దేశంలో సాధారణం కంటే హెచ్చుస్థాయిలో ఎరువుల నిల్వలున్నాయని చెప్పారు. ప్రత్యామ్నాయ ఎరువులను కూడా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం యూరియాను అదేవిధంగా భూమికి కావాల్సిన నత్రజని పోషకాలను ఇతర దేశీయ ఉత్పత్తులకు అనుబంధంగా దిగుమతి చేసుకుంటోందని, అందువల్ల రాబోయే ఖరీఫ్ సీజన్‌లో నాట్లు జరిగే సమయంలో అన్నీ పూర్తిగా అందుబాటులో ఉంటాయని, ఎలాంటి కొరతాలేదని ఆమె తెలియజేశారు. అదేవిధంగా ప్రధానమైన ఎరువుల అమ్మకం ధరలన్నీ ఒకేవిధంగా స్థిరంగా ఉన్నాయని, వాటి ధరలు పెరగలేదని కూడా వివరణ ఇచ్చారు. రైతులు నేలకు అవసరమైన ఎరువులు మాత్రమే ఉపయోగించేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నాయని,మితిమీరినస్థాయిలో ఎరువుల వాడకాన్ని నివారించేందుకు రైతులను చైతన్యవంతులను చేసే కార్యక్రమాలు చేపట్టామని శర్మ చెప్పారు. సాధారణంగా రైతులు దిగుబడి ఎక్కువ వస్తుందనే ఉద్దేశంతో ఒక యూరియా బస్తాకు బదులు ఒకటిన్నర,రెండు బస్తాలు కూడా వేస్తారు. ఈ చర్యల నివారణకు కార్యక్రమాలను నిరంతరం చేపట్టినట్టు చెప్పారు. దేశంలో ఎరువులకు పూర్తి భద్రత ఉందని, భయపడాల్సిన అవసరం లేదని, సరిపడినన్ని నిల్వలున్నాయని చెప్పారు. ''ఈ రోజువరకూ ఎరువుల అవసరాలను వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం చూస్తే,51 శాతం కంటే ఎక్కువగా నిల్వలు ఉన్నాయని చెప్పారు. నిల్వలు ఉన్నాయని, ఈ సంక్షోభ సమయంలో ఈ సరుకు నిల్వలన్నీ రైతులకు అందుబాటులో ఉంటాయని శర్మ చెప్పారు.

### సువేందు అధికారి పిఎ హత్య కేసు...

# ముగ్గురు షార్ప్ షూటర్లు అరెస్టు

**కోల్‌కతా :** బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడు (పిఎ) చంద్రనాథ్ రథ్ హత్య కేసు దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసుకు సంబంధించి ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు షార్ప్ షూటర్లను పోలీసులు అరెస్టు చేశారు. వారిని కఠిన భద్రత మధ్య కోల్‌కతాకు తరలించి, విచారణ చేశారు. అత్యంత ప్రణాళికాబద్ధంగా చేసిన ఈ హత్యకు బిహార్‌తో లింకులు ఉన్నాయని, డిజిటల్ ఆర్థిక లావాదేవీలు, వ్యవస్థీకృత నేరగాళ్ల హస్తం ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. బెంగాల్ రాష్ట్ర పోలీసుల ప్రకారం, డిజిటల్ ఆధారాలు, లావాదేవీల రికార్డులు, ఘటనా స్థలంలో లభించిన క్లూస్ అధారంగా నిందితులను పట్టుకున్నారు. సిఐడి, స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టిఎఫ్) బృందాలు సంయుక్తంగా ఈ కేసును కాంట్రాక్ట్ కిల్లింగ్, అంతర్రాష్ట్ర నేర ముఠాలు, ఇతర రాష్ట్రాలతో లింకులు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నాయి. 'హత్యకు ఉపయోగించినట్లు భావిస్తున్న సిల్వర్ కలర్ కారు, హౌవ్‌డాలోని బల్లీ టోల్ ప్లాజా వద్ద చేసిన యుపిఐ లావాదేవీల ఆధారంగా ఈ కేసును ఛేదించాం. దాడికి కొద్ది సేపటి ముందే ఈ వాహనం టోల్ ప్లాజాను దాటినట్లు గుర్తించాం. డిజిటల్ చెల్లింపు ద్వారా ఒక అనుమానితుడి మొబైల్ నంబర్‌ను పోలీసులు కనిపెట్టడం జరిగింది. అంతేకాదు టోల్ ప్లాజా వద్ద ఉన్న సిసిటివి ఫుటేజ్‌లో కారు, అందులోని వ్యక్తులు స్పష్టంగా కనిపించడంతో దర్యాప్తునకు బలమైన ఆధారాలు లభించాయి. టోల్ రికార్డులు, మొబైల్ టవర్ లొకేషన్లు, ఆర్థిక లావాదేవీలను విశ్లేషించాం. దాడి తర్వాత దుండగులు సిల్వర్ కారును వదిలేసి, ఎరుపు రంగు కారు, మోటార్ సైకిళ్లపై పారిపోయారు. దర్యాప్తులో నిందితులకు బిహార్‌తో లింకులు ఉన్నట్లు తెలిసింది. బంగాల్ ఎస్‌టీఎఫ్ బిహార్‌లోని బక్సర్ జిల్లాలో దాదులు విశాల్ శ్రీవాస్తవ అనే వ్యక్తిని విచారణ తర్వాత వదిలిపెట్టడం జరిగింది. మయాంక్ మిశ్రా, విక్కీ మౌర్య, అటల్ అనే ముగ్గురిని తదుపరి విచారణ కోసం బంగాల్‌కు తరలించాం' అని పోలీసులు తెలిపారు.

## ఇరాన్ శాంతి ప్రతిపాదన పూర్తిగా అసంబద్ధం

# తిరస్కరించిన ట్రంప్


**47 ఏళ్ళుగా అమెరికాతో చెలగాటం.. వాళ్ళ నోరు మూయిస్తామని హెచ్చరిక**

**శత్రువుకు ఇరాన్ తలవంచదు: పెజెష్కియన్ హెచ్చరిక**

**హోర్ముజ్‌పై సన్నగిల్లిన ఆశలు,చమురు ధర పైకి... బంగారం కిందికి..**

**వాషింగ్టన్/దుబాయ్:** పశ్చిమాసియాలో యుద్ధం ముగించేందుకు ఇరాన్ పంపిన శాంతి ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి తిరస్కరించారు. ''ఈ శాంతి ప్రతిపాదన పూర్తిగా అసంబద్ధమైనది, ఎంతమాత్రం మాకు ఆమోదయోగ్యం కాదు, 47 ఏళ్ళుగా అమెరికాతో, ఇతర దేశాలతో వారు చెలగాటం ఆడుతున్నారు, అమెరికాను చూసి నవ్వుతున్నారు, ఇక వారు నవ్వలేరు'' అని ట్రూత్ సోషల్ ద్వారా హెచ్చరించారు. అదే సమయంలో ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ సోషల్ మీడియా వేదికపై స్పందిస్తూ, శత్రువు ముందు ఇరాన్ తలవంచబోదని స్పష్టం చేశారు. దీంతో హోర్ముజ్ జలసంధి తెరుచుకునేందుకు మరింత జాప్యం జరిగే పరిస్థితి తలెత్తింది. ఇరాన్ శాంతి ప్రతిపాదనను ట్రంప్ తిరస్కరించడంతో చమురు రవాణా, సంక్షోభ నివారణకు ఆశలు సన్నగిల్లాయి. ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్ సహా గల్ఫ్‌దేశాలకు ఇరాన్‌కు మధ్య డ్రోన్ల దాడులతో చిన్న చిన్న కలహాలు కొనసాగుతున్నాయి. దీంతో సోమవారం అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధర బ్యారెల్‌కు 105.50 డాలర్లకు పెరిగింది. ఈ పెరుగుదల అంతర్జాతీయస్థాయిలో 4.1 శాతంగా నమోదైంది. కాల్పుల విరమణ అమలులోకి వచ్చిన తర్వాత ముడిచమురు బ్యారెల్ ధర గడచిన 33 రోజులుగా 100 డాలర్లు తగ్గకుండా అంతకంటే ఎక్కువగానే కొనసాగుతోంది. ఐతే నవంబరులో అమెరికాలో జరిగే మధ్యంతర ఎన్నికల నాటికి హోర్ముజ్ జలసంధి తెరుచుకుంటుందని, చమురు ధరలు గణనీయంగా తగ్గిపోతాయని వైట్‌హౌస్ జాతీయ ఆర్థిక మండలి డైరెక్టర్ కెవిన్ హాస్సెట్ ఫాక్స్‌న్యూస్ ఇంటర్వ్యూలో చెప్పారు. ఒకసారి జలసంధి తెరుచుకున్న తర్వాత గల్ఫ్ నుండి వచ్చే చమురును తాము క్రమబద్ధీకరిస్తామన్నారు. కాగా సోమవారంనాడు బంగారం ధర కూడా తగ్గింది. భారత్‌లో స్టాక్ మార్కెట్లు పతనంకాగా, బంగారం ధర వరుసగా మూడోరోజు కూడా తగ్గుముఖం పట్టింది.ట్రంప్ అలవిమాలిన డిమాండ్ల ప్రణాళికను తిరస్కరిస్తున్నట్లు ఇరాన్ అధ్యక్షుడు చెప్పారు. యుద్ధం ముగించే పేరుతో చేస్తున్న మితిమీరిన డిమాండ్లకు అమెరికా మూల్యం చెల్లించుకోక తప్పదని పెజెష్కియన్ హెచ్చరించారు. దాడులు చేస్తే ఇరాన్ కూడా సరికొత్త శక్తిసామర్థ్యాలతో యుద్ధం చేస్తుందని, చర్చలు కూడా తమకు ఒక ప్రత్యామ్నాయంగా ఉంటాయని చెప్పారు. అమెరికా సరికొత్త శాంతి ప్రతిపాదనలకు మధ్యవర్తి పాకిస్థాన్ ద్వారా ఇరాన్ ఆదివారం తన ప్రతిస్పందన అమెరికాకు తెలియజేసింది. యుద్ధం ముగించేందుకు వీలైన అనుకూల ఒప్పందానికి రావాలని, హోర్ముజ్ జలసంధిని తెరవాలని, అణు కార్యక్రమం నుండి ఇరాన్ సంపూర్ణంగా వైదొలగాలని ట్రంప్ చేసిన ప్రతిపాదనకు ఇరాన్ కొంత ఆలస్యంగా ఇచ్చిన సమాధానాన్ని ట్రంప్ సోమవారం తిరస్కరించారు. చర్చలు పునఃప్రారంభించేందుకు వీలుగా యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాలని, సంప్రదింపులపై మాత్రమే దృష్టి కేంద్రీకరించాలని, జలసంధిలో నౌకల భద్రతకు భరోసా ఇవ్వాలని, ఇరాన్ ఓడరేవులపై సెంట్‌కామ్ నావికాదళం దిగ్బంధనం ఎత్తివేయాలని అమెరికాకు తెలియజేసినట్లు ట్రంప్ తిరస్కారానికి ముందుగా ఇరాన్ ప్రభుత్వ ప్రసార మాధ్యమం ప్రకటించింది. లెబనాన్ సహా అన్ని రంగాలలోనూ యుద్ధం ముగించాలని కోరుకుంటున్నట్లు పాకిస్థాన్ ద్వారా ఇరాన్ సందేశం పంపింది. హెజ్బొల్లా సేనలపై దాడులు నిలిపివేయాలని, లెబనాన్ ఆక్రమణ చర్యలను స్తంభింపజేయాలని, అణు కార్యక్రమం గురించి తర్వాత తీరిగ్గా మాట్లాడుకుందామని, మొదట యుద్ధం నిలిపివేయాలని ఇరాన్ చెప్పింది. దీనిపై ట్రంప్ తొలుత ఆదివారం స్పందిస్తూ, ''ఇరాన్ చెలగాటం ఆడుతోంది, ఎగతాళిగా నవ్వుతోంది కానీ, ప్రత్యక్షంగా వ్యాఖ్యానాలు చేయకుండానే మేం ఆ నవ్వులను ఆపేయగలం'' అని హెచ్చరించారు. తర్వాత సోమవారం చేసిన ప్రకటనలో ఇరాన్ ప్రతిపాదన ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని తిరస్కరించారు. దీనిపై ఇరాన్ బ్రిగేడియర్ జనరల్ అక్రమి నియా స్పందిస్తూ, శుద్ధి చేసిన తమ దేశ అణు పదార్థాన్ని తస్కరించి తీసుకుపోవాలని అమెరికా ప్రయత్నం చేసేఅవకాశం ఉందని, దానిని రక్షించుకునేందుకు తమ నిల్వ కేంద్రాలవద్ద బలగాలు సంసిద్ధంగా ఉన్నాయని ''ఇర్నా'' న్యూస్ ఏజన్సీకి చెప్పారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ కూడా స్పందిస్తూ, యుద్ధం ముగిసిపోలేదని, శుద్ధిచేసిన యురేనియంను ఇరాన్ నుండి ఇంకా బయటకు తరలించాల్సిన అవసరం ఉంద ని, ఇరాన్‌ను పూర్తిస్థాయిలో ఓడిస్తామని శపథం చేశారు.

# రష్యా—ఉక్రేన్ మధ్య ఆరోపణలు



**కీవ్:** రష్యా—ఉక్రేన్ మధ్య కాల్పుల విరమణ ఉల్లంఘనలపై పరస్పర ఆరోపణలు కొనసాగుతున్నాయి. రెండు దేశాల మధ్యా అమెరికా ప్రతిపాదించిన 72 గంటల కాల్పుల విరమణ ఒప్పందం సోమవారంతో ముగిసిపోయినప్పటికీ వాగ్వాదం కొనసాగుతోంది. రెండు దేశాలమధ్యా తదుపరి చర్చలకు అమెరికా నాయకత్వం వహించే అవకాశం ఉంది. రష్యా డ్రోన్లు, బాంబులు పౌర ప్రాంతాలపై దాడులు చేసినట్లు ఉక్రేన్ సోమవారం ఆరోపించింది. ఈశాన్య ఖార్కీవ్, దక్షిణ ఖెర్సాన్ ప్రాంతాలలో దాడులు చేసి ఇద్దరిని చంపిందని, మరో ఏడుగురికి గాయాలయ్యాయని రష్యాపై విమర్శలు చేసింది. రక్షణ రక్షణమంత్రిత్వశాఖ ఆదివారం ఉక్రేన్‌పై ఆరోపణలు చేస్తూ 1000 కంటే ఎక్కువసార్లు ఉక్రేన్ కాల్పుల విరమణ ఉల్లంఘన చేసిందని విమర్శించింది. ఇదిలా ఉండగా యూరోపియన్ కమిషన్ రాబోయే నెలలో ఉక్రేన్‌కు 9.1 బిలియన్ పౌండ్లు కేటాయించేందుకు సిద్ధపడింది. మొత్తం 90 బిలియన్ పౌండ్లు రుణం ఇచ్చే కార్యక్రమంలో భాగంగా ఈ కేటాయింపులు వచ్చేనెల చేస్తారు. ఇందులో 5.9 బిలియన్ డాలర్లు సైనిక అవసరాలకు 3.2 బిలియన్ డాలర్లు స్థూల ఆర్థిక సహాయం కింద కేటాయిస్తారు.

## హంటా వైరస్ ప్రయాణికులకు 42 రోజులు క్వారంటైన్

**ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు**

**ఫ్రాన్స్‌లో 22 కేసులు, ఒకరి పరిస్థితి ప్రమాదకరం**

**అర్జెంటీనా, ఉరుగ్వే, చిలీలో హంటావైరస్ మూలాలు**

**ఇది మరో కొవిడ్ కాదు: ప్రపంచ ఆరోగ్య సంస్థ**



**న్యూయార్క్:** హంటావైరస్ ప్రబలిన ఎం.వి హోండియస్ క్రూయిజ్ నౌక నుండి వివిధ దేశాలు తమ తమ జాతీయులను ప్రభుత్వ, సైనిక విమానాల ద్వారా స్వదేశాలకు తరలించాయి. వీరిలో ముగ్గురు ఫ్రెంచ్, ఒక అమెరికన్ ప్రయాణికుడిలో వైరస్ పాజిటివ్ లక్షణాలు కనిపించాయి. ఈ ప్రయాణికులను 42 రోజులు క్వారంటైన్‌లో ఉంచాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ సిఫార్సు చేసిందని టాస్ వార్తాసంస్థ పేర్కొంది. క్రూయిజ్ షిప్‌లో ప్రయాణిస్తున్న 17 మంది అమెరికన్ జాతీయులను ట్రంప్ ప్రభుత్వం మాంచెస్టర్ నెబ్రాస్కా మెడికల్ సెంటర్‌కు తరలించగా, 38 మంది క్రూయిజ్ షిప్ సిబ్బందిని ఫిలిప్పీన్స్‌ప్రభుత్వం స్వదేశానికి తరలించింది. మొత్తం 94 మంది ప్రయాణికులను అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్ దేశాలకు తరలించారు. హంటా వైరస్ బారిన పడిన ప్రయాణికులు క్వారంటైన్‌లో ఉండాల్సిన అవసరం లేదని ట్రంప్ యంత్రాంగం ప్రకటించగా, చికిత్స పొందుతున్న తమ జాతీయుడి పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉందని ఫ్రాన్స్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ వ్యాధికి సంబంధించి ఫ్రాన్స్‌లో 22 కేసులు నమోదయ్యాయి. ఈ పరిణామాలను ఫ్రెంచ్ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. సోమవారం మధ్యాహ్నం ఫ్రాన్స్ ప్రధానమంత్రి దీనిపై ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ పరిణామాలను ఐక్యరాజ్యసమితి అనుబంధ ప్రపంచ ఆరోగ్య సంస్థ నిశితంగా మతనిస్తోంది. ఈ వైరస్ మరో కొవిడ్ మహమ్మారి కాదని కూడా ప్రకటించింది. రోగులను ఆయా ప్రభుత్వాలు కనిపెట్టుకుని ఉండాలని సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధ్నామ్ ఘెబ్రెయేసస్ చెప్పారు. సాధారణ ప్రజలు ఎలాంటి భయాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. అనేకదేశాలు ఈ రోగులను క్వారంటైన్‌లో లేదా ఆసుపత్రులలో ఉంచాయి.

స్పెయిన్‌లోని కేనరీ దీవులకు 147 మంది ప్రయాణికులతో ఈ క్రూయిజ్ షిప్ వెళుతుండగా మార్గమధ్యలో సముద్రంలో మే నాలుగో తేదీన ప్రయాణికులల్లో హంటా వైరస్ వ్యాధి ప్రబలి ముగ్గురు మరణించారు. అనేకమంది చికిత్స పొందుతున్నారు. ఈ వైరస్ మూలాలు కనుగొనేందుకు అన్వేషణ జరుగుతోంది. అర్జెంటీనా, ఉరుగ్వే, చిలీ దేశాలలో ఈ వైరస్ మూలాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఏడేళ్ళ క్రితమే హంటావైరస్ ఫ్రెంచ్ గ్రామం పాపిగోనియన్‌లో వ్యాప్తి చెందినట్లు కూడా గుర్తించారు. ఎలుకల మలంవల్ల ఈ వ్యాధి మానవజాతిలో వ్యాప్తి చెందుతుంది. ఇందులో రకరకాల వైరస్‌లు ఉంటాయి. తీవ్రమైన తలనొప్పి, జ్వరం, వాంతులుతోపాటు ముఖ్యంగా శ్వాసకోశ సంబంధ సమస్యలు తీవ్రంగా తలెత్తుతాయి. ఊపిరి ఆడని పరిస్థితి వస్తుంది. ఈ వ్యాధి యాభైశాతం మేరకూ మరణానికి దారితీసే అవకాశం ఉంటుంది. ఐరోపా,ఆసియాలలో ఈ వ్యాధి మూత్రపిండాలకు సోకి రక్తస్రావ జ్వరాన్ని (హెచ్ఎఫ్ఆర్ఎస్) తెస్తాయి. ఐతే ఒక మనిషి నుండి మరో మనిషికి ఈ వ్యాధిసోకే అవకాశాలు చాలా తక్కువ. ఈ వ్యాధికి గుర్తింపు పొందిన చికిత్సగానీ, ఒక టీకా మందుగానీ లేదు. ఇళ్ళల్లో, పరిసర దేశాల్లో పరిశుభ్రత పాటించడమే ఈ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త.

## చైనా అంతరిక్ష కేంద్రంతో తియాన్‌జౌ–10 కార్గోనౌక అనుసంధానం



**బీజింగ్:** తియాన్‌జౌ–10 కార్గో నౌక సోమవారం విజయవంతంగా చైనా అంతరిక్ష కేంద్రానికి అనుసంధానమైంది. వరుసగా పదోసారి చైనా అంతరిక్ష కేంద్రానికి తియాన్‌జౌ నౌక ప్రయాణం చేసి విజయవంతంగా అనుసంధానమై రికార్డు సృష్టించింది. శాస్త్ర సాంకేతిక పరిశోధనలకు అవసరమైన ఆరు టన్నుల బరువుగల సామాగ్రిని ఈ నౌక అంతరిక్ష కేంద్రానికి తీసుకువెళ్ళింది. స్పేస్ సూట్, అంతరిక్ష ప్రయోగాల నిమిత్తం ఒక ట్రెడ్‌మిల్, శాస్త్రీయ పరిశోధనలకు అవసరమైన ఇతర సామాగ్రిని అంతరిక్ష కేంద్రానాకి ఈ నౌక తీసుకువెళ్ళింది. చైనా ఏరో స్పేస్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ కార్పొరేషన్ (సిఎటిసి) ప్రభుత్వ సంస్థ ఈ అంతరిక్ష నౌకకు ప్రధాన కాంట్రాక్టరుగా పనిచేస్తోంది. ప్రనపంచంలో అత్యధికమైన బరువుగల సామాగ్రిని తీసుకువెళ్ళగల శక్తిమంతమైన నౌకగా తియాన్‌జౌ–10 అంతరిక్ష నౌక పేరుగాంచింది. చైనా ఉష్ణమండల ద్వీపరాష్ట్రం హైనాన్‌లోని వెంచాంగ్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుండి సోమవారం ఉదయం 8.15 గంటలకు తియాన్‌జౌ–10 అంతరిక్ష కార్గో నౌకను లాంగ్‌మార్చ్–7వై 11 వాహకనౌక మోసుకువెళ్ళి నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఆ తర్వాత నౌక వెళ్ళి మధ్యాహ్నం 1.11 గంటల సమయానికి విజయవంతంగా చైనా అంతరిక్ష కేంద్రానికి వెనుకభాగంలో ఉన్న తియాన్‌హే కోర్ మాడ్యూల్ పోర్టుకు అనుసంధానమైంది. ప్రపంచంలో ప్రస్తుతం సొంతంగా ఎవరి సహాయం, ఉమ్మడి సహకారం లేకుండా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించుకున్న దేశం చైనా మాత్రమే. ఇంతకుముందు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని అనేక దేశాలు కలిసి ఉమ్మడిగా నిర్మించాయి. ప్రస్తుతం ఈ అంతరిక్ష కేంద్రం కాలంచెల్లే దశకు చేరబోతున్నది. ఈ దశలో చైనా సొంత అంతరిక్ష కేంద్రం కీలకపాత్ర పోషించనున్నది.

## 'చలో ఢిల్లీ'

(మొదటి పేజీ తరువాయి)

ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల్లో అక్రమ మార్గా న బిజెపి మూడు రాష్ట్రాల్లో విజయం సాధించిందని, సజావుగా, న్యా యబద్ధంగా ఎన్నికలను నిర్వహించడంలో విఫలమైందని విమర్శించా రు. తమిళనాడులో ప్రజాతీర్పును అపహాస్యం పాలు చేయడానికి గవర్నర్ చేసిన కుట్రను తిప్పికొట్టినట్లు తెలిపారు. బిజెపిని అడ్డుకోవడానికే టివికెకు సిపిఐ మద్దతునిచ్చిందని రాజా పేర్కొన్నారు. కేరళలో ఎల్‌డి ఎఫ్ పరాజయంపై సమీక్షిస్తామని చెప్పారు. పశ్చిమబెంగాల్‌లో భారీగా ఓట్లను తొలగించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కుల ను, ఎన్నికల చట్టబద్ధతను తుంగలో తొక్కిందన్నారు. ఇండియా ఐక్యసంఘటనలో సఖ్యత లోపించిన విషయాన్ని గుర్తించినట్లు రాజా తెలిపారు. వైఫల్యానికి కాంగ్రెస్ పార్టీ బాధ్యత వహించాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. సమితి సమావేశాల్లో చేసిన తీర్మానాలను రాజా వివరించారు.

**తీర్మానాల్లోని ముఖ్యాంశాలు**

కార్మిక వర్గ పోరాటాలకు సంఘీభావం: దేశంలోని పారిశ్రామిక కేంద్రాలైన నోయిడా, మానెసర్, సూరత్, భివాడి వంటి ప్రాంతాల్లో కార్మికులపై జరుగుతున్న దోపిడీని సమితి ఖండించింది. కనీస వేతనా ల అమలు, సామాజిక భద్రత, నియన్ హక్కుల కోసం పోరాడుతున్న కార్మికులపై పోలీసుల అణచివేతను తీవ్రంగా తప్పుబట్టింది. కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు పారిశ్రామిక శాంతికి విఘాతమని, అరెస్టయిన కార్మికులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

**తమిళనాడులో ఒకే సంస్కృతి రుద్దుడుపై విమర్శ**

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకార వేడుకలో 'తమిళ తాయి వళుత్తు' పాడటానికి ముందు వందేమాతరం ఆలపించడాన్ని సిపిఐ తప్పుబట్టింది. ఇది దేశ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని, ఆర్‌ఎస్ఎస్ బిజెపి కూటమి బలవంతంగా ఒకే సంస్కృతిని రుద్దే ప్రయత్నం చేస్తోందని విమర్శించింది. గవర్నర్ పాత్రను ఎండగడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి విభజన శక్తులను అడ్డుకోవాలని సూచించింది.

**మహాత్మా జ్యోతిబా ఫూలే ద్విశతాబ్ది ఉత్సవాలు**

2026 ఏప్రిల్ 11 నుండి 2027 ఏప్రిల్ 11 వరకు మహాత్మా జ్యోతిబా ఫూలే 200వ జయంతి ఉత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. కుల వివక్ష, పితృస్వామ్యంపై ఫూలే దంపతులు చేసిన పోరాటం అజరామరమని, సామాజిక సమానత్వం లేనిదే సోషలిజం సాధ్యం కాదని తీర్మానించింది.

**మహిళా రిజర్వేషన్లపై జాప్యం**

మహిళా రిజర్వేషన్ బిల్లు (నారీ శక్తి వందన్ అధినియం) అమలును జనాభా గణన, నియోజక వర్గాల పునర్విభజనతో ముడిపెట్టడాన్ని సిపిఐ ఖండించింది. ఇది మహిళలకు ప్రాతినిధ్యాన్ని నిరాకరించే కుట్ర అని, గీతా ముఖర్జీ వంటి నేతల పోరాట ఫలితమైన ఈ బిల్లును తక్షణమే టువంటి నిబంధనలు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేసింది.

**ఎరువుల కొరత రైతు సమస్యలు**

2026 ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరత, బ్లాక్ మార్కెటింగ్ వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కేంద్రంపై విరుచుకుపడింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం సీ2+50% ఫార్ములాతో కనీస మద్దతు ధరకు (ఎంఎస్‌పి) చట్టబద్ధత కల్పించాలని పార్టీ డిమాండ్ చేసింది.

ఈ సమితి సమావేశాల్లో సిపిఐ భవిష్యత్ రాజకీయ కార్యాచరణను రూపొందించి, ఏకగ్రీవంగా ఆమోదించిందని డి.రాజా వెల్లడించారు.

**ఆగస్టు 6 నుండి పాదయాత్రలు**

బిజెపి ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను ఎండగట్టేందుకు ఆగస్టు 6 నుండి 15 వరకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో, జిల్లాల్లో పాదయాత్రలు చేపట్టాలని సిపిఐ నిర్ణయించింది. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రాజ్యాంగ విలువలపై దాడులను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ పాదయాత్రలు జరుగుతాయి.

**చలో ఢిల్లీ**

ఈ నిరసన కార్యక్రమాలు సెప్టెంబర్ 28న (షహీద్ భగత్ సింగ్ జయంతి) ఢిల్లీలో భారీ బహిరంగ సభతో ముగుస్తాయి. కార్మికులు, రైతులు, మహిళలు, యువత, దళిత, ఆదివాసీ మైనారిటీ వర్గాలు ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని సిపిఐ జాతీయ కౌన్సిల్ పిలుపునిచ్చింది.

## తక్షణమే మొదలుపెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

కూకట్‌పల్లి డిసిపి రితిరాజ్‌కు అప్పగించారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీసు కమిషనర్ రమేష్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

''పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ప్రకారం 17 ఏళ్ల బాలికపై మోసం, మానసిక వేధింపులు, లైంగిక వేధింపులు చేసినట్లు భగీరత్‌పై ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలైన బాలికతో పూర్తి వివరాలు సేకరించాను.

బాలిక వ్యక్తిగత ఫోటోలు, సమాచారం ఇతరులకు పంపిస్తూ పరువు తీసేలా వ్యవహరించాడని, దీంతో బాలిక తీవ్ర మానసిక వేదనకు గురై పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి కూడా పాల్పడినట్లు ఫిర్యాదులో బాధితురాలి తల్లి వెల్లడించింది. అందుకు సంబంధించిన వివరాలు కూడా సేకరించాం. మరోవైపు బాలిక తనను హనీట్రాప్ చేసి బ్లాక్‌మెయిల్ చేస్తుందని భగీరత్ కరీంనగర్ టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో బాధితురాలి కుటుంబ సభ్యులపై కేసు పెట్టారు.

పేట్‌బషీరాబాద్‌లో నమోదైన కేసు, కరీంనగర్ టూ టౌన్‌లో నేమోదైన కేసుపై సమగ్రంగా దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకుంటాం'' అని డిసిపి రితిరాజ్ 'ప్రజాపక్షం'కు వెల్లడించారు.

## విధానాలు బట్టబయలు

(మొదటి పేజీ తరువాయి)

విధిస్తే లక్షల కోట్ల నిధులు సమకూరుతాయని సాంబశివరావు ఒక ప్రకటనలో సూచించారు. తెలంగాణలో వచ్చేది బిజెపి ప్రభుత్వమేనని చేసిన ప్రకటన కలగానే మిగిలపోవడం ఖాయమని, మతరాజకీయాలను ప్రగతిశీల తెలంగాణ నేల ఎన్నటికీ అనుమతించదని సాంబశివరావు స్పష్టం చేశారు. ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టంలోని కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, నియోజకవర్గాల పెంపు, ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి హామీలను 12 ఏళ్ళైనా నెరవేర్చని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిని తెలంగాణ ప్రజలు ముమ్మాటికీ విశ్వసించబోరన్నారు. మావోయిస్టులను అంతమొందించటమే పరిష్కారమన్నట్లుగా ప్రధాని మాట్లాడడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందని సాంబశివరావు తెలిపారు.

## మళ్లీ భానుడు భగభగ

(మొదటి పేజీ తరువాయి)

అదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, కొమురం భీమ్, మంచిర్యాల, నిర్మల్ , నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో నెల 14 వరకు 44 డిగ్రీల వరకు నమోదు కానున్నాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈనెల 15వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉన్నప్పటికీ, వేడి నుంచి పెద్దగా ఉపశమనం ఉండకపోవచ్చని వాతావరణ కేంద్రం తెలిపింది. 18 వతేదీ నుంచి 47 డిగ్రీలకు చేరే అవకాశం : రాష్ట్రంలో పలు జిల్లాలో ఈనెల 18వ తేదీ తర్వాత పగటి ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలకు చేరే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. ముఖ్యంగా ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు 5 రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదుకానున్నాయని తెలియజేసింది. వీటికి తోడు 10 రోజుల పాటు వడగాలులు కూడా వీచే అవకాశం ఉందని తెలిపింది. అత్యవసరముంటే తప్ప ప్రజలు మధ్యాహ్నం వేళ బయటకు రావద్దని సూచించారు.

వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని వాతావరణ కేంద్రం సూచించింది.

# బిజెపికి మళ్లీ రెండు సీట్లే...

(మొదటి పేజీ తరువాయి)

బ్రిటీషువాళ్ళ మాదిరిగానే బిజెపి విభజించి పరిపాలిస్తోందని మండిపడ్డారు. దేశ అభివృద్ధిలో అనేక మంది ముస్లింలు భాగస్వాములయ్యారని, అబ్దుల్ కలాం, జాకీర్ హుస్సేన్ వంటి రాష్ట్రపతులు ఉన్నారని గుర్తుచేశారు. అయినా ముస్లింలు, మావోయిస్టులు ఈ దేశ ప్రజలు కాదా? వారికి అందరి లాగే హక్కు లు లేవా? అని ప్రశ్నించారు. అన్ని జాతులు,కులాలు, మతాల కలయికే భారతదేశమని, ఇక్కడ అందరికీ సమాన హక్కు ఉంటుందని చెప్పారు. ప్రధానమంత్రి ఆ విధంగా తెలంగాణ గడ్డపై విభజించి మాట్లాడడం దురదృష్టకరమన్నారు. మావోయిస్టులు, కమ్యూనిస్టులకు ఒక సిద్ధాంతం ఉందని, వాటిని అంటరానివిగా ఎలా చూస్తారని ప్రధాని నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. వాళ్ళ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఖతం చేయటం బిజెపి విధానమని, కాదన్న వాళ్ళను కూడా ఒప్పించి జనజీవన స్రవంతిలోకి తీసుకురావటం కాంగ్రెస్ సిద్ధాంతమని చెప్పారు.

**కాల్చి చంపడం మీ సిద్ధాంతం.. ఒప్పించడం మా సిద్ధాంతం**

తెలంగాణ ప్రభుత్వం సహకరించలేదని, పోలీసులకు స్వేచ్ఛ ఇవ్వనందునే మావోయిస్టులను ఏరివేయటం ఆలస్యమైందన్న మోదీ వ్యాఖ్యలపై సిఎం ప్రతిస్పందించారు. స్వేచ్ఛ ఇవ్వడమంటే మావోయిస్టులను కాల్చి చంపడమేనా? ప్రాణాంటే మీ పార్టీకి విలువ లేదేమో కాని, దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వంటి నాయకులు ఉన్న తమ పార్టీ ప్రాణాలకు విలువ ఇస్తుందన్నారు. నక్సల్స్, కమ్యూనిస్టులు పోరాడిన అంశాలపై తాము చట్టాలు తీసుకు వచ్చామని, అందుకే నక్సల్స్ తగ్గిపోయారని అన్నారు. మావోయిస్టులను ఒప్పించి ఆయుధాలతో సహా అత్యధిక మందిని జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చిన రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. 2026లో 86 మంది అరెస్టయ్యారని, 48 మంది లొంగిపోయారని, 2025లో 44 మంది అరెస్టు, 590 సరెండర్‌లు, 2026లో ఇప్పటి వరకు ఐదుగురు అరెస్టు, 260 మంది సరెండర్ అయ్యారని, నలుగురు చనిపోయారని తెలిపారు. ఇప్పటి వరకు 880 మంది లొంగిపోయారని, వారు 326 ఆయుధాలు అప్పగిస్తే, అందులో 58 ఎకె–47లు ఉన్నట్లు తెలిపారు. చంపకుండా ఇంత మందిని జనంలోకి తీసుకువచ్చినందుకు తెలంగాణ పోలీసులు అభినందనీయులు అని అన్నారు. తాము ఒప్పించడంతో దేశ్ జీ, మల్లోజుల, తదితర బడా నేతలు జనజీవనస్రవంతిలోకి వచ్చారన్నారు. తెలంగాణలో 99 శాతం మావోయిస్టులు జనజీవనంలోకి వచ్చేశారని, ఒక్క శాతంలోపే మిగిలారని, ఇప్పటికీ కూడా గణపతికి జనజీవనస్రవంతిలోకి రావాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు సిఎం చెప్పారు. మావోయిస్టులను చంపడమే పరిష్కారమని కేంద్రం అనుకుంటుందని, తాము మాత్రం సంప్రదింపులే పరిష్కారం అనుకుంటున్నామని చెప్పారు. నక్సలైట్‌లు కూడా ఒక వ్యవస్థ నుంచి వచ్చారే తప్ప వాళ్లేమి గ్రహాంతరవాసులు కాదనానరు. తాము ఎన్‌కౌంటర్‌లు చేయకుండా జనంలోకి వచ్చేలా చూసామని, అరెస్టయిన వారికి చట్ట ప్రకారమే శిక్షలు ఉంటాయని స్పష్టం చేశారు.

హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఎపి సిఎం చంద్రబాబు నాయుడు(టిడిపి), డిప్యూటీ సిఎం పవన్ కల్యాన్ (జనసేనా) ఇళ్ళకు వెళ్లటం, హెటిరో అధినేత పార్థసారధిరెడ్డి (బిఆర్ఎస్ ఎంపి) ఆసుపత్రిని ప్రారంభించటంపై ప్రశ్నించగా, అవన్నీ ప్రైవేటు కార్యక్రమాలని, అయినా వారు ఎవరు,ఎవరినైనా ప్రేమించుకోవచ్చని, దాని తమ అనుమతి అక్కర్లేదని అన్నా రు.

**ప్రధాని వ్యాఖ్యల్లో రాజకీయాలకు తావు లేదు**

తనతో కలిసి వస్తే అనుకున్నది నెరవేరుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తనను ఉద్దేశించి చేసిన వ్యాఖ్య అభివృద్ధికి సంబంధించే తప్ప అందులో ఎలాంటి రాజకీయాలకు తావు లేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా జరిగిన అధికారిక కార్యక్రమంలో తాను ప్రధానిని రాష్ట్రం 2030 నాటికి ఒక ట్రిలియన్, 2047 నాటికి మూడు ట్రిలియన్‌ల ఆర్థిక వ్యవస్థ అవ్వాలనే తెలంగాణ విజన్ 2047కు సహకరించాలని కోరానని తెలిపారు. అందుకు తమ వద్ద అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నాయని, వాటిని వివరించేందుకు రెండు గంటల సమయం ఇస్తే పిపిటి ద్వారా తెలియజేస్తానని చెప్పానని అన్నారు. దానికి ప్రతిస్పందనగానే ప్రధాని ఆ వ్యాఖ్యలు చేశారని, తాను అభివృద్ధి గురించి ప్రస్తావించానని, ఆయన కూడా అభివృద్ధి గురించే అన్నారని చెప్పారు. నాతో కలిసి వస్తే అనుకున్నది నెరవేరుతుందని, ప్రధాని కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి అని, తాను రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధినని, కేంద్రం సహకరిస్తేనే మూడు ట్రిలియన్‌ల ఎకానమీ సాధ్యమవుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. అందుకు తాను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. రెండేళ్ళుగా కేంద్ర ప్రభుత్వ సహకారం ఉండీ లేనట్లుగా ఉందని, అలాగని లేదని చెప్పలేనని, మనం ఆశించిన స్థాయిలో మాత్రం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధి విషయంలో ప్రధానికి ఉన్నంత వేగం ఇతర కేంద్ర మంత్రులకు లేదని, అనేక మార్లు ఢిల్లీకి వెళ్ళి వినతిపత్రాలు ఇచ్చినా పెద్దగా స్పందన లేదన్నారు.,మోదీ సిఎంగా ఉన్నప్పుడు గుజారత్‌కు నాటి ప్రధాని మన్మోహన్ నిధులిచ్చి అభివృద్ధికి సహకరించారని, అలాగే తమకు సహకరించాలని కోరానని, అందుకు ప్రధాని మోదీ స్పందిస్తూ ఆయన ఇచ్చినట్లే ఇస్తే, ఇప్పుడిచ్చిన మొత్తంలో సగమే అవుతుందని చెప్పారని గుర్తు చేశారు. అయితే అప్పుడు ఆ మొత్తానికి ఉన్న విలువతో చూస్తే సగమేనని, అయితే నాడు డాలర్‌తో రూపాయి విలువ, బంగారు విలువ, నేటి విలువకు ఎంత తేడా ఉందో అందరికీ తెలుసని అన్నారు.

**బండి కేసులో చట్ట ప్రకారం చర్యలు**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైందన్నారు. ప్రధాని పర్యటన భద్రతా ఏర్పాట్ల వల్ల, సుమారు పదివేల మంది పోలీసులు అందులో నిమగ్నం కావడంతో దర్యాప్తు ఆలస్యమైందని, ప్రస్తుతం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు. ఈ కేసు దర్యాప్తునకు మహిళా ఐపిఎస్ అధికారిని నియమించాలని ఆదేశించినట్లు తెలిపారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్ట ం చేశారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, ఎవరినీ వదిలిపెట్టబోమని వెల్లడించారు. అంతకు ముందు రోజే బండి భగీరథ సైతం ఆ అమ్మాయిపై కరీంనగర్‌లో కేసు పెట్టారని, ఇద్దరు కూడా బాధితులుగా కేసులు పెట్టారని, సున్నితమైన అంశమని ఇందులో చట్టం ప్రకారమే నడుచుకుంటామన్నారు. అన్ని అంశాలు తెలిసిన బీఆర్ఎస్ నాయకుడు మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. ఆయన వద్ద ఏవైనా ఆధారాలు ఉంటే సైబరాబాద్ పోలీసు కమిషనర్‌కు ఇవ్వాలని సూచించారు.గతంలో తన టెలిఫోన్ ట్యాపింగ్ జరిగిందన్న ప్రవీణ్‌కుమార్, దానిపై సిట్ విచారణ తరువాత పూర్తిభిన్నంగా మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు.

మావోయిస్టుల సమస్యపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బుల్లెట్ కాదు బ్యాలెట్ అనే విధానంతో ముందుకెళ్లామని, అందుకే 818 మంది మావోయిస్టులు ఇప్పటి వరకు తెలంగాణలో లొంగిపోయారని చెప్పారు. దేశంలో ఎక్కడా ఇంత పెద్ద సంఖ్యలో లొంగుబాటు జరగలేదని వివరించారు. మావోయిస్టులను జన జీవన స్రవంతిలోకి తీసుకురావడాన్ని తెలంగాణ ప్రభుత్వం విజయంగా భావిస్తోందన్న సీఎం మావోయిస్టు అగ్రనేత గణపతి వంటి నాయకులు కూడా లొంగిపోతే వైద్య సహాయం, ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. మనుషుల ప్రాణాలకు విలువ ఇవ్వడమే కాంగ్రెస్ సిద్ధాంతమని, హింసతో సమస్యలు పరిష్కారం కావని ఆయన స్పష్టం చేశా రు.

**మోదీ వ్యాఖ్యలు విదేశాంగ విధాన వైఫల్యానికి నిదర్శనం**

బంగారం కొనొద్దు, విమానాల్లో ప్రయాణం చేయొద్దని ప్రజలకు పిలుపునివ్వడం మోదీ ప్రభుత్వ విదేశాంగ విధాన వైఫల్యానికి నిదర్శనమని సిఎం అన్నారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించి, అందరి అభిప్రాయాలు తీసుకొని స్పష్టమైన విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనుభవ రాహిత్యం, అహంకారం వల్లే దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని విమర్శించారు. జెమిని సర్కస్‌లాగా బిజెపి ఎన్నికల వ్యూహం ఉంటుందని విమర్శించారు. తుమ్మిడిహట్టి గురించి అపాయింట్‌మెంట్ కోరుతూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాసానని, ఇంకా స్పందన రాలేదని రేవంత్‌రెడ్డి తెలిపారు. రెండు రాష్ట్రాల సమస్యల పరిష్కారంలో ప్రధాని పెద్దమనసుతో వ్యవహరించాలని కోరుతూ లేఖ రాసినట్లు చెప్పారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా జోక్యం చేసుకోవాలన్నారు. కాళేశ్వరంపై దర్యాప్తునకు సిబిఐ డైరెక్టర్‌కు కూడా అపాయింట్‌మెంట్ కోసం లేఖ రాసామన్నారు. అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఈ సారి ఎక్కువ పంట వచ్చినందునే కొంత జాప్యం జరుగుతోందన్నారు. పంట మార్పిడిపై రైతుల్లో అవగాహన కల్పిస్తామని, క్షేత్రస్థాయిలో జిల్లాల వారీగా చర్చిస్తామని, తాను కూడా పార్లమెంటు నియోజవర్గం వారీగా సభలు పెట్టి విస్తృత చర్చలు నిర్వహిస్తామని అందరి అభిప్రాయాలతో ముందుకు వెళ్తామని తెలిపారు.

# చెపాక్‌లో ఉర్విల్ ఊచకోత..

## ఎనిమిదో ఓటమితో లక్నో ఔట్..!



లీగ్ దశ ఆఖర్లో గొప్పగా ఆడుతున్న సొంతగడ్డపై చెన్నై సూపర్ కింగ్స్ భారీ లక్ష్యాన్ని ఉఫ్‌మనిపించింది. చెపాక్‌లో ఉర్విల్ పటేల్(65) రికార్డు అర్ధ శతకంతో మెరవగా.. లక్నో సూపర్ జెయింట్స్‌పై సిఎస్కే 5 వికెట్లతో జయభేరి మోగించింది. 204 పరుగుల ఛేదనలో లక్నో బౌలర్ల భరతం పట్టిన ఉర్విల్.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(42)తో గెలుపు తోవలో నడిపాడు. కానీ.. మిడిల్ ఓవర్లలో షాదాబ్, దిగ్వేశ్ రథీల విజృంభణతో మ్యాచ్ లక్నోవైపు మళ్లింది. కానీ, డెత్ ఓవర్లలో ఇంప్యాక్ట్ సబ్ ప్రశాంత్ వీర్(18 నాటౌట్), శివం దూబే(15 నాటౌట్)లు కళ్లుచెదిరే సిక్సర్లతో లక్నో ఆశల్ని ఆడియాసలు చేశారు. పసుపు జెర్సీలతో నిండిపోయిన చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ విజయ గర్జన చేసింది. బౌలర్లు ప్రత్యర్థికి భారీ స్కోర్ సమర్పించిన చోట.. కుర్రాడు ఉర్విల్ పటేల్(65 : 23 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా విరుచుకుపడగా లక్నో బౌలర్లు బెంబేలెత్తిపోయారు. ఆఖర్లో ఉత్కంఠ నెలకొన్నప్పటికీ.. డెత్ ఓవర్లలో ఇంప్యాక్ట్ సబ్ ప్రశాంత్ వీర్(18 నాటౌట్), శివం దూబే(15 నాటౌట్)లు ఒత్తిడికి లోన్వకుండా చెన్నైకి 5 వికెట్ల విజయాన్ని కట్టబెట్టారు. ఆరో విక్టరీతో 12 పాయింట్లు సాధించిన చెన్నై.. టాప్5లో నిలిచింది. 11 మ్యాచుల్లో ఎనిమిదింటా ఓడిన లక్నో ప్లే ఆఫ్స్ రేసు నుంచి వైదొలిగింది. లక్నో నిర్దేశించిన భారీ ఛేదనను ఓపెనర్ శాంసన్(28)ను ధాటిగా ఆరంభించాడు. బౌండరీలో చెలరేగిన సంజూను దిగ్వేశ్ రథీ బౌల్డ్ చేసి తొలి వికెట్ అందించాడు. అవేశ్ ఖాన్‌ను వణికించిన ఉర్విల్ పటేల్(65) చివరి మూడు బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపగా 5 ఓవర్లకే చెన్నై స్కోర్ డెబ్బై దాటింది. ఆ తర్వాతి ఓవర్లో దిగ్వేష్‌ను వదలని ఉర్విల్.. మూడు సిక్సర్లు, ఒక ఫోర్‌తో స్టేడియాన్ని హోరెత్తించాడు. వరసగా రెండు ఓవర్లలో 25 చొప్పున రన్స్ రావడంతో పవర్ ప్లేలో సిఎస్కే వికెట్ నష్టానికి 97 పరుగులు చేసింది. పవర్ ప్లే తర్వాత సింగిల్‌తో 13 బంతుల్లోనే ఉర్విల్ అర్ధ శతకంతో రికార్డు నెలకొల్పాడు. ఆదే ఊపులో.. ఆడిన అతడు.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ(42)తో చెన్నైని గెలుపు దిశగా నడిపాడు. షాదాబ్ ఓవర్లో అవేశ్ చేతికి చిక్కడంతో ఉర్విల్ తుఫాన్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. అప్పటికే సగం లక్ష్యం కరిగిపోవడంతో చెన్నైకి భారీ విజయం పక్కా అనిపించింది. కానీ, షాదాబ్ ఓవర్లో గైక్వాడ బౌల్డవ్వగా.. బ్రెవిస్(10)ను రథీ బౌల్డ్ చేశాడు. ఫామ్‌లో ఉన్న కార్తిక్ శర్మ(20)ను అవేశ్ పెవిలియన్ పంపడంతో ఇంప్యాక్ట్ సబ్‌గా ప్రశాంత్ వీర్(18 నాటౌట్) వచ్చాడు. 18 బంతుల్లో 30 రన్స్ అవసరమవ్వగా.. ప్రిన్స్ 9 రన్సే ఇవ్వడంతో ఉత్కంఠ మొదలైంది. రథీ, పూరన్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన ప్రశాంత్ రెండు సిక్సర్లతో మెరవగా.. మర్క్‌రమ్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో శివం దూబే(15 నాటౌట్) తొలి రెండు బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపాడు. దాంతో 5 వికెట్లతో గెలుపొందిన సీఎస్కే 12 పాయింట్లతో ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది. పంతొమ్మిదో సీజన్‌లో ప్లే ఆఫ్స్ రేసులో లేని లక్నో సూపర్ జెయింట్స్ భారీ స్కోర్ కొట్టింది. ఓపెనర్ జోష్ ఇంగ్లిస్(85) అర్ధ శతకంతో భారీ స్కోర్‌కు పునాది వేశాడు. కానీ, ఓవర్టన్(336), అన్షుల్ కంబోజ్(247)లు వికెట్ల వేటతో మిడిలార్డర్‌కు బ్రేకులు వేశారు. షాదాబ్ అహ్మద్(43 నాటౌట్), హిమ్మత్ సింగ్(17) డెత్ ఓవర్లలో ధనాధన్ ఆడి స్కోర్ రెండొందలు దాటించారు. ఒకదశలో 230 ప్లస్ కొట్టేలా కనిపించినా చివరకు వీరిద్దరి కృషి ఫలితంగా లక్నో 203కు పరిమితమైంది.

# దీపిక బృందానికి పసిడి

## ఫైనల్లో చైనాను చిత్తుచేసిన భారత రికర్వ్ జట్టు



**షాంఘై:** ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్2 టోర్నీలో భారత మహిళల రికర్వ్ జట్టు మరోసారి సంచలన ప్రదర్శనతో అదరగొట్టింది. వెటరన్ ఆర్చర్ దీపిక కుమారి నేతృత్వంలోని అంకితా భకత్, కుంకుమ్ మొహోద్‌తో కూడిన భారత బృందం.. ఫైనల్లో 5—4తో టైటిల్ ఫేవరెట్లుగా ఉన్న చైనాను ఓడించి స్వర్ణం గెలుచుకుంది. నాలుగు సెట్లలో ఇరుజట్ల స్కోర్లు 4—4తో సమమవగా షూటాఫ్ ద్వారా తేలిన ఫలితంలో భారత ఆర్చర్లు ఏకాగ్రత కోల్పోకుండా పసిడిని గురిచూసి కొట్టారు. తొలి సెట్లో 54—53 (2 సెట్ పాయింట్లు)తో ఆధిక్యంలో నిలిచిన భారత అమ్మాయిలు.. తర్వాత రెండు సెట్లలో (52—55, 56—57 (చైనాకు 4 సెట్పాయింట్లు))తో వెనుకబడ్డారు. కానీ ఆఖరి సెట్లో 5453తో భారత్ ఖాతాలో మరో రెండు సెట్ పాయింట్లు చేరడంతో షూటాఫ్ అనివార్యమైంది. షూటాఫ్లో దీపిక బృందం.. 28 పాయింట్లు స్కోరు చేయగా చైనా 26 మాత్రమే కొట్టగలిగింది. భారత రికర్వ్ మహిళల జట్టుకు మూడేండ్ల తర్వాత ఇదే తొలి పతకం. దీపికకు మాత్రం ప్రపంచకప్లలో ఇది ఏకంగా 12వ మెడల్. ఈ టోర్నీలో రికర్వ్ జట్టు ఏడు పతకాలు గెలువగా ఆ ఏడింటిలోనూ దీపిక ఉండటం గమనార్హం.

# షాట్ గన్ వరల్డ్ కప్‌లో నీరూ, వివాన్ జోడీకి కాంస్యం



**ఢిల్లీ:** కజకిస్థాన్లోని అల్మటి వేదికగా జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ షాట్ గన్ వరల్డ్ కప్‌లో భాగంగా ట్రాప్ మిక్సడ్ టీమ్ ఈవెంట్లో భారత షూటర్లు నీరూ దండ, వివాన్ కపూర్ జోడీ కాంస్యం గెలుచుకుంది. 30 టార్గెట్లకుగాను 24 పాయింట్లు గురిపెట్టిన భారత జంట మూడో స్థానంతో కాంస్యం నెగ్గగా చైనీస్ తైపీ, ఇటలీ వరుసగా పసిడి, రజతం గెలిచాయి.

# యువతరంగం


## స్క్రీన్ టైమ్‌కు దూరంగా

# డిస్‌కనెక్ట్..రీకనెక్ట్..




ప్రస్తుత డిజిటల్ యుగంలో మనం నిరంతర అనుసంధానంలో జీవిస్తున్నాం. ఫోన్ నోటిఫికేషన్లు, సోషల్ మీడియా అప్‌డేట్లు, ఈమెయిల్లు, నిరంతర స్క్రోలింగ్ తదితరాలన్నీ ఇవన్నీ మన దృష్టిని విభజించి, మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో డిస్కనెక్ట్ టు రికనెక్ట్ అనే భావన ప్రాముఖ్యతను సంతరించుకుంది. అంటే, ప్రతిరోజూ కనీసం రెండు సార్లు డిజిటల్ డిటాక్స్ విరామాలు తీసుకోవాలి. ఆ సమయంలో ఫోన్, స్క్రీన్, నోటిఫికేషన్లు లేకుండా ప్రశాంతంగా ఉండాలి. ఒత్తిడిని తగ్గించడానికి మెదడుకు విశ్రాంతి అవసరం. కేవలం 10 నిమిషాల డిజిటల్ విరామం కార్టిసోల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. దీనివల్ల ఏకాగ్రత మెరుగుపడుతుంది. భావోద్వేగ సమతుల్యత పెరుగుతుంది. మానసిక ఆరోగ్య పరిరక్షణలో ఇది ఒక సరళమైన కానీ ప్రభావవంతమైన పద్ధతి. స్క్రీన్ టైమ్ తగ్గించడం వల్ల నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది. ముఖ్యంగా రాత్రి పడుకునే ముందు స్క్రీన్ ఉపయోగం తగ్గిస్తే మెలటోనిన్ ఉత్పత్తి సక్రమంగా జరుగుతుంది. దీని ఫలితంగా నిద్రలేమి, మానసిక అలసట, చిరాకు వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే నిరాశ, ఒత్తిడి, ఆందోళన లక్షణాలు నియంత్రణలో ఉంటాయి. డిజిటల్ డిటాక్స్ సమయంలో ప్రకృతిలో నడక, కుటుంబ సభ్యులతో సంభాషణ, స్నేహితులతో సమయం గడపడం లేదా హాబీల్లో పాల్గొనడం మంచిది. ఇవి మెదడుకు సహజ ఉత్తేజాన్ని ఇస్తాయి. ప్రతిరోజూ ఒక నిర్ణీత సమయాన్ని డిజిటల్ పరికరాల నుండి దూరంగా ఉంచాలి. ఉదయం లేవగానే, రాత్రి పడుకునే ముందు కనీసం 10—15 నిమిషాలు స్క్రీన్‌లను పూర్తిగా పక్కన పెట్టాలి. ఆ సమయంలో ధ్యానం, ప్రాణాయామం, పుస్తక చదువు లేదా సాదాసీదా నిశ్శబ్దంలో కూర్చోవడం చేయవచ్చు. ఈ అలవాటును పిల్లలకు నేర్పించడం అవసరం. చిన్నవయస్సులోనే ఆరోగ్యకరమైన డిజిటల్ వినియోగపు అలవాట్లు పెంపొందితే, వారు సమతుల్యమైన మానసికస్థితిని సాధించగలరు. మొత్తంగా, డిజిటల్ డిటాక్స్ అనేది ఒత్తిడిని తగ్గించి, జీవితం యొక్క నిజమైన అనుభూతిని ఆస్వాదించేందుకు ఉపకరిస్తుంది.

## కృతజ్ఞతా భావం.. ఓ శక్తివంతమైన సాధనం



మనిషి జీవితంలో ఒత్తిడి అనివార్యం. పనిభారం, సంబంధాల సంక్లిష్టత, ఆర్థిక ఆందోళనలు, ఆరోగ్య సమస్యలు... ఇలా ఎన్నో అంశాలు మనసుపై ప్రభావం చూపుతాయి. అయితే ఇటువంటి సందర్భాల్లో ధన్యవాద భావన లేదా కృతజ్ఞత భావం ఒక శక్తివంతమైన మానసిక సాధనంగా పనిచేస్తుందని అనేక శాస్త్రీయ పరిశోధనలు సూచిస్తున్నాయి. కృతజ్ఞత అనేది కేవలం ఒక నైతిక గుణంగానే చాలా మంది భావిస్తారు. కానీ, నిజానికి అది మన నాడీవ్యవస్థ, భావోద్వేగ స్థితి, శరీర ఆరోగ్యంపై కొలిచదగిన ప్రభావాన్ని చూపే మానసిక ప్రక్రియ. ఒత్తిడిలో ఉన్నప్పుడు మనసు సాధారణంగా సమస్యలపైనే కేంద్రీకృతమవుతుంది. దీనిని 'రూమినేషన్' అంటారు. అంటే ఒకే ఆలోచనను మళ్లీ మళ్లీ తిరగదిద్దుకోవడం. ఈ స్థితిలో కార్టిసోల్ వంటి ఒత్తిడి హార్మోన్‌లు అధికమవుతాయి. కానీ ప్రతిరోజూ కృతజ్ఞతను చైతన్యపూర్వకంగా అభ్యసిస్తే ఒత్తిడిని పెంచే హార్మోన్‌ల స్థాయి గణనీయంగా తగ్గుతుందని పరిశోధనల్లో వెల్లడైంది. సుమారు 20—25 శాతం వరకు ఒత్తిడి సూచికలు తగ్గినట్లు అధ్యయనాలు చూపించాయి. ఇది యాదృచ్ఛికం కాదు... కృతజ్ఞత మన దృష్టిని లోపాల నుంచి లభ్యమైన వనరులపైకి మళ్లిస్తుంది. ఒత్తిడి ఎక్కువగా అనిపించినప్పుడు ఒక చిన్న వ్యాయామం చేయవచ్చు. ప్రశాంతంగా కూర్చొని, ఈ క్షణంలో ఇంకా ఏవి సరిగ్గా ఉన్నాయి? అని మనసులో ప్రశ్నించాలి. ఆహారం, ఆరోగ్యం, కుటుంబ మద్దతు, ఒక స్నేహితుడి సందేశం, లేదా నిశ్శబ్దమైన ఉదయం.. ఇలా, ఏ చిన్న అంశమైనా సరే, దానిని గుర్తించాలి. ఈ ప్రక్రియ మన దృష్టిని గతపు ఆందోళనల నుంచి ప్రస్తుతానికి తీసుకువస్తుంది. మెదడు ప్రమాద సంకేతాలపై కాక, సానుకూల సంకేతాలపై స్పందించడం ప్రారంభిస్తుంది. కృతజ్ఞత శారీరక ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుంది.

## మానసిక ఆరోగ్యానికి సహాయక వ్యవస్థ ఊతం..



మానసిక ఆరోగ్యం స్థిరంగా ఉండటానికి సహాయ వ్యవస్థ ప్రాముఖ్యత కలిగిన అంశం. ఎంత దృఢమైన వ్యక్తి అయినా ప్రతి సమస్యను పూర్తిగాఒంటరిగా ఎదుర్కోవడం సాధ్యం కాదు. మరోవైపు, జీవితం అనిశ్చితులతో నిండి ఉంటుంది. ఎన్నో భావోద్వేగ ఒత్తిడులు.. నిరాశ, భయం, ఆందోళన పరిస్థితులు... ఉపద్రం ఏదైనా, ఎప్పుడైనా, ఎటు నుంచైనా రావచ్చు. అటువంటి సమయంలో సహాయం కోరడం బలహీనతగా భావించకూడదు. భావోద్వేగాలు అధికమయ్యే సమయంలో, మనం ఎప్పుడు సహాయం కోరాలో తెలుసుకోవడం. శాంతంగా ఉండే వ్యక్తులు తమ పరిమితులను గుర్తిస్తారు. అవసరమైతే నమ్మకమైన వ్యక్తులను సంప్రదిస్తారు. ఇక్కడ అందుకున్న సర్కిల్ అనే భావన ముఖ్యమైనది. మనం గౌరవించే, నమ్మకం కలిగిన మిత్రులు లేదా కుటుంబసభ్యులు మనకు రియాలిటీ చెక్ ఇవ్వగలరు. భావోద్వేగాలు తీవ్రంగా ఉన్నప్పుడు మన నిర్ణయాలు వక్రీకరించే అవకాశం ఉంది. అప్పుడు ఒక నమ్మకమైన వ్యక్తి సమతుల్య దృష్టికోణం అందించగలడు. ఇది తప్పు నిర్ణయాలను నివారించడంలో సహాయపడుతుంది. ప్రయోగాత్మకంగా, ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత ప్రశాంత వాతావరణాన్ని, పరిస్థితులను, పరికరాలను ఉంచుకోవాలి. మరీ ముఖ్యంగా కొంత మంది మనుషులను ఎంపిక చేసుకోవాలి. అంటే మనసు అస్థిరంగా ఉన్నప్పుడు ఫోన్ చేయగలిగే లేదా సందేశం పంపగలిగే ముగ్గురు నమ్మకమైన వ్యక్తులను గుర్తించాలి. వీరు కుటుంబ సభ్యులు, సన్నిహిత మిత్రులు లేదా మార్గదర్శకులు కావచ్చు. ఈ చిన్న గుంపు మనలో ఒంటరితనాన్ని తగ్గిస్తుంది, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది, సరైన సలహా అందిస్తుంది. సహాయ వ్యవస్థల వల్ల నిరాశ, ఒంటరితనం వంటి భావాలు తగ్గుతాయి. పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనే కొత్త నైపుణ్యాలు నేర్చుకునే అవకాశం ఉంటుంది. మనిషి మనిషికే సాయం అనే సామెతలో ఉన్న భావం ఇదే. బలమైన వ్యక్తికీ సహాయం అవసరమే. కాబట్టి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలంటే, నమ్మకమైన ముగ్గురు వ్యక్తులతో కూడిన కొంత మందిని ఎంపిక చేసుకోవాలి. 'మనసున మనసై..బతుకున బతుకై..తోడొకరుండిన అదే భాగ్యము' అన్న శ్రీశ్రీ పాటను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవడం అవసరం.

## శ్రమదోపిడీకి గురవుతున్న విఓఎలు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం /ఆసిఫాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం విఓఎలను శ్రమ దోపిడీకి గురి చేస్తోందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్‌లో విఓఎల జెఎసి ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ హరిత, ఎమ్మెల్యే కోవ లక్ష్మికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెర్ప్ పరిధిలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న 18 వేల మంది విఓఎలకు కేవలం 5 వేల రూపాయల వేతనం ఇచ్చి ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే విఓఎ జెఎసి నాయకత్వాన్ని చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఈ నెల 18 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. విఓఎలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం 20 వేల రూపాయలు అమలు చేయాలని, 58 జీవోను తక్షణమే రద్దు చేసి, పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించడంతో పాటు అర్హులైన వారికి పదోన్నతులు ఇవ్వాలని ఉపేందర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జెఎసి కోశాధికారి గజెల్లి భీమేష్, నాయకులు తిరుపతి, శ్రీనివాస్, సంతోష్, పునజీ, మహేష్, ఆనంద్, కృష్ణ, రవి, రజిత, సులోచన, కవిత పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

### సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/వలిగొండ :** జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వలిగొండ మండల కేంద్రంలో సిపిఐ మండల సమితి సమావేశం పోలేపాక యాదయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కల్లాలకు చేరి రెండు నెలలు అవుతుంది ప్రభుత్వం ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయకపోవడం వలన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అకాలవర్షం ఎప్పుడు వస్తదోనని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నాన్నారు. ఆలస్యంగా కొనుగోలు జరుగుతున్నప్పటికీ రైస్ మిల్లర్ల యాజమాన్యం తూకం తక్కువగా వస్తుందని రైతుల నుంచి ధాన్యం కటింగ్ చేస్తున్నారని వెంటనే అధికారులు రైస్ మిల్లులను తూనికల, వే బ్రిడ్జిలను తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, మండల కౌన్సిల్ సభ్యులు ఎలగందుల అంజయ్య, నరిగ యాదయ్య, బోడిగే సుదర్శన్, కట్ల యాదగిరి, పులి పలుకుల మల్లేశం, బత్తుల బిక్షపతి, సుద్దాల సాయికుమార్, మారోజు నరసింహాచారి, కొయ్యకురా రాములు, మచ లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ పేదల జీవనోపాధికి

# ఉపాధి హామీ పథకం కీలకం

సరిపడా నిధులు విడుదల చేయక తగ్గుతున్న పనిదినాలు

బికెఎంయు రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య



**ప్రజాపక్షం/నల్లగొండ(పెద్దఅడిశర్లపల్లి):** గ్రామీణ పేదల జీవనోపాధికి ఉపాధి హామీ పథకం కీలకమని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి సరిపడా నిధులు విడుదల చేయకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పనిదినాలు తగ్గిపోతున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి గుడిపల్లి మండలం గన్‌పల్లి గ్రామంలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కూలీలకు కనీసం 200 రోజుల పని కల్పించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు పని చేసిన వెంటనే వేతనాలు చెల్లించాలని, పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. వేసవికాలంలో పని చేసే చోట కూలీలకు తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పథకాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ కార్మికులు, పేద ప్రజల హక్కుల కోసం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. గ్రామాల్లో పేదల జీవన పరిస్థితులను మెరుగుపరచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. 2005 సంవత్సరంలో కమ్యూనిస్టు పార్టీల సహకారంతో యుపిఎ వన్ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందని, 96 వేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించి కూలీలకు పనులు కల్పించడం జరిగిందన్నారు. కానీ నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రతి సంవత్సరం నిధుల్లో కోత పెడుతూ కూలీలకు పనులు లేకుండా చేసి వారి పొట్ట కొట్టేందుకు పెద్ద ఎత్తున కుట్ర సాగిస్తుందన్నారు. అందులో భాగంగానే ఈ పథకంలో పనిచేసే కూలీలు రెండుసార్లు ఫోటోలు దిగాలని, ఒక్కొక్క ఫోటోకి 4 గంటల వ్యవధి ఉండాలని చట్టాన్ని సవరించి కూలీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఎంఎంఎస్ మొబైల్ మోనార్టింగ్ సిస్టంలో కొన్ని ప్రాంతాల్లో సిగ్నల్స్ లేకపోవడం వల్ల ఫోటోలు రాక కూలీలు రోజంతా పనిచేసిన మస్టర్లు పడక డబ్బులు రావడం లేదని, దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ఉపాధి కూలీలకు ఇచ్చే కూలీ రేట్లు పెంచాలని, పనుల ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని, అడిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని 700 రూపాయలు కూలీ ఇవ్వాలని కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రమావత్ రామ్ చందు, ఫీల్డ్ అసిస్టెంట్ యాదయ్య, రావుల అంజయ్య, పెరిక విజయ్‌కుమార్, కలకొండ రామచంద్రం, గోలి బిక్షం, మాసారం శ్రీను, కలకొండ బన్నీ, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిలో 'ఎంఎంఎస్' రద్దు చేయాలి

### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్



**ప్రజాపక్షం/పెనుబల్లి :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పునరుద్ధరించి, జి. రాంజీ పథకాన్ని రద్దు చేయాలని, ఉపాధి హామీలో ఎంఎంఎస్ సిస్టం రద్దు చేయాలని, రెండు వందల రోజులు పనులు కల్పించి రోజుకు 700 రూపాయలు కూలీ ఇవ్వాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. ఈనెల 15న వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే సమ్మెలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఖమ్మం జల్లా పెనుబల్లి మండలం లింగగూడెం గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించి అక్కడ కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు నిధుల్లో కోత పెడుతూ కూలీలకు పనులు లేకుండా చేసి వారి పొట్ట కొట్టేందుకు పెద్ద ఎత్తున కుట్ర సాగిస్తుందన్నారు. ఎంఎంఎస్ మొబైల్ మోనార్టింగ్ సిస్టంలో కొన్ని ప్రాంతాల్లో సిగ్నల్స్ లేకపోవడం వల్ల ఫోటోలు రాక కూలీలు రోజంతా పనిచేసిన మస్టర్లు పడక డబ్బులు రావడం లేదని దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కొమ్మినేని సుధాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ, ఎఐటియుసి జిల్లాకార్యదర్శి తోట రామాంజనేయులు, మండల కార్యదర్శి కొమ్మిన సుధాకర్, నాయకులు పొదిలి భాస్కర్, కొమ్మినేని శిరీష, కారం రాములు, వట్టం శీను, పద్మం జోగయ్య, ఉపాధి కూలీలు నాగమణి, సునీత, లక్ష్మి, నాగేషు, రాంబాబు, రమణ, పార్వతి, వెంకటేశ్వర్లు, సత్యం, సీతమ్మ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగితే చర్యలేవీ?

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాజీనామా చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా సత్వరమే న్యాయ విచారణ జరిపించాలి

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్ :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు 17ఏళ్ల మైనర్ బాలికపై లైంగిక దాడి చేసినట్లు బాధితులు ఈనెల 8వ తేదీన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినప్పటికీ ప్రభుత్వం విచారణ చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని శ్రీఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి ఆరోపించారు. హోంశాఖను తన వద్ద పెట్టుకొన్న సిఎం రేవంత్‌రెడ్డి బాలికపై లైంగిక దాడి జరిగిన ఫోక్సో కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నాడన్నారు.కుమారుడి లైంగిక వేధింపుల ఫోక్సో కేసుకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఒక మైనర్ బాలికకు అన్యాయం జరిగితే బిజెపి నాయకులు ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై లైంగిక వేధింపుల కేసుపై విచారణ జరిపించాలనీ, కేసుకు బాధ్యత వహిస్తూ బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎఐఎస్ఎఫ్ అధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్ లో నిరసన తెలుపారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ బాలిక తల్లి దండ్రులు పోలీస్‌స్టేషన్లో పోక్సో కేసు పెట్టడానికి వెళ్తే కేసు పెట్టకుండా భయభ్రాంతులకు గురి చేయడం జరిగిందని, బండి సంజయ్ తన కుమారుడిని రక్షించు కొనే ప్రయత్నం చేస్తూ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని, బాధిత కుటుంబం కేంద్ర మంత్రి కుమారుడిపై కేసు పెడితే నిర్లక్ష్యం చేస్తున్నారని, కానీ కేంద్రమంత్రి కొడుకు కరీంనగర్‌లో వారిపై పిటిషన్ ఇస్తే వెంటనే కేసు పెట్టరని, ప్రభుత్వం సామాన్యులకు ఓ తీరుగా, బడా బాబుల కుటుంబాలకు ఓ తీరుగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కేంద్ర మంత్రి కుమారుడిపై ఫోక్సో కేసు పెడితే ఇంత నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. పోలీసు యంత్రాంగం, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ కేసు నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేస్తేనే కేసు విచారణ నిష్పక్షపాతంగా జరగడానికి అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోని బాలికపై లైంగిక దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నూనావత్ శ్రీనివాస్ నాయక్, నాయకులు సందీప్ రెడ్డి, సాయి కృష్ణ, అజయ్, రాకేష్, అరుణ్, వినయ్, ఈశ్వర్, రిషి, రాహుల్ పాల్గొన్నారు.

# ప్రత్యేక అందాలతో గ్లోబ్‌ను చుట్టేస్తున్న పోచంపల్లి ఇక్కత్ చీరలు

79వ కేన్స్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ 2026 మెరువనున్న చేనేత వస్త్ర సౌందర్యం

తెలంగాణ హ్యాండ్లూమ్ బ్రాండ్ అంబాసిడర్‌గా రష్మి ఠాకూర్



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** విభిన్న కళాకృతులు హస్తకళ నైపుణ్యాలు ప్రత్యేక అందాలు ఆకర్షణతో పోచంపల్లి చేనేత ఇక్కత్ చీరలు గ్లోబ్ ను చుట్టేస్తూ ప్రపంచ ఖ్యాతిని మరింత పెంచేస్తున్నాయి. తాజాగా ఫ్రాన్స్ లోని కేన్స్ నగరంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 79వ కేన్స్ ఫిలిం ఫెస్టివల్ 2026లో ప్రపంచ సుం దరీమణులు మెచ్చిన పోచం పల్లి ఇక్కత్ చీరలు ప్రదర్శించనున్నారు. నేటి నుండి 23 వరకు కేన్స్ నగరంలో జరిగే ప్రపంచ దేశాల చలనచిత్ర ప్రదర్శనలో చేనేత వస్త్రాలను దశ దిశల వ్యాపించేలా ప్రదర్శించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రష్మీ ఠాకూర్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేసినట్లు వీవర్స్ సర్వీస్ సెంటర్ అధికారి అరుణ్ కుమార్ వెల్లడించినట్లు పోచంపల్లి ప్రొడ్యూసర్స్ కంపెనీ సీఈవో తడక రమేష్ ఆదివారం రాత్రి విలేకరులతో తెలిపారు. భారతదేశం నుండి ఒక్క తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్ నుండి ఇక్కత్ వస్త్రాలను ఎంపిక చేయడం హ్యాండ్లూమ్ ప్రమోటింగ్ కు ప్రభుత్వం చేస్తున్న కృషిని మరువలేమన్నారు. ఈ సందర్భంగా అవకాశం కల్పించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కమిషనర్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ వేడుకలో పోచంపల్లి పట్టుచీరల ఖ్యాతి మరింత పెరిగి పరిశ్రమకు దోహదపడి కార్మికుల జీవితాలకు సరికొత్త వెలుగులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు


సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని పల్లెర్ల సిపిఐ పార్టీ గ్రామ శాఖ సమావేశం తండ స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పల్లెర్ల గ్రామంలోని గతంలో కొంత మందికి మాత్రమే ఇందిరమ్మ ఇల్లు ఇచ్చారనీ, ఇంకా అర్హులైన ఉన్నారని, పల్లెర్లతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరారు. అర్హులైన వారికి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, సిపిఐ మండల కార్యదర్శి వెంకటేష్, మండల కార్యవర్గ సభ్యులు సోలిపురం లింగారెడ్డి, రాజమణి, శాఖ కార్యదర్శి దుర్గాపతి నరసింహ, సహాయ కార్యదర్శి కంబాలపల్లి కిష్టయ్య పాల్గొన్నారు.

## ప్రజానాట్యమండలి జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజానాట్యమండలి జిల్లా ప్రధానకార్యదర్శి చెక్క వెంకటేష్



**ప్రజాపక్షం/రామన్నపేట :** తెలంగాణ ప్రజానాట్యమండలి యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ఈనెల 20వ తేదీన జరిగే జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయడానికి రామన్నపేట మండల పరిధిలో సిరిపురం గ్రామంలో తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న బాగోతం, సింధు, యక్షగానం, పల్లె సుద్దులు, బుర్రకథలు, డప్పు, డోలు, ఒగ్గు డోలు, కోలాటభజన, గంగిరెద్దులు, పంబాల, సర్కార్ జానపద బుడు బుడకల, బుడిగెజంగాల కళాకారులు, కాకిపడెగల కళా బృందాలను ఒకే వేదిక మీదకు తెచ్చే చిరు ప్రయత్నం చేస్తున్నామని, తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు గోసి, గొంగడి కాలి గజ్జెలతో తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారులు ధూమ్ ధామ్ ఆటపాటతో పాటు వివిధ కళారూపాలతో ప్రజలను చైతన్యపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. భజన భాగవత కళాకారుల రామన్నపేట నూతన కమిటీ అధ్యక్షుడిగా కంకల మల్లయ్య ఉపాధ్యక్షులుగా కళ్లెం యాదగిరిలను నియమించారు. సిరిపురం గ్రామ కమిటీ నూతన అధ్యక్షులుగా బల్గూరి రవి, ఉపాధ్యక్షులు బల్గూరి రమేష్, మామిడి రామచంద్రం, ప్రధాన కార్యదర్శి కొంగరి జంగయ్య, సహాయ కార్యదర్శి మోటి మల్లేశం, కోశాధిపతి చేపూరి సత్యనారాయణ, గౌరవాధ్యక్షులు వడ్డేపల్లి విఠలయ్య, కమిటీ సభ్యులు కంకల మల్లయ్య, రామోజు నరసింహ చారి, గోదాల సుధాకర్ రెడ్డి, తుంగ మార్కయ్య, గాదె రామచంద్రంలను నియమించారు.

## లారీల కొరత తీర్చాలని వినతి

**ప్రజాపక్షం/నూతనకల్ :** మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యపు కొనుగోలు కేంద్రాలలో లారీల సప్లై లేక ధాన్యపు కాంటాలు ఆగిపోవడంతో రైతులు మండల తహశీల్దార్ శ్రీనివాసరావుకు తమ ఆవేదనను తెలియజేస్తూ సివిల్ సప్లై అధికారులతో మాట్లాడి వెంటనే లారీలు సప్లై అయ్యే విధంగా చూడాలని కోరుతూ సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లారీల సప్లై లేక ఎగుమతులు జరగక కాంటాలు అయిన ధాన్యపు బస్తాలు నిలువ ఉండడంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యాన్ని కాంటాలు వేయడం నిలిపివేశారని, కాంటాలు ఎందుకు వేయడం లేదని అడిగితే లారీల కొరత ఉండడంతో కాంటాలు వేసినా బస్తాలు నిలువ ఉన్నాయని అందుకే కాంటాలు నిలిపివేసినట్లు వారు తెలిపారు. అకాల వర్షాలు పడినట్లయితే తమ ధాన్యపురాసుల నిలువ ఉన్న కాంటాలు వేయబడిన బస్తాలు తడిసి ముద్దయి మాకు అపార నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆవేదనను గమనించిన తహశీల్దార్ శ్రీనివాసరావు ఉన్నతాధికారులతో మాట్లాడి లారీలు సప్లై అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకట్‌రెడ్డి, గంగారెడ్డి, మధుసూదన్ రెడ్డి, లింగారెడ్డి, జనార్ధన్ రెడ్డి, లింగయ్య, పుల్లారెడ్డి, మహేష్, సైదులు, రవిశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



# అన్నదాత ఆగ్రహం.. రోడ్డెక్కిన వైనం

లారీ లోడింగ్‌కు రూ.13 వేలు వసూలు?

సీరియల్ పాటించకపోవడంతో రైతుల ఆందోళ

అడ్లూరు వద్ద శాలిగౌరారం-నకిరేకల్ రహదారిపై రాస్తారోకో



**ప్రజాపక్షం/నకిరేకల్ (శాలిగౌరారం):** ధాన్యం కొనుగోళ్లలో జాప్యం,లారీ లోడింగ్ పేరుతో భారీ వసూళ్లు, సీరియల్ ప్రకారం కాంటాలు వేయకపోవడాన్ని నిరసిస్తూ రైతులు రోడ్డెక్కారు.శాలిగౌరారం మండలం అడ్లూరు పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం వద్ద సోమవారం రైతులు శాలిగౌరారంనకిరేకల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.సుమారు 40 నిమిషాల పాటు సాగిన ఆందోళనతో రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. అకాల వర్షాలతో ధాన్యం తడుస్తుండగా, కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి వేచి ఉన్నా తూకం వేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తరుగు, తాలు పేరుతో కోతలు పెడుతూ, వెయిటింగ్ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.ధాన్యం లోడింగ్ కోసం ప్రభుత్వం ఇచ్చే కమిషన్ కాక అదనంగా కొనుగోలు ప్రారంభ దశలో 3వేలు నుండి 4వేలూ వసూలు చేయగా ఇప్పుడు ఏకంగా లారీ డ్రైవర్లు రూ.10 వేల నుంచి రూ.13 వేల వరకు డిమాండ్ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.అడ్లూరులో ముందస్తుగా డబ్బులు ఇస్తేనే లారీలు వస్తున్నాయని తెలిపారు. సీరియల్ ప్రకారం లోడింగ్ జరగకుండా నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వివరిస్తున్నారని ఆరోపించారు.బుక్కు సీరియల్ మెయింటెనెన్స్ చేస్తాలేరని పేర్కొన్నారు. ధాన్యం లోడింగ్ కోసం రాత్రి వేళల్లో బస్తాలు ఇస్తున్నారని మండిపడ్డారు.ఇటీవల వడగండ్ల వానతో నష్టం వాటిల్లగా,రెండు మూడు రోజులుగా మబ్బులు కమ్ముకోవడంతో రైతుల్లో ఆందోళన మరింత పెరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని, రైస్‌మిల్లర్ల వద్ద వెయిటింగ్ లేకుండా ధాన్యాన్ని తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న లారీ డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు :మాధవరావు తహశీల్దార్,శాలిగౌరారం**

రైతుల నుంచి లారీ డ్రైవర్లు లేదా ఇతరులు డబ్బులు వసూలు చేస్తే ప్రభుత్వ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ మాధవరావు హెచ్చరించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా సీరియల్ ప్రకారం బుక్ నిర్వహణ చేసి లోడింగ్ చేపట్టాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

# ధాన్యం తరలింపులో జాప్యం వద్దు

నియోజకవర్గం తహసీల్దార్లతో సమీక్ష సమావేశం

ప్రభుత్వ విప్ వేముల వీరేశం,జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్



**ప్రజాపక్షం/నకిరేకల్:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు.సోమవారం నకిరేకల్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని నకిరేకల్,కట్టంగూర్, కేతేపల్లి,నార్కట్‌పల్లి, చిట్యాల,రామన్నపేట తహశీల్దార్, సివిల్ సప్లై అధికారులతో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల పనితీరు,రోజువారీ ధాన్యం కొనుగోళ్లు, రైస్‌మిల్లులకు తరలింపు, రైతులకు చెల్లింపుల అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ఎలాంటి ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు,తేమ కొలిచే మీటర్లు, తూకం యంత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.రైతు కష్టానికి సరైన గౌరవం దక్కేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఈసమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్,డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేష్,జిల్లా సహకార అధికారి పట్యా నాయక్ ,సహాయ వ్యవసాయ సంచాలకులు మమ్మద్ జాన్మియా,తహశీల్దారులు యశ్వంత్ రాజ్, పుష్పలత, జ్యోతి,గుత్తా మాధవరెడ్డి, శాఖల అధికారులు అధికారులు,రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా కళలే పోరాటాలకు ఆయుధాలు

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

22న జరిగే ప్రజానాట్యమండలి జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ:** పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలు, పేదలపై జరుగుతున్న అన్యాయాలను ప్రజా కళాకారులు తమ పాటలు, నాటకాల ద్వారా ఎండగట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు.సోమవారం నల్లగొండ పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా సమితి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ అనేది కేవలం వినోద సాధనం మాత్రమే కాదని, అది అణగారిన వర్గాల గళమని స్పష్టం చేశారు. ప్రజా కళల ద్వారా సమాజంలో విప్లవ చైతన్యం రగిలించాలని, కళాకారులు ప్రజల పక్షాన నిలబడి సామాజిక మార్పు కోసం ఉద్యమించాలని కోరారు. ప్రజా కళాకారుడు మౌనంగా ఉంటే సమాజం చీకట్లోకి వెళ్తుందని, కళాకారుడు గళమెత్తితే ఉద్యమాలకు ఊపిరి వస్తుందని అన్నారు.ప్రతి కళాకారుడు ప్రజా సమస్యలను తమ కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు. ఈ నెల 22న నల్లగొండ పట్టణంలో నిర్వహించనున్న ప్రజానాట్యమండలి జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా నలుమూలల నుంచి కళాకారులు పెద్దఎత్తున హాజరై సాంస్కృతిక ఉద్యమ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద శ్రీనివాస్,జిల్లా అధ్యక్షుడు బుడిగపాక జగన్, కార్యదర్శి చెల్లం పాండురంగారావు,పరమేష్,ప్రవీణ్, రాములు, హనుమంతు,వెన్నెల వెంకన్న,సైదమ్మ తదితర కళాకారులు పాల్గొన్నారు.

## ప్రజల కోసమే ప్రజాపాలన : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/మోతె :** ప్రజల కోసమే ప్రజాపాలన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కోదాడ శాసనసభ్యులు నల్లమాద పద్మావతి రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సిఎంఆర్‌ఎఫ్, షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో ఈ రాష్ట్రంలో ఏ ఒక్కరికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ఏ ఒక్కరికి ఏ చిన్న సమస్య వచ్చినా ఆదుకొని హక్కున చేర్చుకోవడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బాధ్యత అని చెప్పారు. భవిష్యత్‌లో నియోజకవర్గంలో మరిన్ని ఇండ్లు నిర్మాణం చేసుకుందామని అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పకుండా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. 56 మందికి సిఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులు సుమారు 123 మందికి రూ.16లక్షల 16వేలు, షాదీముబారక్, కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు సుమారు 123 మందికి రూ.1కోటి 23లక్షల 14వేల 263 అందించి రేవంత్ సర్కార్ పేద ఇంటి ఆడబిడ్డలకు అండగా నిలిచిందన్నారు. గ్రామ సర్పంచ్ దోసపాటి అనురాధ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకన్న, డిటి పుష్ప, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి, పుల్లారావు, వీరన్న పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కారం

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డితో కలిసి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 75 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 47,జిల్లా పంచాయతీ 8, పంచాయతీరాజ్ 3, ఎస్సీ డెవలప్మెంట్ 3, గ్రామీణ అభివృద్ధి శాఖ 2, విద్యాశాఖ 2, ఉపాధి కల్పన 2, మున్సిపాలిటీ 2 హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్, సర్వే ల్యాండ్స్, మైన్స్, ఫిషరీస్, వ్యవసాయ ,జిల్లా సంక్షేమ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తూ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని, కొన్ని శాఖలు ఉద్యోగుల వివరాలు అందేజెయలేదని, అట్టి శాఖల ఉద్యోగుల వివరాలను అందజేయాలన్నారు. తదుపరి జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని , ట్యాబ్ ఎంట్రీలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. రైతులకు ఏ ఇబ్బంది కలగకుండా దాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు త్రాగు నీరు, టెంట్ తదితర మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి పాల్గొన్నారు.

## నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**నీటిని పొదుపుగా వాడుకోవాలని, ప్రతి వర్షపు నీటి చుక్కను సంరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.జల్ సంచయ్ జన బాగిదారి కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో కలిసి జండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జల సంరక్షణపై ప్రజలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రచార వాహనం జిల్లాలోని అన్ని గ్రామాలను సందర్శించి, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ద్వారా నీటి సంరక్షణ, పొదుపుపై అవగాహన కల్పిస్తుందని చెప్పారు. కమ్యూనిటీ సోక్‌పిట్లు, వ్యక్తిగత సోక్‌పిట్లు,ఫామ్ పాండ్లు,నీటి సంరక్షణ కట్టడాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు.నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వర్షపు నీటి సంరక్షణ ముఖ్యమని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవాలని కోరారు. మున్సిపల్ పరిధిలో ఇల్లు కట్టుకునే వారికి ఇంకుడు గుంత తప్పనిసరి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, పీడీ రాజ్‌కుమార్,డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి,డిపిఆర్‌ఓ వెంకటేశ్వర్లు,కార్పొరేటర్ ఉన్న జ్ఞానేశ్వరి,డీఆర్‌డీఏ సిబ్బంది, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం పాల్గొన్నారు.

**యోగాసనాలు పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**

మానవ జీవితంలో ప్రతి ఒక్కరికిచిన్ననాటి నుంచి యోగా ఎంతో అవసరం అని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వైదిక యోగ పీఠ్ ఫౌండర్ కరుణాకర్ గురూజీ రూపొందించిన యోగాసనాలు పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే యోగ పట్ల అవగాహనతో పాటు నిత్య యోగ సాధన చేయడం ద్వారా మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండి వ్యాధులకు దూరంగా ఉండవచ్చు అని అన్నారు.



## పేదల సొంతింటి కల సాకారం

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి పేదవాడికి సొంతింటి కల నిజం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని 4వ వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.నూతన గృహంలోకి ప్రవేశించిన లబ్ధిదారురాలు దుబాకి స్వప్న కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించారు. వారికి పట్టు వస్త్రాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి శాశ్వత నివాస సౌకర్యం కల్పించే వరకు ప్రభుత్వం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాణి భరత్ గౌడ్, వైస్ చైర్మన్ బర్గే రమ్య, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ బిక్షపతి. కౌన్సిలర్ కాటబరతిని స్వప్న పాల్గొన్నారు.

## గోవుల అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గోవుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోబడుతాయని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో విసి హాల్ నందు నిర్వహించిన బక్రీద్ ఉత్సవ సమన్వయ కమిటి సమావేశంలో జిల్లా ఎస్‌పి కె. నరసింహతో కలిసి జిల్లా కలెక్టర్ మాట్లాడారు. రాబోవు బక్రీద్ పండుగ సందర్భంగా గోవుల అక్రమ రవాణాపై గట్టిగా నిఘా పెట్టాలని అంతరాష్ట్ర సరిహద్దు వద్ద పోలీస్ చెక్ పోస్టులు పెట్టి క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. సరైన పత్రాలు లేకుండా పక్క రాష్ట్రాల నుండి జిల్లా లోపలికి ప్రవేశించు వారిపై చర్యలు తీసుకోవాలని, సంతలో కొనుగోలు చేసిన పశువులకు తప్పనిసరిగా సంత రహదారి బిల్లు ఉండాలన్నారు. ఈ రహదారి బిల్లు విషయంలో జిల్లా వెటర్నీ అధికారితో సమన్వయం చేసుకోవాలని, బక్రీద్ పండుగకు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని, స్రుహుతుభావన వాతావరణంలో పండుగ జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వేణుమాధవరావు, జిల్లా వెటర్నరీ అధికారి శ్రీనివాసరావు, డిఎంఓ నాగేశ్వర్ శర్మ, మున్సిపల్ కమీషనర్ హనుమంత రెడ్డి, బిసి వెల్ఫేర్ అధికారి నరసింహ, ఏసిపిలు ప్రసన్న, శ్రీనివాస్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**జిల్లాలో ఎస్‌ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం**

జిల్లాలో ఎస్‌ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో వేగవంతంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. సోమవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుండి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులు, సూపర్‌వైజర్లు, బిఎల్‌ఓలు సమన్వయంతో పనిచేస్తూ ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారని చెప్పారు. సూర్యాపేట జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 71 శాతం పూర్తి చేసినట్లు, జిల్లాలో 78వేలు ప్రొజెనీ మ్యాపింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు. వచ్చే వారం రోజుల్లో 80 శాతానికి చేరుకుంటామని చెప్పారు. సూర్యాపేట నియోజక వర్గంలో 72 శాతం ఇప్పటికే పూర్తి చేశామన్నారు. త్వరలో పూర్తిస్థాయిలో ప్రక్రియను వేగవంతం చేస్తామని వివరించారు.

## ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని అనంతారం గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ ఫీల్డ్ అసిస్టెంట్ షేక్ బేగంపై జిల్లా కలెక్టర్‌కు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త మస్తాన్ ఫిర్యాదు అందజేశారు. గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, కూలీల హాజరు, బినామీ పేర్లు నమోదు, పనుల నిర్వహణలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తూ వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు పారదర్శకత ఉండేలా ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వడమే లక్ష్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** ఇల్లులేని ప్రతి నిరుపేదకు పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని రాష్ట్లతండ గ్రామంలో లబ్ధిదారులు వాంకుడోతు సంధ్య సంతోష్ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిస్తామని చెప్పి పదేళ్లు ఊరించిన గత ప్రభుత్వం ఒక్కరికైనా పక్కా ఇల్లు ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ప్రతి నియోజక వర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని గుర్తు చేశారు. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాంకుడోతు హాథిరామ్, ఉపసర్పంచ్ జాటోత్ శంకర్, నాయకులు వాంకుడోతు కిట్టు, జాటోతు జామనాయక్, అంజద్అలీ, ధరావత్ వీరన్న నాయక్, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.



## విద్యుత్ బకాయిలు వసూలు చేయాలని సిసిఐ సాధన కమిటీ ధర్నా

ప్రజాపక్షం/మావల : సిసిఐ పరిశ్రమ చెల్లించాల్సిన రూ.18కోట్ల విద్యుత్ బకాయిలను వెంటనే వసూలు చేయాలని డిమాండ్ చేస్తూ సిసిఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఇ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ సామాన్యులు వెయ్యి రూపాయలు బకాయి ఉంటే కరెంట్ కట్ చేసే అధికారులు, సిసిఐ నుండి కోట్ల రూపాయల బకాయిలను ఎందుకు రాబట్టడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం పరిశ్రమను స్క్రాప్ కింద అమ్మేస్తుంటే అధికారులు నిర్లక్ష్యంగా ఉండడం సరికాదని విమర్శించారు. వెంటనే యాజమాన్యానికి నోటీసులు ఇచ్చి బకాయిలు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండా రమేష్, దాసరి రమేష్, జగన్ సింగ్, ఈశ్వర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటిఐ మొదటి ఫేస్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/నిజామాబాద్ : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటిఐ మొదటి ఫేస్ అడ్మిషన్లకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ ఐటిఐ షాద్ నగర్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కమీషనరేట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్, హైదరాబాద్ వారి ఆదేశాలతో ఆగస్టు 2026, 2027, 2028 సెషన్ కోసం ఎన్‌సీవీటీ ప్యాటర్న్ కింద వివిధ ట్రేడ్లలో శిక్షణ పొందటానికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటిఐలలో ప్రవేశాల అడ్మిషన్ల దరఖాస్తులను మే 14 నుంచి జూన్ 8 వరకు మొదటి ఫేస్ అడ్మిషన్ అనుమతించబడునని తెలిపారు. అభ్యర్థులు https://iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## 14 వరకే మొక్కజొన్న కొనుగోళ్లు

ప్రజాపక్షం/నేరడిగొండ : మండల వ్యాప్తంగా సాగు చేసిన మొక్కజొన్న పంటను రైతులు ఈ నెల 14వ తేదీలోపు మార్కెట్ కేంద్రాల్లో అమ్ముకోవాలని పీఏసీఎస్ సీఈఓ గోలి స్వామి సూచించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. నిర్ణీత గడువు తర్వాత మొక్కజొన్న కొనుగోళ్లను శాశ్వతంగా నిలిపివేస్తామని స్పష్టం చేశారు. రైతులు ఈ విషయాన్ని గమనించి, గడువు ముగియకముందే తమ పంటను విక్రయించి సహకరించాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించి మద్దతు ధర పొందాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.



## జనగణన ప్రక్రియలో అందరూ భాగస్వామ్యం కావాలి

కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రజాపక్షం/మెదక్ : జనగణన 2027లో భాగంగా సమగ్ర, ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా నుండి పోస్ట్ ఆఫీస్ సర్కిల్ వరకు మొదటి దశ జనగణనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిమా సింగ్, ఆదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి మాదథాన్ వాక్ కార్యక్రమాన్ని పాల్గొని ఇంటింటి సందర్శనతో అవగాహన కల్పించారు. ప్రజల సహకారంతో కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం జనగణన ట్యాబ్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత భారత దేశంలో జనగణన చేయడం జరుగుతుందని, 2021లో జనగణన జరగాల్సింది ఉంది కానీ కోవిడ్ కారణంగా జరగలేదని,మన తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత ఇది మొదటి జనగణన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధికా భూపతి రాజు, మెదక్ ఆర్డీఓ రమాదేవి, డీఎఫ్ఓ జోజి, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, సంబంధిత జిల్లా అధికారులు వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు క్రీడాభిమానులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్‌ను మంత్రి పదవి నుండి తొలగించాలి : మల్లిఖార్జున్

ప్రజాపక్షం/నిజాంసాగర్ : దేశం కోసం, ధర్మంకోసం అంటూ ప్రగల్బాలు పలికే బిజెపి నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండిసంజయ్ కుమారుడు బండి భగీరథ విషయంలో కేంద్రం ఎందుకు స్పందించడం లేదని డిసిసి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఏలే మల్లిఖార్జున్ ప్రశ్నించారు. ఆయన ఈ మేరకు సోమవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఓ మైనర్ బాలికను పలుమార్లు స్నేహం పేరుతో ఫామ్‌హౌస్‌కు రప్పించుకుని కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి అత్యాచారానికి పాల్పడ్డ ఘటనపై బీజేపి ఎందుకు స్పందించడం లేదన్నారు. కంచె చేను మేసే విధంగా హోం శాఖ సహాయమంత్రిగా ఉన్న బండి తన కుమారుని విషయంలో మౌనం ఎందుకు వహిస్తున్నారని ప్రశ్నించారు. బండికి నీతి నిజాయితి ఉంటే ఈ కేసు కొనసాగుతున్నంత కాలం ఎంపి, మంత్రి పదవికి రాజీనామా చేసి కేసు విచారణ పారదర్శకంగా సాగేలా సహకరించాలని డిమాండ్ చేశారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల విచారణ పూర్తి చేసి, అర్హులకు న్యాయం చేయండి

న్యూ డెమోక్రసీ నాయకులు, బాధితులు

ప్రజాపక్షం/ఖానాపూర్ : ఖానాపూర్ పట్టణంలోని కొమురం భీం చౌరస్తాలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై విచారణ త్వరగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ, డబుల్‌బెడ్ రూం సాధన కమిటీ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వకంగా సమర్పించడం జరిగిందని న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూంలలో గత ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు, అధికారులు అక్రమాలు జరిగాయని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొంత వరకు డ్రా చేసి మిగిలిన బెడ్ రూములను పేదలకు చెందకుండా బడా బాబులకు కేటాయించారు. వీటిపై సమగ్రంగా విచారణ జరిపించి, సెల్ఫ్ అఫిడవిట్ తీసుకొని అనర్హులను తొలగించి, అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం లింగన్న, డబుల్‌బెడ్‌రూం సాధన కమిటీ కన్వీనర్ తోట రాధా, లక్ష్మి, కల్పన, కమల, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినుల భవిష్యత్‌కు మెరుగైన వసతులు

కలెక్టర్ కె.హరిత



ప్రజాపక్షం/రెబ్బెన : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులకు కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం రెబ్బెన మండలంలోని గంగాపూర్ గ్రామంలోని కస్తూరి గాంధీ బాలికల విద్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యావారోత్సవాలలో భాగంగా ఏర్పాటుచేసిన అదనపు తరగతుల గదుల నిర్మాణనికి బాలికలకు ప్రత్యేక టాయిలెట్లు నిర్మాణం పనులను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మితో కలిసి కలెక్టర్ కె.హరిత భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, అందరికీ విద్యను అందించడం మే ప్రధాన కర్తవ్యమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యానుగుణంగా అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటూన్నమన్నారు. నీతి అయోగ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రతి పాఠశాలలో బాలికల కొరకు ప్రత్యేక టాయిలెట్ గదుల నిర్మాణం చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే కోవాలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదివి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు అనంతరం మండలంలోని తుంగేడ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రిఫాబ్రిక్ టాయిలెట్ గదిని ప్రారంభించారు. ఈ కార్యక్రములో సర్పంచులు పిఎసిఎస్ అధ్యక్షులు కర్నాథం సంజీవ్,తహసీల్దార్ సూర్యప్రకాష్, ఎంపిడిఒ శంకరమ్మ,ఉపాధ్యక్షులు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి**

**ఆసిఫాబాద్** : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత ప్రజావాణిలో అందిన దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దరఖాస్తు దారుల నుండి అర్జీలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని పైకాజి నగర్ కాలనీకి చెందిన పలువురు తమ కాలనీ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమములో జిల్లా అధికారులు,అర్జిదారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సర్వతోముఖ వికాసానికి సమ్మర్ క్యాంప్ ప్రారంభం

మందమర్రి మోడల్ స్కూల్‌లో ఘనంగా ప్రారంభోత్సవం

ప్రజాపక్షం/మందమర్రి : విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సమ్మర్ క్యాంప్ – 2026" కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి మండల రెవెన్యూ అధికారి సతీష్ కుమార్,మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్, మండల విద్యాధికారి రాథోడ్ రమేష్, ఎఎంసి చైర్మన్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా కళలు, క్రీడలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు. సమ్మర్ క్యాంప్‌ల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని, భవిష్యత్ లక్ష్యాలను సాధించేందుకు ఇవి బలమైన పునాది అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహాన్ని నింపారు.క్యాంప్ ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మే 11వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు మొత్తం 15 రోజుల పాటు నిర్వహించనున్న ఈ సమ్మర్ క్యాంప్‌లో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డాన్స్, యోగా, స్టిచింగ్, ఇండోర్ గేమ్స్ తదితర విభాగాల్లో ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. విద్యార్థులలో సృజనాత్మక ఆలోచన, క్రమశిక్షణ, సమయపాలన, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించేలా కార్యక్రమాలను రూపకల్పన చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



## అర్హులకు ఇందిరమ్మ ఇల్లు

-నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ప్రజాపక్షం/శివ్వంపేట : అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించే విధంగా తనవంతు కృషి చేయడం జరుగుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం శివ్వంపేట మండలానికి చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి ప్రొసిడింగ్ పత్రాలను మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని, అదేవిధంగా వారికి బిల్లులు సకాలంలో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ చింతల వెంకటరాంరెడ్డి, హౌసింగ్ డీఈ ప్రభు, ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ చంద్రాగౌడ్, స్థానిక సర్పంచ్ వెంకటేశ్వర్, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోగా ఇళ్ల గణన ప్రక్రియ పూర్తి

నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

ప్రజాపక్షం/నిర్మల్ : దేశ భవిష్యత్తు ప్రణాళికలకు అత్యంత కీలకమైన జనగణన ప్రక్రియలో భాగంగా నిర్వహించే హౌజ్ లిస్టింగ్ (ఇండ్ల గణన) కార్యక్రమాన్ని జిల్లాలో అత్యంత పకడ్బందీగా, నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ఆయన నిర్మల్ గ్రామీణ మండలం తల్వేద గ్రామంలో పర్యటించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఇండ్ల గణన తీరును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్ల వద్ద ఉన్న కిట్‌లను, రిజిస్టర్లను తనిఖీ చేసిన కలెక్టర్ గణనలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా నిబంధనల ప్రకారం ఇంటి నెంబర్ల కేటాయింపు జరగాలని స్పష్టం చేశారు. స్థానిక పంచాయతీ కార్యదర్శులు, జిపిఒలు నిరంతరం ఎన్యుమరేటర్ల వెంట ఉంటూ పర్యవేక్షించాలని, ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా, వెంట తప్పనిసరిగా ఓఆర్ఎస్ పొట్లాలు ఉంచుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జనగణనపై ప్రజలకు అవగాహన కల్పించే ప్రత్యేక ప్రచార వాహనాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా సుమారు 2 లక్షల ఇళ్ళల్లో ఈ సర్వే నిర్వహించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. నేటి నుండి జూన్ 9వ తేదీ వరకు కొనసాగే ఈ హౌజ్ లిస్టింగ్ ప్రక్రియ కోసం జిల్లాలో 1400 మంది ఎన్యుమరేటర్లను, 200 మంది సూపర్‌వైజర్లను నియమించి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు, సిపిఓ జీవరత్నం, డిపిఆర్.ఓ. విష్ణువర్ధన్, తహసిల్దార్, ప్రభాకర్, ఎంపిఓ శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ లక్ష్మి మరియు వివిధ విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



**ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి**

**నిర్మల్ టౌన్** : ప్రజావాణి ద్వారా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు సమర్పించే వినతులను ఏమాత్రం జాప్యం చేయకుండా, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని బాధితుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుండి వచ్చే ప్రజల పట్ల అధికారులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లోనే నిర్వహించిన ధాన్యం సేకరణ, రవాణా సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాల్లో అధనపు కలెక్టర్లు బి.వెంకటేశ్వర్లు , కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, డి.ఆర్.డి.ఓ. విజయలక్ష్మి, లారీ ట్రాన్స్‌పోర్టు ప్రతినిధులు, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## విత్తన సంస్థ పంపిణీ చేసే సీడ్స్ రైతులు వినియోగించేలా ప్రోత్సహించాలి

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్ రెడ్డి

ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్ : రాష్ట్ర విత్తన సంస్థ పంపిణీ చేసే సీడ్స్ రైతులు వినియోగించేలా రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మెన్ మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించిన వారి ఉన్నతికి విత్తన సంస్థ పనిచేస్తుందని, డీలర్లు అందరూ ప్రభుత్వం తయారు చేసే విత్తనాలు రైతులు సాగు చేసుకునేలాగా ప్రచారం కల్పించాలన్నారు. విత్తనాభివృద్ధి సంస్థ పంపిణీ చేసే విత్తనాలు అన్ని నాణ్యతా పరంగా ఉత్తమమైనవి అని అన్నారు. ధర తక్కువ ఉండటంతో పాటుగా, దిగుబడి కూడా అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. అనుమతులు లేని ప్రైవేటు విత్తనాల కంపెనీలు రైతులను ప్రలోభాలకు గురిచేస్తూ , నాసిరకం విత్తనాలు అమ్ముతున్నాయని వివరించారు. దీని ద్వారా రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. డీలర్లు ఎట్టి పరిస్థితుల్లో నకిలీ విత్తనాలు రైతులకు అమ్మరాదని హెచ్చరించారు. సహకార సంఘాలు, మహిళా సంఘాలు, విత్తన సంస్థ యొక్క విత్తనాలు రైతులకు అందించాలని తెలిపారు.




**విత్తనాభివృద్ధి సంస్థ సీడ్స్ వల్ల రైతులకు లాభాలు :**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేసే విత్తనాల వల్ల రైతులకు చాలా లాభాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా అన్నారు. సంస్థ తయారుచేసే విత్తనాలు అన్ని ఎన్నో నాణ్యతా పరీక్షల తర్వాత విపణిలోకి వస్తాయన్నారు. ఈ విత్తనాలు సాగు చేయడం ద్వారా రైతులు ఎక్కువ లాభాలు పొందగలుగుతారని చెప్పారు. అలాగే నకిలీ విత్తనాల నుంచి కూడా రైతులు నష్టపోకుండా ఉంటారని అన్నారు. విత్తన డీలర్లు అందరూ రైతులు ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలు వినియోగించేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఈ సమావేశంలో నిర్మల్, ఆదిలాబాద్ వ్యవసాయ శాఖ అధికారులు అంజి ప్రసాద్, శ్రీధర్, డి.ఆర్.డి.ఓ. విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మెన్‌లు భీం రెడ్డి, అబ్దుల్ హాదీ, ఆత్మ కమిటీ చైర్మెన్ రాం రెడ్డి ఇతర అధికారులు విత్తన డీలర్లు పాల్గొన్నారు.

## బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలి

ఎఫ్డిసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్



ప్రజాపక్షం /గజ్వేల్ : పోక్సో కేసులో ఇరుక్కున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమ్మక్కై బండి భగీరథను కాపాడుతున్నట్లు విమర్శించారు. అంతే కాకుండా బంగారం కొనొద్దని, పెట్రోల్, డీజిల్ కోసం ప్రజలు తిరిగొద్దని ప్రధాని మోదీ ఆంక్షలు పెట్టడం సిగ్గుచేటని నిలదీశారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 80 ఏండ్లు దాటుతున్నా ఏ ప్రధాని ఇలాంటి ఆంక్షలు పెట్టలేదని ఎద్దేవా చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి రూపాయి విలువ పతనమే కారణమని, ఇందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వ బాధ్యత వహించాలని తెలిపారు. మోదీ ప్రధాని అయ్యాక ఎగుమతులు తగ్గి దిగుమతులు పెరగగా, మొక్కజొన్న, కాటన్ దిగుమతి చేసుకునే దుస్థితి నెలకొందని విమర్శించారు. విదేశీ మాదకద్రవ్యం తగ్గి డాలర్ విలువ పెరిగి, రూపాయి విలువ పతనమై దేశ ఆర్థిక వ్యవస్త రోజురోజుకు దిగజారుతోందని, ఇందుకు మోదీ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గడిచిన 12 ఏండ్లలో రెండు లక్షల కోట్ల అప్పుచేసి ఏ అభివృద్ధికి వినియోగించారని ప్రశ్నించారు. అబద్ధపు, అసత్యపు హామీలతో అధికారం చేపట్టిన మోదీ స్విస్ బ్యాంకులోని డబ్బు తెచ్చి రూ. 15 లక్షలు జమ చేస్తామని చెప్పి చేతులెత్తేసినట్లు గుర్తు చేశారు.బిజెపి మతపరమైన రాజకీయాలు చేస్తూ లబ్ధి పొందుతూ ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాన్సిలర్లు, నేతలు బొల్లారం ఎల్లయ్య, గంగిశెట్టి రవీందర్, నర్సింగ రావు, నవాజ్ మీరా, బెండే మధు, ఉడెం కృష్ణారెడ్డి శ్రీనివాస్ గుప్త, బొగ్గుల సురేష్, మామిడి శ్రీధర్, కామిని మురళి, కనక సేన, సంతోష్, ప్రతాప్ రెడ్డి, భీమప్ప, అహ్మద్, స్వామి చారి, శివకుమార్ పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాపక్షం/నిజామాబాద్ : ఇసుక రవాణా విషయంలో నిబంధనల ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. కలెక్టర్ అధ్యక్షతన సోమవారం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి ఇసుక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, మైనింగ్, ఇంజనీరింగ్ తదితర శాఖల అధికారులు హాజరు కాగా కలెక్టర్ మాట్లాడారు.

ఇసుక రీచ్‌లను, క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. మన ఇసుక వాహనం ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఇసుక కేటాయింపులు జరగాలని, ఇసుక రవాణా విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను తు.చ తప్పకుండా అమలయ్యేలా చూడాలన్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత ఇసుక వాహనాల రాకపోకలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని సూచించారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్, జవహర్ నవోదయ విద్యాలయం భవన సముదాయాల నిర్మాణాలకు అవసరమైన ఇసుక నిల్వలను నిర్దేశిత ఇసుక రీచ్‌ల నుండి తరలించేందుకు కలెక్టర్ అనుమతించారు.

సమావేశంలో సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ఆర్డీఓ రాజేంద్రకుమార్, మైనింగ్, రెవెన్యూ ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

కలెక్టర్ రాజర్షిషా

ప్రజాపక్షం/మావల : దివ్యాంగుల సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధన్యత నిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. సోమవారం స్థానిక డైట్ కళాశాల ఆవరణలో విద్యాశాఖ, సమగ్ర శిక్షా, ఎలింకో సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగు చిన్నారులకు ఉచిత సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. సుమారు 250 మంది చిన్నారులకు వారి అవసరాలకు తగిన ఉపకరణాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అర్హులైన చిన్నారులందరికీ త్వరలోనే పెన్షన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలో దివ్యాంగ చిన్నారుల కోసం రూ 2 కోట్లతో ప్రత్యేక రెసిడెన్సియల్ పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్ అధికారులు రవీందర్ రాథోడ్, మిల్కా, తిరుపతి, సోమయ్య, రోహిణి పాల్గొన్నారు.

**సమ్మర్ క్యాంప్‌లు ప్రారంభం :** ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ పాఠశాలలో వేసవి శిబిరాలను కలెక్టర్ ప్రారంభించారు. విద్యార్థులు మ్యూజిక్, కోడింగ్, యోగాలో శిక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నీరోష్, ఎంఈఓ రమేష్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వినోద్ రెడ్డి, పాఠశాల చైర్మన్ పార్వతి పాల్గొన్నారు.



**15న ఉట్నూర్‌లో జాబ్ డ్రైవ్ :** ఈ నెల 15న ఉట్నూర్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. 20కిపైగా ప్రముఖ కంపెనీలు పాల్గొనే ఈ మేళా పోస్టర్‌ను ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్‌తో కలిసి సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు.

**జనగణనకు సహకరించండి :** జిల్లాలో ప్రారంభమైన జనగణనపై సోమవారం ఇంధిరా ప్రియదర్శిని స్టేడియం నుండి అవగాహన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. జూన్ 9వరకు జరిగే ఈ ప్రక్రియలో ప్రజలు ఎన్యుమరేటర్లకు సరైన వివరాలు అందించాలని కోరారు. ర్యాలీలో అదనపు కలెక్టర్లు చిత్రు, రాజేశ్వర్, డిఆర్ఓ స్రవంతి, డివైఎస్ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**కంటి స్కానింగ్ యంత్రాల పంపిణీ :** సదరం క్యాంపుల్లో చిన్నారుల వైకల్య శాతాన్ని ఖచ్చితంగా నిర్ధారించేందుకు కలెక్టర్ రాజర్షిషా అత్యాధునిక స్కానింగ్ యంత్రాలను పంపిణీ చేశారు. ప్రయోగ్‌రాజ్ నుండి తెప్పించిన ఈ యంత్రాల వల్ల వైద్య సేవలు మరింత వేగవంతం అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చిత్రూ, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, అధికారులు పాల్గొన్నారు.

**ప్రజా ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి :** ప్రజావాణిలో వచ్చే పిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి 75 అర్జీలను సీకరించారు. సమస్యలపై తీసుకున్న చర్యల నివేదికలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని, నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, చిత్రు, డిఆర్ఓ స్రవంతి పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
మంగళవారం
12-05-2026
www.prajapaksham.in

‘ నారా రోహిత్ హీరోగా కొత్త సినిమా ప్రారంభమైంది. ఇది నారా రోహిత్ కెరీర్ లో 23వ చిత్రం. సోమవారం అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరిగిన ప్రారంభోత్సవంలో ప్రముఖ దర్శకుడు కొరటాల శివ క్లాప్ కొట్టారు. ’

రీల్

## జూన్ 19న రానున్న
# బాలన్ - ది బాయ్





గ్రాండియర్ ఫిలిం మేకింగ్ కు మారుపేరైన కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్న సినిమా ‘బాలన్ ది బాయ్‘. ఈ చిత్రానికి ‘ఆవేశం‘ ఫేమ్ డైరెక్టర్ జితూ మాధవన్ అందించిన స్క్రిప్ట్ తో ‘మంజుమ్మెల్ బాయ్స్‘ చిత్ర దర్శకుడు చిదంబరం దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. జూన్ 19న హిందీతో పాటు మలయాళం, తెలుగు, కన్నడ, తమిళంలో ‘బాలన్ ది బాయ్‘ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. ‘బాలన్ ది బాయ్‘ సినిమా ప్రఖ్యాత కేన్స్ ఫిలిం ఫెస్టివల్ లో ప్రదర్శితం కానుంది. ఈ నెల 14న కేన్స్ ఫిలిం ఫెస్టివల్ బిజినెస్ వింగ్ అయిన మార్షే డు ఫిలింలో ‘బాలన్ ది బాయ్ ‘ స్క్రీనింగ్ జరగనుంది. గ్లోబల్ సినిమాకు వేదికైన కేన్స్ స్క్రీనింగ్ కు ముందే మేకర్స్ ఈ చిత్ర విడుదల తేదీని ప్రకటించడం విశేషం. మన నేటివిటీతో సాగే కథా కథనాలతో యూనివర్సల్ గా ప్రతి ఆడియెన్ మనసును హత్తుకునే భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని దర్శకుడు చిదంబరం తెరకెక్కిస్తున్నారు. థియేటర్స్ లో తప్పక చూడాల్సిన చిత్రమిది అంటూ మేకర్స్ కాన్ఫిడెంట్ గా చెబుతున్నారు.

## హన్ శివ్ ఎంటర్‌టైన్‌మెంట్స్
# కొత్త సినిమా షురూ



హన్ శివ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై టి .డి.ప్రసాద్ వర్మ దర్శకత్వంలో ఎన్.మహేశ్వరి, పి.జ్యోతి నిర్మిస్తోన్న కొత్త చిత్రం పూజా కార్యక్రమాలతో సోమవారం లాంఛనంగా ప్రారంభమైంది. అనురా గ్, సంతోష్, సాయి విక్రాంత్, అలీ, చమ్మక్ చంద్ర, ఆటో రాంప్రసాద్, ఫణి, వినీత రె డ్డి. ఈ కార్యక్రమంలో ప్ర ముఖ దర్శకుడు ఎస్.వి.కృష్ణారెడ్డి, నిర్మాత కె.అచ్చిరెడ్డి, నటుడు అలీ, డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, ఫణి సహా చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత కె.అచ్చిరెడ్డి క్లాప్ కొ ట్టగా, అలీ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఎస్.వి.కృష్ణారెడ్డి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ టి.డి.ప్రసాద్ వ ర్మ మాట్లాడుతూ అనురాగ్ హీరోగా..ఎన్.మహేశ్వరి, పి.జ్యోతి నిర్మాతలుగా ప్రారంభమైన హన్ శివ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ చిత్రం ఓ డిఫరెంట్ క థాంశంతో ప్రేక్షకుల ను అలరించనుంది. ఈ సినిమా టీ మ్‌ను ఆశీర్వదించటానికి వచ్చిన ఎస్.వి.కృష్ణారెడ్డిగారికి, అచ్చి రెడ్డి గారికి, శ్రీనివాస రెడ్డిగారికి స్పెషల్ థాంక్స్. అలీ ఓ కీలక పా త్రలో మెప్పించనున్నారు. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్నీ ఎలిమెంట్స్‌తో సినిమాను రూపొందిస్తున్నాం. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను తెలియజేస్తాం అన్నారు. హీరో మాట్లాడుతూ ప్రసాద్ వర్మ చెప్పిన పాయింట్ బాగా నచ్చింది.అలీగారికి,ఎస్.వి.కృష్ణారెడ్డిగారికి, అచ్చి రెడ్డికి థాంక్స్ అన్నారు. సీనియర్ నటుడు అలీ మాట్లాడుతూ హన్ శి వ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో రాబోతున్న తొలి సి నిమా. ఇ ందులో నేను కూడా ఓ మంచి పాత్రలో కనిపి ంచబోతున్నాను. సినిమా మంచి విజయాన్ని సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అన్నారు. నిర్మాతలు ఎన్.మహేశ్వరి, పి.జ్యోతి మాట్లాడుతూ ‘‘డైరెక్టర్ ప్రసాద్ వర్మగారు చెప్పిన వైవిధ్యమైన కథాంశంతో సినిమాను రూపొందిస్తున్నాం. మా బ్యానర్‌లో రానున్న తొలి సినిమా ఇది అన్నారు.




# నారా రోహిత్ కొత్త సినిమా

నారా రోహిత్ హీరోగా కొత్త సినిమా ప్రారంభమైంది. ఇది నారా రోహిత్ కెరీర్‌లో 23వ చిత్రం. సోమవారం అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరిగిన ప్రారంభోత్సవంలో ప్రముఖ దర్శకుడు కొరటాల శివ క్లాప్ కొట్టారు. నిర్మాత చదలవాడ శ్రీనివాస్ రావు కెమె రా స్విచ్ ఆన్ చెయ్యగా, తెలంగాణ ఫిలిం డెవెలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ , నిర్మాత దిల్ రాజు ముహూర్తపు షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. కరణ్ సి.ప్రొడక్షన్ బ్యానర్‌పై భరత్ చౌదరి నిర్మిస్తున్న ఈ సినిమాతో చినిమిల్లి మని కుమార్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమాలో నారా రోహిత్ సరసన నయన్ సారికా హీ రోయిన్ గా నటిస్తోంది. సెంటిమెంట్‌తో కూడిన హర్రర్ రొమాన్స్ సినిమాగా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.

# 22న ‘పురుష’ విడుదల



బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు ‘పురుష:’ సి నిమాను నిర్మించారు. ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బ త్తుల హీరోగా పరిచయం కాబోతోన్నారు. ఈ మూ వీకి వీరు వులవల దర్శకత్వం వహించారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా మే 22న రిలీజ్ కాబోతుందని ప్ర కటిస్తూ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ మేరకు ఏ ర్పాటు చేసిన మీడియా సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ నేను ఇలా ఈ స్టేజ్ మీద నిల్చున్నాన ంటే దానికి మా నాన్న కారణం. నన్ను నమ్మి ఈ పాత్రను ఇచ్చిన వీరు అన్నకి థాంక్స్. మా చిత్రం కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఈ సమ్మర్‌లో ‘పురుష:’ మే 22న రాబోతోంది. అందరూ మా సినిమాని చూ సి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను అని అన్నారు.దర్శకుడు వీరు వులవల మాట్లాడుతూ .. ‘‘పురుష:’ విషయంలో నాకు సపోర్ట్ చేసిన నిర్మాత కోటేశ్వరరావుకి థాంక్స్. ఈ జర్నీలో అండగా నిలిచిన మా కెమెరామెన్ సతీష్ కి థాంక్స్. పవన్ కళ్యాణ్ యాక్టింగ్‌కి ఆడియెన్స్ ఫిదా అవుతారు. ఈ సినిమాలో నటించిన సప్తగిరి గారు, కసిరెడ్డి గారు, మా హీరోయిన్లకు థాంక్స్. నేను ‘మళ్లీరావా’, ‘జెర్సీ’, ‘మసూద’ చిత్రాలకు పని చేశాను. నేను ఈ కథని ఎలా అనుకున్నానో అలానే తీయగలిగాను. సమ్మర్ స్పెషల్‌గా మా సినిమాని మే 22న రిలీజ్ చేయబోతోన్నాం. అందరూ చూసి మా మూవీని సపోర్ట్ చేయాలని, ఈ ప్రయాణంలో మీడియా మాకు తోడుగా ఉండాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.సప్తగిరి మాట్లాడుతూ ‘పురుష:’ సినిమా మొత్తం మా డైరెక్టర్ వీరూ పైనే ఆధారపడి ఉంది. మా నుంచి మంచి నటనను రాబట్టుకున్నాడు. సినిమా ఎలా ఉంది.. స్క్రీన్ ప్లే ఎలా ఉంది అనేది తెలి యాలంటే మే 22 వరకు వేయిట్ చేద్దాం. తప్పకుం డా ఆయన తన మార్కు చూపించే ప్రయత్నం చేశాడు. మా దర్శకుడు వీరూ పేరు ఈ ఒక్క సినిమాతో కాకుండా ఒక పది స ంవత్సరాలు వినపడేలా ఉండాలని మనస్ఫూర్తిగా కో రుకుంటున్నామ’ని అన్నారు.ఈ ప్రెస్ మీట్ లో కసిరెడ్డి రాజ్ కుమార్, హాసిని సుధీర్, రాయంచ, విషిక ఉన్నారు.

# 18న పెద్ది ట్రైలర్

రామ్ చరణ్ , బుచ్చిబాబు సాన కాంబినేషన్ లో వస్తున్న పెద్ది సినిమా ట్రైలర్ ను ఈనెల 18వ తేదీన విడుదల చేయనున్నారు. జూన్ 4వ తేదీన ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో ఈ సినిమాకు సంబధించిన ప్రమోషనల్ ఈవెంట్స్ పై దృ ష్టి పెట్టారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి పోస్ట్ ప్రొడక్షన్ పనులను శరవేగంగా జరుపుకు ంటోంది. కుస్తీ పోటీలు, క్రికెట్ నేపథ ్యంలో జరిగే ఈ స్పోర్టట్స్ డ్రామాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఆస్కార్ అవార్డు గ్రహీత ఏ ఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్న ఈ చి త్రానికి బాహుబలి సినిమాకు సినిమాటోగ్రాఫర్ గా పని చేసిన రత్నవేల్ పెద్ది సినిమాకు సినిమాటోగ్రాఫర్ గా పని చేశారు. ఇతర పాత్రల్లో బొమ్మని ఇరానీ, జగపతి బాబు వంటి నటులు కీలకమైన పాత్రల్లో క నిపించనున్నారు. వృద్ధి సినిమా బ్యానర్ పై వెంకట్ సతీష్ కిలారు నిర్మాతగా తెరకెక్కుతున్న ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.




# డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ‘సందిగ్ధం’




డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ‘సందిగ్ధం’ చిత్రంలో నిహాల్, ప్రియా దేశ్ పాగ్, అర్జున్ సిహెచ్, కాజల్ తివారి, నవీన్ రాజ్ సంకరపు ప్రధాన పాత్రల్లో నటించారు. తీర్థ క్రియేషన్స్ బ్యానర్ పై సంధ్య తిరువీధుల నిర్మాణంలో పార్థసారధి కొమ్మోజు దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది.ఇప్పటికే షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనుల్ని కూడా టీం కంప్లీట్ చేసింది. ప్రమోషన్స్ కూడా మొదలు పెట్టిన చిత్రయూనిట్ త్వరలోనే సెన్సార్ వద్దకు వెళ్లనుంది. ప్రస్తుతం ‘సందిగ్ధం’ సినిమా రిలీజ్ డేట్‌ని మేకర్స్ ప్రకటించారు. మే 29న ఈ మూవీని రిలీజ్ చేసేందుకు టీం ము హూర్తం ఫిక్స్ చేసింది. ఈ మూవీకి గౌతమ్ రవి రామ్ సంగీతాన్ని అందించారు. నందన్ కృష్ణ కెమెరామెన్‌గా, విశ్వన్ రాజ్. డివిఎస్ ఎడిటర్‌గా పని చేశారు.జీవా కొచెర్ల, నవీన్ రాజ్ సంకరపు, చిట్టి బాబు, ఆనంద్ భారతి, రైజింగ్ రాజు, అప్పారావు, నాగిరెడ్డి, శ్రీదేవీ, దుర్గ, లక్ష్మి తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించా రు.

# ప్రజలను నిరుత్సాహపర్చిన మోదీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారంహైదరాబాద్ బహిరంగ సభలో చేసిన ప్రసంగం తెలంగాణ ప్రజల ఆశలను పూర్తిగా నీరుగార్చడమే కాకుండా నిరుత్సాహపర్చిందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ప్రధాని నీతి సూత్రాలు వల్లించి ఊకదంపుడుగా ఉపన్యాసం చేశారని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఎందుకు అడ్డుకుంటున్నారో, రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఎందుకు తగ్గాయే సమాధానమే చెప్పలేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే మాతో జట్టుకట్టండని, తమకు అనుకూలంగా వ్యవహరించాలని, ముఖ్యమంత్రికి పరోక్షంగా మోదీ సంకేతమివ్వడం రాజ్యాంగ విరుద్ధమని జాన్ వెస్లీ పేర్కొన్నారు. పెట్రోల్ వాడకాన్ని నియంత్రించాలని, బంగారం కొనవద్దని, విదేశీ పర్యటనలు చేయొద్దని, నిత్యావసర సరుకుల ధరలు పెరగనున్నాయని సంకేతాన్ని ఇచ్చారన్నారు. ప్రధాన మంత్రి మోదీ యుద్ధాన్ని ఆపకుండా, అమెరికా అధ్యక్షుడి ముందు మోకరిల్లే వైఖరి అవలభించడమే ఇందుకు ప్రధాన కారణమని విమర్శించారు. తెలంగాణ గడ్డ, అదే పోరాట స్ఫూర్తితోనే బిజెపికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నిర్వాహకులే ముంచేశారు

(మొదటి పేజీ తరువాయి)

నీరెత్తినట్లు వ్యవహరించటం చూస్తుంటే ఇదంతా అధికారుల అండదండతోనే జరుగుతుందనట్టే అర్థమవుతుంది. అక్లూర్ రైస్‌మిల్‌లో పచ్చలనడ్కుడ సెంటర్ నుంచి వచ్చిన ధాన్యాన్ని మాత్రమే రైస్‌మిల్ యాజమాన్యం దింపుకుని కేటియింపు చేసిన ఇతర సొసైటీ ఐకెపిలకు సంబంధించిన ఇతర సెంటర్ల నుంచి వచ్చిన ధాన్యాన్ని మాత్రం దింపుకోకుండా ఐదారు రోజులు నిలిపివేయటం విస్మయానికి గురి చేస్తుంది. ప్రభుత్వం, అధికారులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ కొనుగోలు సెంటర్లలో మాత్రమే ధాన్యాన్ని అమ్మాలని ఒక వైపు అవగాహన కల్పిస్తూ, జిల్లా కలెక్టర్ సైతం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తుంటే సివిల్ సప్లయి సంబంధిత అధికారులతో కుమ్మకై రైతులను మోసం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం ఉన్న సెంటర్ల ద్వారా ఒకే ఒకటి రెండు రైస్‌మిల్లులకు అలాట్‌మెంట్ చేయటంతో అధికారులకు రైస్‌మిల్లర్లకు మధ్య రూపాయి కారి ఒప్పందం ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఆర్మూర్ ప్రాంతంలో ఎక్కువగా ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యం మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్, వేల్పూర్ మండలంలోని పచ్చలనడ్కుడలో 90 శాతం రైతులు పండించటంతో వారికి నచ్చిన రైస్‌మిల్లులకు అలాట్‌మెంట్ చేయటం జరిగిందని తెలుస్తుంది. జిల్లా అధికారులు అవగాహన కల్పించి మోసపోకుండా చూడాలని, రైతులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అక్కడి రైతులు కోరుతున్నారు.

**మోసపోతామనే ఐకెపి సెంటర్‌లో ధాన్యం అమ్ముతున్నాం : రాజేందర్ రైతు**

ప్రైవేట్ వ్యక్తులకు అమ్మడంతో మోసపోతామని గ్రహించి ప్రభుత్వ ఐకెపి సెంటర్‌లో ధాన్యం అమ్మటం జరిగింది. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే 50 నుంచి 70 రూపాయలు ఎక్కువగా ఇస్తామని సెంటర్ నిర్వాహకులు చెప్పారు. ఆర్‌ఎన్ ఆర్ ధాన్యానికి బయట 2600 ధర ఉంది. కానీ ప్రబుత్వ కొనుగోలు కేంద్రాలలో ఆ ధర మాత్రం ఇవ్వటం లేదు. ప్రైవేట్ వ్యక్తులకు తక్కువకు అమ్ముకుంటే రైతులు అవగాహన లేక వెళ్లినట్లు అవుతుంది. కానీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మిన 2600 ధర రావటం లేదు.

**రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవు : డిఎస్ఒ శ్రీకాంత్‌రెడ్డి**

ఆర్‌ఎన్‌ఆర్‌కు బయట డిమాండ్ బాగా ఉంది. రూ.2600 ఉన్నప్పటికీ రైతులకు అవగాహన లేకపోవటంతో తక్కువ ధరకు బయట అమ్ముకుంటున్నారు. సొసైటీ, ఐకెపి ద్వారా తక్కువకు అమ్మితే రైతు మోసపోయినట్లు అది సొసైటీ ఐకెపి వాళ్లకే తెలుస్తుంది. మా దృష్టికి రాలేదు. రైతులు ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యాన్ని ప్రభుత్వ సెంటర్లలో అమ్మి మోసపోవద్దు. బయట అమ్ముకుంటే ఎక్కువ ధర వచ్చే అవకాశాలున్నాయి. ఒకసారి పచ్చలనడ్కుడ సెంటర్‌ను తనిఖీ చేసి వివరాలు కనుక్కుంటాం. రైతులను మోసం చేస్తే చర్యలు తీసుకుంటాం.

# పేదలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించివ్వాలి

## మంత్రి పొంగులేటికి సిపిఐ వినతిపత్రం

**ప్రజాపక్షం / వరంగల్ :** వరంగల్ నగరంలో ప్రభుత్వ స్థలాలలో పేదలు వేసుకున్న ఇండ్లకు ఇంటి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలని సిపిఐ ప్రతినిధి బృందం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి నాయకత్వంలో సోమవారం హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి సిపిఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చాడా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇండ్ల స్థలాల కోసం, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ఏండ్ల తరబడి పేదలు పోరాడుతూనే ఉన్నారని మంత్రికి వివరించారు. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించేందుకు స్థలం లేక, పక్కా ఇల్లు లేక, దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్లస్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ళు అవుతున్నా ఇంకా రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. పేదలకు, ప్రభుత్వ భూములలో గుడిసెలు, ఇండ్లు వేసుకుని నివసిస్తున్న వారికి ఇంటి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**సానుకూలంగా స్పందించిన మంత్రి :** వరంగల్ నగరంలో దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాలు ఇల్లు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు న్యాయం చేస్తామని, వెంటనే సర్వే నిర్వహించి అర్హులైన వారందరికీ పట్టాలు పక్క గృహాలు నిర్మించి ఇస్తామని సిపిఐ ప్రతినిధి బృందానికి వారు హామీ ఇచ్చినట్లు చాడా వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రతినిధి బృందంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్.కె బాసు మియా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా నాయకులు ఎండి అక్బర్, ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్ పాల్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# రేపటి నుండి ట్రంప్ చైనా పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్–అమెరికాలకు విజ్ఞప్తి చేసింది.

తొమ్మిది సంవత్సరాల తర్వాత మళ్ళీ మొదటిసారి ఒక అమెరికా అధ్యక్షుడు చైనా పర్యటనకు వెళుతున్నారు. 2017లో మొదటిసారి అధ్యక్షుడుగా ఉండగా ట్రంప్ చైనాలో పర్యటించారు. మళ్ళీ ఆయనే రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన ఏడాది తర్వాత అధ్యక్షహోదాలో చైనా పర్యటనకు వెళుతున్నారు. గత ఏడాది దక్షిణ కొరియా బుసాన్‌లో ఈ నాయకులిద్దరూ కలిసినప్పుడు జిన్‌పింగ్ చైనాకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఆయన ఆహ్వానం మేరకే ట్రంప్ చైనాలో పర్యటిస్తున్నారు. పశ్చిమాసియాలో యుద్ధం,చర్చల దౌత్యం విఫలమైన తరుణంలో ఆయన చైనా పర్యటన మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే చమురు సంక్షోభంతో అల్లాడుతున్న ప్రపంచదేశాలు తాజాగా మరోసారి మధ్యవర్తిత్వ చర్చలు విఫలం కావడంతో నిరాశావాదం ఏర్పడింది. చమురు రవాణా 73 రోజులుగా స్తంభించిపోయింది. ఈ నేపథ్యంలో అమెరికా ముఖ్య ఉప పత్రికా కార్యదర్శి అన్నా కెల్లీ సోమవారం వాషింగ్టన్‌లో మాట్లాడుతూ, బుధవారం సాయంత్రం ట్రంప్ బీజింగ్‌కు చేరకుంటారని, వెంటనే స్వాగత సన్మాన కార్యక్రమం తర్వాత గురువారం చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశంలో సంభాషణలు జరుపుతారని చెప్పారు. అదేవిధంగా 15వ తేదీన కూడా జిన్‌పింగ్,ట్రంప్ ఇద్దరూ తేనీటి విందు కార్యక్రమంలో పాల్గొంటారు. ఇద్దరు కలిసి మధ్యాహ్న విందు ఆరగించే ముందుగా సమావేశం జరుపుతారు. గురువారంనాడు టెంపుల్ ఆఫ్ హెవెన్‌లో ట్రంప్ పర్యటిస్తారు. గురువారం రాత్రి ప్రభుత్వ విందు స్వీకరిస్తారు. ఇదిలా ఉండగా, మే 12,13 తేదీలలో చైనా ఉప ప్రధానమంత్రి హే లీఫెంగ్ దక్షిణ కొరియా వెళతారు. అక్కడ నిర్ణీత ప్రకారం అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్‌తో వాణిజ్య చర్చలు జరుపుతారు. ఇదిలా ఉండగా, ట్రంప్ చైనా పర్యటన నేపథ్యంలో అమెరికాతో తమ సంబంధాలు చెక్కు చెదరబోవని తైవాన్ ప్రభుత్వం ధీమా వ్యక్తం చేసింది. ఇటీవలికాలంలో తైవాన్ చుట్టూ యుద్ధ నౌకలను మోహరించడంతో చైనా–తైవాన్ మధ్య యుద్ధ వాతావరణం, ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అమెరికా–చైనా సంబంధాలలో తైవాన్ కూడా ఒక ప్రధానాంశంగా ఉంది.

# జులై 1 నుంచి అమల్లోకి

(మొదటి పేజీ తరువాయి)

రానున్నట్లు సోమవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ కొత్త చట్టం ఒక నూతన చట్రంతో ఉంటుందని, ఇది గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల చట్టబద్ధమైన వేతన ఉపాధిని కల్పిస్తుందని తెలిపింది. ‘విక్షత్ భారత్ @2047’ దార్శనికతకు అనుగుణంగా, భారతదేశ గ్రామీణాభివృద్ధి నిర్మాణంలో ఇది ఒక ‘చారిత్రాత్మక పరివర్తన’ అని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో అభివర్ణించింది. ఈ చట్టం జీవనోపాధి భద్రత, గ్రామీణ ఆదాయాలు, గ్రామస్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధిని బలోపేతం చేస్తూ, ‘భవిష్యత్తుకు సిద్ధంగా, ఉత్పాదకత ఆధారిత గ్రామీణ పరివర్తన’ను తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొంది. మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం, ‘విబి–జి రామ్ జి’ చట్టం జులై 1న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో అమల్లోకి వస్తుంది. అదే తేదీ నుండి ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎ. రద్దు చేయబడుతుంది. అయితే కొత్త విధానానికి మారే ప్రక్రియ కార్మికులకు ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా జరుగుతుందని మంత్రిత్వ శాఖ ప్రకటనలో హామీ ఇచ్చింది. ‘జూన్ 30 నాటికి ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎ. కింద కొనసాగుతున్న పనులను పరిరక్షించి, కొత్త విధానానికి సజావుగా బదిలీ చేయడం జరుగుతుంది’ అని నోటిఫికేషన్‌లో పేర్కొంది. కొత్త ‘గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ కార్డులు’ జారీ అయ్యే వరకు, ప్రస్తుతం ఉన్న ఇకెవైసి ధృవీకరించబడిన ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎ. జాబ్ కార్డులు చెల్లుబాటులో ఉంటాయని, జాబ్ కార్డులు లేని కార్మికులు గ్రామ పంచాయతీ స్థాయిలో నమోదు చేసుకోవడం కొనసాగించవచ్చని తెలిపింది. ఇకెవైసి పెండింగ్‌లో ఉన్నందున కార్మికులకు ఉపాధి నిరాకరించబడదని మంత్రిత్వ శాఖ పేర్కొంది. వేతన చెల్లింపులు, ఫిర్యాదుల పరిష్కారం, కేటాయింపు నిబంధనలు, పరిపాలనా వ్యయం, పరివర్తన నిబంధనలకు సంబంధించిన ముసాయిదా నియమాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో సంప్రదించి సిద్ధం చేస్తున్నామని, త్వరలో ప్రజాభిప్రాయ సేకరణ కోసం వాటిని ప్రచురిస్తామని తెలిపింది. ‘విబి–జి ర్యామ్ జి’ చట్టం చట్రం ప్రకారం, నైపుణ్యం లేని శారీరక పనులు చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వయోజన సభ్యులున్న ప్రతి గ్రామీణ కుటుంబం, ఒక ఆర్థిక సంవత్సరంలో 125 రోజుల హామీతో కూడిన వేతన ఉపాధికి అర్హత పొందుతుంది. ఇది ప్రస్తుతం ఎంజిఎన్ఆర్ఇజిఎ కింద ఉన్న 100 రోజుల హామీ కంటే ఎక్కువ. నిర్ణీత కాలపరిమితిలోగా ఉపాధి కల్పించాల్సి ఉంటుంది. అలా చేయడంలో విఫలమైతే, చట్టంలోని నిబంధనల ప్రకారం కార్మికులు నిరుద్యోగ భృతికి అర్హులుగా ఉంటారు. సకాలంలో, పారదర్శకంగా వేతనాలు చెల్లించడంపై ప్రభుత్వం ప్రస్తావిస్తూ చేస్తూ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి) ద్వారా వేతనాలను నేరుగా కార్మికుల బ్యాంకు లేదా పోస్టాఫీసు ఖాతాల్లోకి బదిలీ చేయడం కొనసాగుతుందని పేర్కొంది. మస్టర్ రోల్ ముగిసిన 15 రోజులలోపు లేదా వారానికోసారి చెల్లింపులు జరుగుతాయి. అలా చేయడంలో విఫలమైతే, కార్మికులు ఆలస్య పరిహారానికి అర్హులు అవుతారు. 2026–27 సంవత్సరానికి రూ. 95,692.31 కోట్ల కేటాయింపు చేయగా, గ్రామీణ ఉపాధి కార్యక్రమానికి బడ్జెట్ అంచనాల ప్రకారం చేసిన కేటాయింపులలో ఇదే అత్యధికమని కేంద్రం తెలిపింది. రాష్ట్రాల సంభావ్య వాటాను కూడా కలుపుకుంటే, ఈ కార్యక్రమానికి అయ్యే మొత్తం ఖర్చు రూ. 1.51 లక్షల కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది.

# దేశాన్ని నడపలేరు

(మొదటి పేజీ తరువాయి)

ఒక పోస్ట్‌లో పేర్కొన్నా రు. ఇవి సలహాలు కావు ఆయన ప్రభుత్వం వైఫల్యానికి నిదర్శనమన్నారు. గత 12 ఏళ్లలో దేశం ఇప్పుడు ప్రజలకు ఏమి కొనాలి, ఏమి కొనకూడదు, ఎక్కడికి వెళ్లాలి, ఎక్కడికి వెళ్లకూడదు అని చెప్పాల్సిన దుస్థితికి చేరుకుందని రాహుల్ గాంధీ అన్నారు. తమ జవాబుదారీతనం నుండి తప్పించుకోవడానికి, వారు పదే పదే బాధ్యతను ప్రజలపైకి నెడుతున్నారని, ఇంత లోపభూయిష్టమైన ప్రధాని ఇకపై దేశాన్ని నడపగల సమర్థుడు కాదు అని ఆయన ఆరోపించారు. ప్రజలు కష్టాల భారంతో కునారిల్లుతున్న తరుణంలో, ప్రధాని పొదుపు గొప్పతనం గురించి దేశానికి ఉపన్యాసాలు ఇవ్వడంలో నిమగ్నమై ఉన్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ‘ఫిబ్రవరి 28న పశ్చిమ ఆసియాలో సంఘర్షణ చెలరేగినప్పుడు, కాంగ్రెస్ పార్టీ ఆ సంక్షోభంలోని ప్రతి కీలక అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించింది... ఆర్థిక వ్యవస్థ విధ్వంసం; రూపాయి నిరంతర పతనం; పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి ధరల పెరుగుదల, కొరత; రైతులకు ఎరువుల కొరత; ఆహార భద్రతకు పొంచి ఉన్న ముప్పు; మందుల ధరల పెరుగుదల; ఎంఎస్‌ఎంఇలు ఎదుర్కొంటున్న సంక్షోభం; ఇంకా మరెన్నో అంటూ ఖర్గే సోమవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. అలాంటప్పుడు ప్రధానమంత్రి ఎన్నికల ప్రచారంలో ఎందుకు అంతగా నిమగ్నమై రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు? అని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం హైదరాబాద్ నుంచి ప్రజలకు చేసిన ‘అనూహ్య విజ్ఞప్తులు’ కఠినమైన పొదుపు చర్యలు రాబోతున్నాయని సూచిస్తున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. క్షేత్రస్థాయి ఆర్థిక పరిస్థితి ప్రభుత్వ ప్రచారానికి చాలా దూరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. లెక్కలు తేల్చే సమయం ఆసన్నమైందని రమేష్ ఉద్ఘాటించారు. ఇంధన ధరల పెంపుతో సహా కఠినమైన పొదుపు చర్యలు రాబోయే అవకాశం ఉందని, వాటిని మరింత ఆమోదయోగ్యంగా మార్చేందుకు ఒక వాతావరణం సృష్టించబడుతోందని ఆయన అన్నారు. పెట్రోలియం ఉత్పత్తులను వివేకవంతంగా వాడుకోవాలని పౌరులను కోరుతూ మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆదివారం ఆయనను విమర్శించింది. అమెరికా–ఇరాన్ యుద్ధం మొదలై మూడు నెలలు గడిచినా, భారతదేశ ఇంధన భద్రతను నిర్ధారించడంపై ప్రధానమంత్రికి అవగాహన లేదని పేర్కొంది. ఈ ప్రపంచ సంక్షోభం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితం కాకుండా చూసేందుకు ఆపత్కాల ప్రణాళికలు రూపొందించకుండా, ప్రధానమంత్రి ప్రజలను అసౌకర్యానికి గురిచేయడం ‘సిగ్గుమాలిన, నిర్లక్ష్యపూరితమైన మరియు పూర్తిగా అనైతికమైన’ చర్య అని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com